


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




# టెక్ యువతే మా బలం




న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026కు హాజరైన సందర్భంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్, డిజిటల్, ఏఐ ఆసియా ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందాని నేతృత్వంలోని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి బృందాన్ని కలిసిన సీఎం చంద్రబాబు నాయుడు

- ఏఐ, క్వాంటం రంగాలలో శిక్షణపై దృష్టి
- నాలెడ్జి, క్రియేటర్ ఎకానమీ కేంద్రం ఏపీ
- టెక్ నైపుణ్యాలున్న యువశక్తికి కొదువ లేదు
- ఏఐ లివింగ్ ల్యాబ్స్, డిజైన్ ఇంజనీరింగ్‌లో భాగస్వామ్యం
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు
- దిగ్గజ పారిశ్రామికవేత్తలతో విస్తృత సమావేశాలు
- ఏఐ సాంకేతికత ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన సీఎం

2

*ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్రియేటర్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు వీలుగా తగిన ప్రణాళికల్ని సిద్ధం చేస్తున్నాం. దీనికి వివిధ టెక్ కంపెనీల భాగస్వామ్యం కూడా అవసరం. ఏపీకి టెక్ నైపుణ్యాలున్న యువశక్తే అతిపెద్ద వనరు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో నిపుణులుగా తయారు చేసేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకుంటాం.*

*-ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తలతో సీఎం చంద్రబాబు*

## ఏపీలో ఎకోసిస్టమ్

నైపుణ్య శిక్షణ, మౌళిక సదుపాయాల కల్పనపై 7 కీలక ఒప్పందాలు

4

## కల్తీ నెయ్యి ఘటనపై ఏకసభ్య కమిషన్

6



2

## సంస్కృతికి చిహ్నంగా స్టేట్ సెంట్రల్ లైబ్రరీ

# వెంకన్నతో పెట్టుకోకు జగన్

### విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ సీరియస్

*ప్రపంచానికే ఆరాధ్యదైవమైన వెంకన్నతో పెట్టుకోవద్దంటూ వైసీపీ నాయకుడు జగన్‌రెడ్డిని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హెచ్చరించారు. శుక్రవారం మండలిలో తిరుపతి వెంకన్న ఫొటోలతో వైసీపీ అనుచితంగా వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "శ్రీవారికి చేసిన మహాపాపం కప్పిపుచ్చుకోవడానికి మహాపరాధం చేసావు. మీకు దేవుడంటే భక్తి, భయం లేదు. హిందువుల మనోభావాలంటే లెక్కేలేదు. కౌన్సిల్‌లో ప్రదర్శించిన శ్రీవారి ఫొటోలు అక్కడే విసిరేసి వెళ్ళిపోవడం క్షమించరాని పాపం. వెంకన్నతో పెట్టుకోవద్దు జగన్" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.*

4



## వైసీపీ ఘోర అపచారం

- కలియుగ దైవం చిత్రపటాలతో రాజకీయాలా..?
- హిందూమత విశ్వాసాలను అవహేళన చేశారు
- సంప్రదాయాలపట్ల వైసీపీ విధానం ఇదేనా?
- జరిగినదంతా జగన్ డైరెక్షన్‌లోనేనని ప్రజలు గ్రహించారు
- వైసీపీ చెంపలు వేసుకుని క్షమాపణ చెప్పాలి
- మండలివద్ద కూటమి భాగస్వామ్య పక్షాల డిమాండ్

6

◆ లాలన



5

విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ఆత్మీయ విందు సమావేశాలు కుటుంబ విలువలకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. రాజమహేంద్రవరం, నర్సాపురం పార్లమెంటు సెగ్మెంట్ల ప్రజాప్రతినిధులు, కుటుంబసభ్యులకు ఉండవల్లి నివాసంలో శుక్రవారం ఆత్మీయ విందునిచ్చి ఆనంద క్షణాలను గడిపారు

◆ పాలన



7

రాజధానిలో నిర్మించే ఐకానిక్ భవనాల్లో శాఖాపరమైన కేటాయింపులపై శుక్రవారం నిర్వహించిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం. రాజధానిలో సాధారణ పరిపాలన శాఖ టవర్‌తోపాటు నాలుగు హెచ్‌వోడీ టవర్లను ప్రభుత్వం నిర్మి స్తుంది. ఈ టవర్లను ఐకానిక్ భవనాలుగా నిర్మించేలా ప్రభుత్వం డిజైన్లు రూపొందించింది.



## సభా పర్వం

- చట్టసభల బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం సభ్యులు లేవనెత్తిన అనేక అంశాలపై మంత్రులు సమాధానాలిచ్చారు. శాంతి భద్రతలు, విద్యుత్, గనులు, పర్యాటకం, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రులు సమాధానాలు ఇచ్చారు.



### భవిష్యత్తును మార్చేలా 'రేర్ ఎర్త్' కారిడార్

- గనుల మంత్రి కొల్లు రవీంద్ర



### పునరుత్పాదక విద్యుదుత్పత్తే లక్ష్యం

- మంత్రి గొట్టిపాటి రవీంద్ర



### ఆస్తుల రక్షణకు రెవిన్యూ సంస్కరణలు

- మంత్రి అనగాని సత్యప్రసాద్




### ఒకేసారి 4 రాష్ట్రాలలో కాంక్రీట్ పనులు

- అమరావతిపై మంత్రి నారాయణ



### బౌద్ధ సర్క్యూట్ల అభివృద్ధికి పెద్దపీట

- మంత్రి కందుల దుర్గేష్



### క్రైం రేటు 6శాతం తగ్గింది

- హోంమంత్రి అనిత

మరిన్ని కథనాలు లోపలి పేజీలలో

చైతన్యరథం

# టెక్ యువతే మా బలం

- నాలెడ్జి, క్రియేటర్ ఎకానమీ కేంద్రం ఏపీ
- ఏఐ లివింగ్ ల్యాబ్స్, డిజైన్ ఇంజనీరింగ్‌లో భాగస్వామ్యం
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు
- సదస్సులో ఏఐ సాంకేతికత ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన సీఎం




ఢిల్లీ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్రియేటర్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు వీలుగా తగిన ప్రణాళికల్ని సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీనికి వివిధ టెక్ కంపెనీల భాగస్వామ్యం కూడా అవసరమని పిలుపునిచ్చారు. ఏపీకి టెక్ నైపుణ్యాలున్న యువశక్తి అతిపెద్ద వనరని వ్యాఖ్యానించారు. వారిని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో నిపుణులుగా తయారు చేసేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకుంటామని సీఎం వెల్లడించారు. ఢిల్లీలోని ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. భారత్ మండపంలో ఉన్న ఏపీ పెవిలియన్‌లో ఆడోబ్ సీఈఓ శాంతనూ నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే, ఆరామ్ కో ఇండియా డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ ఐతుకైర్ ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. వీరితోపాటు లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్, ఆధార్ ఫౌండర్ సీటీఓ శ్రీకాంత్ నాదముని, కాలిఫోర్నియాకు చెందిన ఖోస్లా వెంచర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ ఖోస్లా సీఎంతో భేటీ అయ్యారు. ఏపీలో సౌర విద్యుత్ సహా క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై సౌదీ ఆరామ్ కో ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపారు. ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాలని సౌదీ ఆరామ్ కోను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు ఏపీ అత్యంత అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి వివరించారు. డౌన్ స్ట్రీమ్ పరిశ్రమలతో సహా సమగ్రమైన ఎకోసిస్టమ్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని వెల్లడించారు. ప్రముఖ టెక్ కంపెనీ ఆడోబ్ సిస్టమ్స్ సీఈఓ శంతనూ నారాయణ్‌తో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. ఏపీని నాలెడ్జి హబ్‌గా మార్చడమే తన లక్ష్యమని ఏపీలో క్వాంటం కంప్యూటింగ్, డేటా సెంటర్లు, డ్రోన్, స్పేస్ సిటీల ఏర్పాటుపై దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి వివరించారు.

రియల్ టైమ్ గవర్నెన్స్, పర్సనలైజ్డ్ మెడిసిన్‌వంటి అంశాలపై భవిష్యత్ కార్యాచరణను సీఎం ప్రస్తావించారు. వచ్చే 25 ఏళ్లపాటు దేశానికి, రాష్ట్రానికి అతిపెద్ద వనరుగా యువశక్తి మారనుందని సీఎం వివరించారు. క్రియేటర్ ఎకానమీని పెద్దఎత్తున ప్రోత్సహించడానికి సహకారం అందించాలని అన్నారు. విద్యార్థులు, నిపుణులకు మరింత నైపుణ్యాలను అందించేలా ప్రత్యేకంగా క్రియేటర్ సాఫ్ట్‌వేర్‌ను అందించనున్నట్టు శాంతనూ నారాయణ్ తెలిపారు. ఏఐ లివింగ్ ల్యాబ్స్‌తో పాటు పౌరసేవల డిజిటలైజేషన్ అంశంపై కూడా ఇరువురి మధ్యా లోతైన చర్చ జరిగింది.

## ఏఐ లివింగ్ ల్యాబ్స్‌తో నైపుణ్యం పెంపు

ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు ఎన్విడియా సంస్థ సహకారం అందించాలని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కాలిస్టారెడ్మోండ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆ సంస్థ ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతను ప్రోత్సహించేందుకు భాగస్వామ్యం వహించాలని కోరారు. అలాగే ఐఐటీ తిరుపతి, ఐఐఎస్ఈఆర్ తిరుపతితో కలిసి ఏపీ ఫస్ట్ కార్యక్రమంలో భాగస్వామి కావాలన్నారు. ఏపీలో డిజైన్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ కోసం ఏపీలో జీసీసీ అభివృద్ధి చేయాలని ఆటోడెస్క్ సీఈఓ మైక్ హేలీని ముఖ్యమంత్రి కోరారు. క్వాంటం టెక్నాలజీకి అనుగుణంగా అమరావతిలో ఇన్నోవేషన్ అకాడెమీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ లెర్నింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి పాఠశాల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సహకారం అందించాలని లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్‌ను ముఖ్యమంత్రి కోరారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి నూతన ఆవిష్కరణలను తీసుకురావటంతో పాటు విశాఖలో లెగోల్యాండ్ కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఏపీలో పౌరసేవలతోపాటు స్మార్ట్ గవర్నెన్సు అంశాల్లో ఏఐ సొల్యూషన్స్ అందించే అంశంపై క్వాంటెలా ఇంక్ చైర్మన్ శ్రీధర్ గధితో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. వరల్డ్ బ్యాంక్ గ్రూప్ డిజిటల్ ఏఐ రీజినల్ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్ చందాని కూడా ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు.




## సమ్మిట్‌లో ఏఐ సాంకేతికతను పరిశీలించిన సీఎం

పారిశ్రామిక వేత్తలతో భేటీ అనంతరం భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మింట్‌లోని వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. ఎన్విడియా, నేయసా, టాటా, ఇంటెల్, మైక్రోసాఫ్ట్ సహా వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శనను సీఎం ఆసక్తిగా తిలకించారు. వ్యవసాయం, వైద్యారోగ్యం, పరిశ్రమలు తదితర రంగాల్లో ఏఐ వినియోగం, వస్తున్న ఫలితాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏఐ సమ్మిట్‌లో టాటా సంస్థ ఏపీలో అమలు చేస్తున్న డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమం సంజీవని, డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రదర్శించింది. రోబోటిక్స్, ఏఐ డ్రివెన్ సేవలకు సంబంధించిన యూజ్ కేసెస్‌ను సీఎం ఆసక్తిగా తెలుసుకున్నారు.

## మన చరిత్ర, సంస్కృతికి చిహ్నంగా

# అమరావతి స్టేట్ సెంట్రల్ లైబ్రరీ

- ప్రపంచస్థాయి ప్రమాణాలతో జ్ఞానకేంద్రంగా తీర్చిదిద్దాలి
- విద్యాశాఖపై సమీక్షలో మంత్రి నారా లోకేష్ ఆదేశం
- సెంట్రల్ లైబ్రరీ భవన నమూనాపై పలు సూచనలు చేసిన మంత్రి



ఉండవల్లి (చైతన్య రథం): ప్రజా రాజధాని అమరావతిలో నిర్మించబోయే స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతికి చిహ్నంగా ఉండాలని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అమరావతిలో త్వరలో నిర్మించబోయే స్టేట్ సెంట్రల్ లైబ్రరీ భవన నమూనాను పరిశీలించారు. సెంట్రల్ లైబ్రరీకి సంబంధించి నిపుణులు రూపొందించిన వీడియోను వీక్షించి.. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ఆధునిక సాంకేతిక వసతులతో జ్ఞాన కేంద్రంగా సెంట్రల్ లైబ్రరీని తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "మన చరిత్ర, వారసత్వానికి చిహ్నంగా నిలవాలి. ప్రజల ఆశయాలు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా సెంట్రల్ లైబ్రరీ ఉండాలి. ఆర్కైవ్స్, ఆడిటోరియం వసతులతోపాటు 15 లక్షలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలి. జ్ఞానకేంద్రంగానే కాకుండా విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడాలి. అన్నివర్గాల ప్రజలు సెంట్రల్ లైబ్రరీతో అనుసంధానం కావాలి. ఇందుకు సంబంధించి మొత్తం ఎకోసిస్టమ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి" అని మంత్రి ఆదేశించారు.

## టెన్త్ పరీక్షలు, అభ్యసన సామర్థ్యాల పెంపుపై చర్చ

ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలుతీరు, క్లిక్కర్ వీడియోలు, పదో తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికపైనా సమావేశంలో చర్చించారు. విద్యార్థుల హాజరు, మార్కులు వంటివి తెలుసుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన లీప్ యాప్‌ను ఎంతమంది తల్లిదండ్రులు డౌన్ లోడ్ చేసుకున్నారో మంత్రి ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ టూటర్ వినియోగం, నిడమర్రు పాఠశాల అభివృద్ధి పనులతోపాటు పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం, డీఎస్సీవంటి అంశాలపైనా సమావేశంలో చర్చించారు. సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ వి విజయరామరాజు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఏఐ సమ్మిట్..

# ఏపీ సీఎం బిజీబిజీ...

## వరుస సమావేశాలు.. ఒప్పందాలు.. ట్వీట్లు

ఢిల్లీ (చైతన్య రథం): దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహిస్తున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ టెక్ కంపెనీల సీఈవోలతో భేటీ అయ్యారు. అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే, అరామ్కో ఇండియా డైరెక్టర్ అబ్దుల్ రెహ్మాన్ ఐతుకైర్, లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్, ఆధార్ ఫౌండర్ సీటీఓ శ్రీకాంత్ నాదముని, కాలిఫోర్నియాకు చెందిన ఖోస్లా వెంచర్స్ ఎండీ వినోద్ ఖోస్లాతో ముఖ్యమంత్రి వరుస భేటీలు నిర్వహించారు. ఏపీ రాష్ట్రానికి సహాయ సహకారాలు అందించే అంశాలపై వారితో చర్చించారు. అంతకుముందు వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్న 'కృత్రిమ మేధ ద్వారా పోటీతత్వం' అంశంపై జరుగుతున్న రౌండ్ టేబుల్ సమావేశానికి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమీప భవిష్యత్‌లో




అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు వస్తుందన్నారు.గూగుల్‌లాంటి సంస్థల రాకతో ఏపీలోని విశాఖపట్నం డేటా హబ్ మారుతుం దన్నారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూ టింగ్‌కు సంబంధించిన పరికరాలు తయారు చేసేలా క్వాంటం ఎకో సిస్టమ్ రూపకల్పన చేస్తున్నట్టు చెప్పారు.

దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో ప్రధాని మోదీ పని చేస్తున్నారని, దేశం దానిని సాధించి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐని వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడిటెక్ పార్క్‌లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని, ఈ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, క్వాంటం ఎకోసిస్టమ్ తీర్చిదిద్దుతున్నట్టు చంద్రబాబు వివరించారు.




*అమరావతి క్వాంటం వ్యాలీలో ఏఐ, క్వాంటం కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేతులు కలపడం ఆనందంగా ఉంది. అమరావతి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను సెక్యూర్ ఏఐ కోసం డిజిటల్ ఎంబసీగా ఉంచుతుంది, ఇది యునైటెడ్ నేషన్స్ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సార్వభౌమ, సైబర్ సెక్యూర్ ఏఐ విస్తరణలను అనుమతిస్తుంది. ఈ సహకారం అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు, ప్రపంచ భాగస్వామ్యాలను సాధిస్తుందని విశ్వసిస్తున్నా. ఆంధ్రప్రదేశ్‌ను విశ్వసనీయ ఏఐ అండ్ క్వాంటం సంసిద్ధత యొక్క ప్రపంచపటంలో ఉంచుతుంది. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఇరుపక్షాల మధ్య ఒక ఒప్పందం కుదిరిందని చెప్పడానికి ఆనందిస్తున్నా. యుఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్, యుఎన్ఐసీసీ ఏఐ హబ్ చీఫ్ అనుషా దండపాణిని కలిసి.. వారితో ఈ అంశాలపై చర్చలు జరిపాను.*

*–ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు నాయుడు*




*రాష్ట్రస్థాయి ఏఐ టెక్ హబ్–5 లేయర్డ్ స్వదేశీ ఏఐ స్టాక్ నిర్మించేలా భారత్ జెన్–నెక్స్ జెన్–ఐబీఎంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉంది. ఈ చౌరవ రైతుల నుండి మత్స్యకారుల వరకు పౌరులకు సాధికారత కల్పిస్తుంది. ప్రభుత్వంలోని వివిధ సంస్థలకు సేవలందించడంతోపాటు 22 భారతీయ భాషలను అనుసంధానించేలా ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాం. ప్రొఫెసర్ గణేష్ రామకృష్ణన్ (భారత్‌జెన్), హృషికేశ్ మోహల్ బాల్ (భారత్‌జెన్), ఎఎస్ రాజ్‌గోపాల్ (ఎన్‌ఎక్స్‌టిజెన్), అభిష్యంత్ అనసపురపు (ఎన్‌ఎక్స్‌టిజెన్), డాక్టర్ అమిత్ సింఘీ (ఐబిఎం రీసెర్చ్ ఇండియా), సందీప్ పటేల్ (ఐబిఎం ఇండియా)లను కలవడం ఆనందంగా ఉంది.*

*– ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు*




*దావోస్‌లోని వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో జరిగిన సమావేశం తర్వాత.. న్యూఢిల్లీలోని ఇండియా ఇంపాక్ట్ ఏఐ సమ్మిట్‌లో మిచిగాన్‌కు చెందిన కాలిబో ఏఐ సంస్థ ప్రతినిధులను కలవడం సంతోషంగా ఉంది. ఉన్నతవిద్యా సంస్థల్లో ఏఐ, క్వాంటం టెక్నాలజీని బలోపేతం చేసేలా ఏఐ అకాడెమీ, ఏఐ శాండ్ బాక్స్ ఏర్పాటు చేసేందుకు కాలిబో ఏఐ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. గ్రాడ్యుయేట్లు, పీజీ విద్యార్థులకు అవగాహన కల్పించడం, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కోసం ఏఐ శాండ్ బాక్స్– ఇన్నోవేషన్ ల్యాబ్స్ ఎంతో ఉపయుక్తమని విశ్వసిస్తున్నా. ఏఐ ఇంటిగ్రేటెడ్ కరిక్యులమ్, నైపుణ్య శిక్షణవంటి అంశాలపై ఫోకస్ పెట్టేలా కాలిబో సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం కుదుర్చుకోవడం సంతోషదాయకం. కాలిబో వ్యవస్థాపకుడు రాజ్ వట్టికుటి ఏపీలో జన్మించారు. మన ప్రతిభను, ప్రజా సేవలను బలోపేతం చేయడానికి మనలో ఒకరు ప్రపంచస్థాయి నైపుణ్యాన్ని తీసుకువస్తుండటం గర్వకారణం.*

***–ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు నాయుడు***




*ఆంధ్రప్రదేశ్‌లోని ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటం కంప్యూటింగ్‌లలో లక్షమంది ప్రతిభావంతులైన యువకులకు నైపుణ్యం కల్పించేందుకు ఐబీఎంతో భాగస్వామ్యం కుదుర్చుకున్నాము. రాబోయే 3నుండి ఐదేళ్లలో, మా అభ్యాసకులు పరిశ్రమకు అనుగుణంగా, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నైపుణ్యాలను పొందుతారు. రాష్ట్రంలోని అభివృద్ధి చెందుతున్న సాంకేతిక శ్రామికశక్తిని బలోపేతం చేస్తారు. న్యూఢిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఎస్వీపీ అండ్ ఛైర్ ఆఫ్ ఐబీఎం ఈఎంఈఏ అనా పౌలా, ఐబీఎం ఇండియా అండ్ సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్, ఐబీఎం రీసెర్చ్ ఇండియా అండ్ సీటీవో డైరెక్టర్ అమిత్ సింఘీ, ప్రభుత్వం మరియు నియంత్రణ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీతో లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకం చేశామని చెప్పడానికి ఆనందిస్తున్నాను.*

*–ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు*

*"న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026లో క్వాంటెలా వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీధర్ గాధితో ఉత్పాదక సమావేశం జరిగింది. స్మార్ట్ గవర్నెన్స్, పౌర కేంద్రీకృత ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ఏఐ–డ్రివెన్ సొల్యూషన్లను ఉపయోగించడంపై లోతుగా చర్చించాం"*

*"న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం రౌండ్ టేబుల్ చర్చలో పాల్గొనడం హ్యాపీగా ఉంది. ఏఐతో గ్లోబల్ పోటీతత్వం, భాగస్వామ్య శ్రేయస్సు నిర్మించడంపై విధానపరమైన దృక్పథాలను పంచుకున్నాను."*

*–ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు నాయుడు*



# ఏఐ, క్వాంటం విస్తరణకు

# ఏపీలో ఎకో సిస్టం




- **నైపుణ్య శిక్షణ, మౌళిక సదుపాయాల కల్పనపై 7 ఎంవోయూలు**
- **ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబు హాజరు**
- **ముఖ్యమంత్రి సమక్షంలో వివిధ సంస్థలతో కీలక ఒప్పందాలు**

ఢిల్లీ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ టెక్నాలజీ రంగంలో ఛాంపియన్‌గా నిలిపేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక దృష్టి సారించింది. అమరావతిని క్వాంటం వ్యాలీగా అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. ఈక్రమంలో ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏడు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఐబీఎం సహా ప్రముఖ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు సీఎం చంద్రబాబు సమక్షంలో సాగాయి. ఏపీలో క్వాంటం-ఏఐ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన దిశగా ఈ ఒప్పందాలు ఉపయోగపడనున్నాయి. ఏపీని క్వాంటం-ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడం, అమరావతిలోని క్వాంటం వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయస్థాయి గుర్తింపు తేవడానికి, ఏపీలో ఏఐ-క్వాంటం ఎకో సిస్టం పెంపొందించడానికి బాటలు వేసేలా ఏడు ఎంఓయులను ప్రభుత్వం కుదుర్చుకుంది. అలాగే భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఏఐ-క్వాంటం రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏఐ-క్వాంటం వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడంవంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. సీఎం చంద్రబాబు సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందాలు:

### యూఎన్ఐసీతో..

క్వాంటం, ఏఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ (యుఎన్ఐసీసీ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో ఈ ఏడాది చివరినాటికి ఏఐ క్వాంటం ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఎంఓయులో పేర్కొన్నారు. ఏఐ-క్వాంటం డిజిటల్ ఎంబసీగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించేలా ఈ ఎంఒయూ ఉపకరించనుంది. రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పంద కార్యక్రమానికి యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్ సహా ఆ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు.

### ఐబీఎంతో..

క్వాంటం, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో రాష్ట్రంలోని లక్షమంది యువతకు శిక్షణనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఐబీఎంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఐబీఎం గ్లోబల్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ద్వారా ఐటీ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేలా ఐబీఎం అంగీకరించింది. భారత్‌లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా టెక్ వర్క్ ఫోర్సును సిద్ధం చేసుకునే లక్ష్యాల్లో భాగంగా ఐబీఎం శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించింది. ఒప్పంద కార్యక్రమానికి ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఆ సంస్థ దక్షిణాసియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీ, ఐబీఎం రీసెర్చ్ లాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ తదితరులు హాజరయ్యారు.

### ఎన్ఐఈఎల్ఐటీతో..

ఏపీలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ (ఎన్ఐఈఎల్ఐటీ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి ఏఐ, క్వాంటం డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ప్రణాళిక రూపొందించింది. మౌలిక సదుపాయాలకు కేంద్రం నిధులు కల్పించనుంది. అలాగే భూమి, క్వాంటం హార్డ్‌వేర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చేలా ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిని క్వాంటం కంప్యూటింగ్‌లో నేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమంలో ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి, కంట్రోలర్ జనరల్ డాక్టర్ అలోక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

### జెన్-నెక్స్ జెన్-ఐబీఎంతో..

రాష్ట్రస్థాయి ఏఐ టెక్ హబ్-5 లేయర్డ్ స్వదేశీ ఏఐ స్టాక్ నిర్మించేలా భారత్ జెన్-నెక్స్ జెన్-ఐబీఎంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వంలోని వివిధ సంస్థలకు సేవలందించడంతో పాటు 22 భారతీయ భాషలను అనుసంధానించేలా ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పంద కార్యక్రమంలో భారత్ జెన్ సీఈఓ హృషీకేశ్ మోహల్ బాల్, ప్రతినిధి రామకృష్ణన్‌లు, నెక్స్ జెన్ సీఈఓ రాజగోపాల్, ఐబీఎం రీసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ పాల్గొన్నారు.

### కాలిబో ఏఐ సంస్థతో..

ఏపీలోని 50 ఉన్నతవిద్యా సంస్థల్లో ఏఐ, క్వాంటం టెక్నాలజీని బలోపేతం చేసేలా ఏఐ అకాడెమీ, ఏఐ శాండ్ బాక్స్ ఏర్పాటు చేసేందుకు కాలిబో ఏఐ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. గ్రాడ్యుయేట్లు, పీజీ విద్యార్థులకు అవగాహన కల్పించడం, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కోసం ఏఐ శాండ్ బాక్స్- ఇన్నోవేషన్ ల్యాబ్స్ ఏర్పాటు చేసేలా ఎంఓయూ చేసుకున్నారు. ఏఐ ఇంటిగ్రేటెడ్ కరిక్యులమ్, నైపుణ్య శిక్షణవంటి అంశాలపై ఫోకస్ పెట్టేలా కాలిబో సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం కుదుర్చుకుంది. ఈ ఎంఓయూ కార్యక్రమంలో రాజ్ వట్టికూటి, అరబిందో సాహూ, విపుల్ వలంజీ, పింటో జోయ్సన్, జోహన్నెస్ ష్రోడర్ పాల్గొన్నారు.

### వైజర్ సంస్థతో..

అమరావతి క్వాంటం వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేలా వైజర్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఏడాది చివరినాటికి 3.5 లక్షలమంది ఏఐ-క్వాంటం లెర్నర్లు, 2027నాటికి 6 లక్షలమందిని సిద్ధం చేసేలా ఒప్పందం ఉంది. ఎంఓయూలో క్వాంటం సొల్యూషన్స్ హెడ్ వర్ధన్ సెహగల్, రాజ్ వట్టికూటి బృందం పాల్గొంది.

### మద్రాస్ ఐఐటీతో..

ఏపీలో ఏఐ ట్యూటర్ ఏర్పాటు అంశంపై ఐఐటీ మద్రాస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఎంఓయూ కుదిరింది. కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామ కోటి, ప్రొఫెసర్ మితేష్ పాల్గొన్నారు.



# వెంకన్నతో పెట్టుకోవద్దు జగన్

## విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ సీరియస్



అమరావతి (చైతన్య రథం): ప్రపంచానికే ఆరాధ్యదైవమైన వెంకన్నతో పెట్టుకోవద్దంటూ వైసీపీ నాయకుడు జగన్‌రెడ్డిని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హెచ్చరించారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం మండలిలో తిరుపతి వెంకన్న ఫొటోలు పెట్టుకుని వైసీపీ సభ్యులు అనుచితంగా వ్యవహరించిన తీరుపై లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. "శ్రీవారికి చేసిన మహాపాపం కప్పిపుచ్చుకోవడానికి మహాపరాధం చేసావు జగన్. మీకు దేవుడంటే భక్తి లేదు, భయం లేదు. హిందువుల మనోభావాలంటే లెక్కేలేదు. మీ వైసీపీ ఎమ్మెల్సీలు బూట్లు, చెప్పులతో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి చిత్రపటాలు పట్టుకుని మహాపరాధం చేశారు. అంతేకాకుండా కౌన్సిల్‌లో ప్రదర్శించిన శ్రీవారి ఫొటోలు అక్కడే విసిరేసి వెళ్ళిపోవడం క్షమించరాని పాపం. వెంకన్నతో పెట్టుకోవద్దు జగన్" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏపీ శాసనమండలిలో శుక్రవారం ఉదయం గందరగోళ పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ ద్వారా తితిదేకు నెయ్యి సరఫరాపై చర్చించాలని వైకాపా సభ్యులు రవిబాబు, తూమాటి మాధవరావు, మంగమ్మ ఇచ్చిన వాయిదా తీర్మానాలను మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. దీంతో సభలో వైకాపా ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు.

వేంకటేశ్వర స్వామి ఫొటోలు, ప్లకార్డులు పట్టుకుని పోడియం చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. వైకాపా ఎమ్మెల్సీలు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుని ఫొటో పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వైకాపా ఎమ్మెల్సీలు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో నిరసన తెలపడంపై అధికారపక్ష సభ్యుల తీవ్ర అభ్యంతరం తెలిపారు.





## కుటుంబ విలువల ప్రతిబింబం..

# లోకేష్ ఆతిథ్య సంప్రదాయం

### -కూటమి ప్రజాప్రతినిధులతో కొనసాగుతున్న విందు సమావేశాలు

ఉండవల్లి (చైతన్య రథం): విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ఆత్మీయ విందు సమావేశాలు కుటుంబ విలువలకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. రాజమహేంద్రవరం, నర్సాపురం పార్లమెంటు సెగ్మెంట్ల ప్రజాప్రతినిధులు, కుటుంబసభ్యులకు ఉండవల్లి నివాసంలో శుక్రవారం మంత్రి నారా లోకేష్ విందు సమావేశం ఏర్పాటు చేశారు. కృష్ణా నది ఒడ్డున గోదావరి జిల్లా అతిథులకు మరిచిపోలేని ఆతిథ్యమిచ్చారు. ఆత్మీయ కలయిక వనభోజనాలను తలపించింది. పెద్దల మాటలు, పిల్లల ఆటలు, మహిళల పలకరింపులతో సందడి వాతావరణం నెలకొంది. టీడీపీ,బీజేపీ,జనసేన ప్రజాప్రతినిధులంతా హాజరై కూటమి అంటే మూడు పార్టీలు కాదు, ఒక్కటేనని చాటిచెప్పారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసురత్నం పెన్‌ను లోకేష్‌కు అందించారు. లోకేష్ దంపతుల చిత్రాన్ని వస్త్రంపై ఎంతో ఓపిగ్గా ఎంబ్రాయిడరీ చేసి కానుకగా ఇచ్చారు మరో ఎమ్మెల్యే బొమ్మడి నాయకర్. విందు అనంతరం మహిళలకు మంగళగిరి పట్టుచీరలు కానుకగా అందజేశారు. ఆత్మీయ విందుకు రాజమండ్రి పార్లమెంటు నుంచి ఎమ్మెల్యేలు మంత్రి కందుల దుర్గేష్ (నిడదవోలు-జనసేన), ఆదిరెడ్డి శ్రీనివాస్ (రాజమండ్రి సిటీ), గోరంట్ల బుచ్చయ్యచౌదరి (రాజమండ్రి రూరల్), ముప్పిడి వెంకటేశ్వరరావు (కొవ్వూరు), మద్దిపాటి వెంకటరాజు (గోపాలపురం), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (అనపర్తి-బీజేపీ), బత్తుల బలరామకృష్ణ (రాజానగరం -జనసేన), సోము వీర్రాజు (ఎమ్మెల్సీ-బీజేపీ), నర్సాపురం పార్లమెంటు నుంచి ఎంపీ, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ (బీజేపీ),ఎమ్మెల్యేలు మంత్రి నిమ్మల రామానాయుడు (పాలకొల్లు), డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు (ఉండి), బొమ్మిడి నాయకర్ (నర్సా పురం-జనసేన), బొలిశెట్టి శ్రీనివాస్ (తాడేపల్లి గూడెం-జనసేన), పితాని సత్యనారాయణ (ఆచంట),పులపర్తి రామాంజనేయులు (భీమవరం -జనసేన), ఆరిమిల్లి రాధాకృష్ణ (తణుకు) కుటుంబసభ్యులతో హాజరయ్యారు.










చైతన్యరథం

# వైసీపీ ఘోర అపచారం




- కలియుగ దైవం చిత్రపటాలతో రాజకీయాలా..?
- హిందూమత విశ్వాసాలను అవహేళన చేశారు
- భక్తకోటి మనోభావాలను దెబ్బతీశారు...
- సంప్రదాయాలపట్ల వైసీపీ విధానం ఇదేనా?
- మహాపచారాన్ని మండలి చైర్మన్ ఎలా అనుమతిస్తారు
- సంయమనం పాటించేకొద్దీ రెచ్చగొడుతున్నారు..
- జరిగినదంతా జగన్ డైరెక్షన్‌లోనేనని ప్రజలు గ్రహించారు
- వైసీపీ చెంపలు వేసుకుని క్షమాపణ చెప్పాలి
- మండలివద్ద కూటమి భాగస్వామ్య పక్షాల డిమాండ్

అమరావతి (చైతన్య రథం): ఏపీ శాసనమండలిలో వైకాపా సభ్యులు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోలను ప్రదర్శించడాన్ని కూటమి సభ్యులు తీవ్రంగా ఖండించారు. చైర్మన్ ఛాంబర్ వద్ద మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఎన్డీఏ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వైకాపా చేసిన మహాపచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, గొట్టిపాటి రవి, రామానాయుడు, కొల్లు రవీంద్ర, కూటమి ఎమ్మెల్సీలు నిరసనలో పాల్గొన్నారు. హిందూ మతాన్ని అవమానించారని చైర్మన్ దృష్టికి మంత్రులు తీసుకొచ్చారు. ఇలాంటి చర్యను చైర్మన్ ఎలా అంగీకరిస్తారని నిలదీశారు. వైకాపా చేసింది తప్పేనని మండలి చైర్మన్ మోషేన్ రాజు అంగీకరించారు. వైకాపా సభ్యులను పిలిచి మాట్లాడతానని చైర్మన్ స్పష్టం చేశారు. బహిరంగ క్షమాపణలు చెప్పించి లెంపలేసుకునేలా చేయాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు.



## హిందువుల మనోభావాలు దెబ్బతీశారు: పయ్యావుల

చట్టసభ సాక్షిగా వైకాపా సభ్యులు హిందువుల మనోభావాలు దెబ్బతీశారని శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. హిందూ మతాన్ని రెచ్చగొట్టేలా వైకాపా ప్రవర్తించిందని మండిపడ్డారు. హద్దులుదాటి ప్రవర్తించి దేవదేవుడు పట్ల మహాపచారానికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరు ఎంతో కలచివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగటం తగదన్నారు. సంయమనం పాటించే కొద్దీ రెచ్చగొడుతున్నారని.. హిందువులపట్ల వైకాపా విధానం ఇదేనా? అని నిలదీశారు. వెంకటేశ్వరస్వామి పట్ల తమ పార్టీ విధానం ఇదేనని జగన్ చెప్తున్నారా..? అని ప్రశ్నించారు. హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పేవరకు విషయాన్ని వదిలి పెట్టమని హెచ్చరించారు.

## జగన్ డైరెక్షన్ లోనే: కందుల దుర్గేష్

జగన్ డైరెక్షన్‌లోనే వైకాపా ఎమ్మెల్సీలు స్వామివారిని తీవ్రంగా అవమానించారని పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. జనసేన ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని నిర్లక్ష్యంగా విసిరేయడం తేలిగ్గా తీసుకునే విషయం కాదని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య విలువలపై గౌరవంలేని వైసీపీ నాయకత్వం, దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమని దుర్గేష్ విమర్శించారు. స్వామివారి చిత్రపటాలను సభలోకి తీసుకురావడమే కాకుండా, తిరిగి వెళ్లేటప్పుడు టేబుళ్లపైకి విసిరేయడం అహంకారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మొత్తం వ్యవహారం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలోనే జరిగిందని మంత్రి దుర్గేష్ ఆరోపించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసినందుకు జగన్ మోహన్ రెడ్డి వెంటనే హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## జగన్ క్షమాపణలు చెప్పాలి: సోము

జాతి క్షమించరాని నేరానికి వైకాపా సభ్యులు, జగన్ పాల్పడ్డారని భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు దుయ్యబట్టారు. సభ వాయిదా పడగానే వెంకటేశ్వరస్వామి చిత్రపటాలను ప్లకార్డులతోపాటు విసిరేసి వెళ్లారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతజాతికి జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వరస్వామి అంటే ఇంత చులకన భావమేంటని సోము వీర్రాజు మండిపడ్డారు.



## టీటీడీ నెయ్యి టెండర్ వ్యవహారంపై ఏకసభ్య కమిషన్ నియామకం

అమరావతి (చైతన్య రథం): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి కల్తీ, నాసిరకం నెయ్యి సరఫరా జరిగినట్టు నమోదైన కేసు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను ఏకసభ్య కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన సెల్ఫ్ కంటెయిన్డ్ నోట్‌ను పరిశీలించి, నెయ్యి టెండర్ నిబంధనల సడలింపు, అమలు విషయంలో జరిగిన లోపాలు, నిర్లక్ష్యాలపై సంబంధిత కమిటీ సభ్యులు, సీనియర్ అధికారులపై తగిన చర్యలు సూచించాల్సిందిగా కమిషన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ కేసు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.470/2024గా నమోదు అయింది. ఈ వ్యవహారంపై విచారణను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందానికి అప్పగించారు. సిట్ విచారణ పూర్తి చేసి 23.01.2026న చార్జ్‌షీట్ దాఖలు చేయడంతోపాటు పరిపాలనా పరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

టెండర్ నిబంధనల అమలులో పరిపాలనా లోపాలు ఉన్నాయా లేదా పరిశీలించడంతోపాటు, నిర్ణయాలు నిబంధనల ప్రకారం తీసుకున్నారా లేదా అనే అంశాన్ని కమిటీ పరిశీలిస్తుంది. అవసరమైతే సంబంధిత అధికారుల బాధ్యతను గుర్తించి తగిన పరిపాలనా లేదా క్రమశిక్షణ చర్యలను సిఫారసు చేస్తుంది. కమిటీకి అవసరమైన రికార్డులు కోరే అధికారం ఉండగా, ప్రభుత్వ అనుమతితో నిపుణుల సహాయం తీసుకోవచ్చు. 45 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కమిషన్ నివేదిక సిఫారసుల రూపంలో ఉండగా, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ఈ ఉత్తర్వులు ప్రభావం చూపవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- గ్రామ పెద్దలూ పాఠశాల అవసరాలు తీర్చాలి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- ఉప్పుమాగులూరు జెడ్పీ విద్యార్థులకు 208 సైకిళ్లు




అద్దంకి(చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 208 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రయాణ భారంతో ఎవరూ పాఠశాలలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అద్దంకి నియోజకవర్గ పరిధిలో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ముందుగా 8,9 తరగతుల విద్యార్థులకు మాత్రమే అనుకున్నా., చిన్నారుల కోరిక మేరకు 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు అందరికీ సైకిళ్లను అందిస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకూ దాతల సహాయం తో ఉచిత సైకిళ్లను అందించామన్నారు. ఒక్కొక్కరికీ రూ.6 వేల విలువైన సైకిల్‌ను అందించినట్లు చెప్పారు. మొత్తం 11,400 వరకు సైకిళ్లు అవసరం అవుతాయని, ఇప్పటికే 7 వేల మందికి పైగా అందించామన్నారు. త్వరలోనే మిగిలిన విద్యార్థులకు కూడా సైకిళ్లు ఇస్తామన్నారు. కిషోర్ గ్రానైట్స్ కంపెనీ ద్వారా వెయ్యి సైకిళ్లు, అసిస్ట్ అనే స్వచ్ఛంధ సంస్థ వెయ్యి సైకిళ్లు, సెయిల్ సంస్థ రెండు వేల సైకిళ్లు అందించిందని చెప్పారు. కొన్ని కంపెనీల సీఎస్ఆర్ నిధులు, దాతలు అందించిన డబ్బుతో విద్యార్థులకు సహాయం చేశామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు పుస్తకాలు, మంచి యూనిఫాం, షూలు, బ్యాగులు అందించామని వెల్లడించారు. విద్యార్థులు కూడా మంచిగా చదివి పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించా రు. అదేవిధంగా ఊళ్లో ఉండే గ్రామ పెద్దలు పాఠశాలలను పట్టిం చుకోవాలని సూచించారు. చిన్న చిన్న అవసరాలను తీర్చి, స్కూళ్ల కు సహాయం చేయడానికి గ్రామ పెద్దలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఉప్పుమాగులూరు గ్రామంలో పెద్ద పెద్ద వ్యాపా రులు, డబ్బులు ఉన్నవారు కూడా ఎక్కువగానే ఉన్నారని చమత్క రించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# ఏపీలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గింది

- సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు
- మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయి
- గత ప్రభుత్వంలో మహిళలు భయపడేవాళ్లు
- తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు
- అసెంబ్లీలో హోంమంత్రి వంగలపూడి అనిత

అమరావతి(చైతన్యరథం): ఏపీలో వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే కూటమి నాయకత్వంలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గిందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. హోంశాఖ బడ్జెట్ డిమాండ్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సైబర్ నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వైసీపీ కార్యకర్తలు రప్పా రప్పా అంటూ రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని మంత్రి అనిత హెచ్చరించారు.



రాష్ట్రాభివృద్ధికి లా అండ్ ఆర్డర్ చాలా ముఖ్యమని, అది లేకనే గత ప్రభుత్వంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని వ్యాఖ్యా నించారు. కూటమి ప్రభుత్వ హయాంలో లా అండ్ ఆర్డర్ చక్కగా పనిచేయడం వల్లే క్రైమ్ రేట్ తగ్గింది..అందుకే దేశంలోనే ఎక్కువ పెట్టుబడులు సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని చెప్పా రు. గత ప్రభుత్వ పాలనలో మహిళలు బయటకు రావడానికి కూడా భయపడేవాళ్లు..చట్టబద్ధత లేని దిశా యాప్ పేరుతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కానీ కూటమి ప్రభు త్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మహిళల రక్షణకు కట్టుబడి ఉందన్నారు. శక్తి యాప్, శక్తి టీమ్స్‌తో మహిళా రక్షణకు కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకే రాష్ట్రంలో మహిళ లపై నేరాలు 4.4 శాతం తగ్గాయని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని, గీత దాటితే కటకటాలే అని హెచ్చరించా రు. సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు వివిధ కార్యక్రమాలు ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

### విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై

# అవగాహన పెంచుకోవాలి

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అమరావతి (చైతన్యరథం): నేటి బాలలే దేశ ఆస్తి అని, రాజకీయాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అభిప్రాయపడ్డారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలను వీక్షించడానికి వచ్చిన నెల్లూరు జిల్లా గూడూరు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులను ఆమె పలకరించారు. శాసనసభ సమావేశాల నిర్వహణ, ఎమ్మెల్యేలు, మంత్రుల చర్చ గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఏం కాదలుచుకున్నారని మంత్రి సవిత ప్రశ్నించగా... పలువురు విద్యార్థులు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలపడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందన్నారు. నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత రేపటి తరంపై ఉందన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో అమలు చేస్తున్న పలు పథకాలను విద్యార్థులకు వివరించారు. తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు, విద్యామిత్ర కిట్లు అందాయా.. అని అడగ్గా విద్యార్థులంతా అందాయని చెప్పారు. శ్రీచైతన్య పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘ సమావేశం

- ఐకానిక్ టవర్లలో శాఖలకు భవనాలపై చర్చ
- తెలంగాణ, ఛత్తీస్‌గడ్ సెక్రటేరియట్ల పరిశీలనకు నిర్ణయం
- శాఖల వారీగా కోఆర్డినేటర్లు.. అభిప్రాయ సేకరణకు ఆదేశం
- వివరాలు వెల్లడించిన పురపాలక మంత్రి నారాయణ



అమరావతి(చైతన్యరథం): రాజధానిలో నిర్మించే ఐకానిక్ భవనాల్లో ఏ శాఖకు ఎంతెంత కేటాయించాలని దానిపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. రాజధానిలో సాధారణ పరిపాలన శాఖ టవర్‌తోపాటు నాలుగు హెచ్‌వోడీ టవర్లను ప్రభుత్వం నిర్మి స్తుంది..ఈ టవర్లను ఐకానిక్ భవనాలుగా నిర్మించేలా ప్రభుత్వం డిజైన్లు రూపొందించింది. ఇప్పటికే పనులు కూడా ప్రారంభం అయ్యాయి. గతంలో సెక్రటేరియట్‌లో కేవలం ముఖ్య కార్యదర్శులతోపాటు ఆయా శాఖలకు చెందిన సెక్షన్లు మాత్రమే ఉండేవి. కానీ కొత్తగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల్లో సెక్రటేరియట్ విభాగాలతోపాటు శాఖాధిపతుల కార్యాలయాలు, కార్పొరేషన్ కార్యాల యాలు కూడా ఒకేచోట ఉండేలా నిర్మాణం చేస్తున్నారు. అంటే రాష్ట్రస్థాయి కార్యాలయాలకు చెందిన అన్ని విభాగాలు ఒకే చోట ఉంటాయన్న మాట. దీనికోసం ఏ శాఖకు ఎంత స్థలం అవసరం అవుతుంది అనే దానిపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం నియమించింది. మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, మనోహర్, బాల వీరాంజనేయ స్వామి, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ మొదటి సమావేశం ఇవాళ సెక్రటేరియట్‌లోని రెండో బ్లాక్‌లో జరిగింది. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. సబ్ కమిటీ సమావేశంలో ఐకానిక్ భవనాల నిర్మాణం, పార్కింగ్ సదుపాయాలు వంటి అంశాలతో పాటు రాష్ట్రస్థాయి ఉద్యోగులు ఎంతమంది ఉన్నారనే దానిపై చర్చించినట్లు మంత్రి చెప్పారు. శాఖల వారీగా ఉద్యోగుల వివరాలు, వారికి కావాల్సిన స్థలం, సదుపాయాలపై చర్చించాలని అధికారులకు ఆదేశించినట్టు చెప్పారు. 2014-19 మధ్యలో 52.72 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో భవనాలు డిజైన్ చేశామని.. దీంట్లో 31.71 లక్షల చదరపు విస్తీర్ణంలో కార్పెట్ ఏరియాలో ఉంటుందన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న అవసరాలపై పూర్తిగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు కేబినెట్ సబ్‌కమిటీ నియమించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం మొత్తం 39,882 శాంక్షన్ పోస్టులు ఉన్నాయన్నారు. అయితే ఖచ్చితమైన లెక్కల కోసం ప్రతి డిపార్ట్‌మెంట్ నుంచి ఒకరిని నామినేట్ చేయాలని సీఎస్‌ను కోరుతామని చెప్పారు. 2014-19లో 26,700 మంది ఉద్యోగులు ఉంటారని... దానికి తగినట్లుగా భవనాలు డిజైన్ చేశామని చెప్పారు.. మరోవైపు ఇటీవల కొత్తగా నిర్మించిన నయా రాయపూర్, హైదరాబాద్‌లోని సచివాలయాలను కూడా పరిశీలిం చాలని అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. వచ్చే సోమవారం మరోసారి క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశమై ఆయా అంశాలపై చర్చిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శౌంఠి శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాబోయే 48 గంటల్లో అల్పపీడనం

అమరావతి (చైతన్యరథం) హిందూ మహాసముద్రం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంపై విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాబోయే 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందందని పేర్కొంది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు ప్రజలు చెట్ల కింద ఉండరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# సీబీఐ నివేదికలున్నా 'క్లీన్ చిట్' నాటకం

- తిరుమల కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి తప్పించుకోవడానికే హెరిటేజ్‌పై వైసీపీ బురదజల్లింపు
- మత భావోద్వేగాలను రెచ్చగొట్టి అవినీతిని కప్పిపుచ్చే జగన్ ముఠా ప్రయత్నం బహిర్గతమైంది
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అమరావతి/విజయవాడ (చైతన్యరథం): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడినట్టు సీబీఐ నివేదికల్లో తేలింది. అందుకే గత ప్రభుత్వంలో జరిగిన వైఫల్యాలు, అవినీతి ఆరోపణలను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ నేతలు దారి మళ్లింపు రాజకీయాలకు దిగుతున్నారు' అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఘాటుగా విమర్శించారు. కోట్లాది హిందువుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక అయిన ప్రసాదాన్ని కల్తీ చేయడం దుర్మార్గమన్నారు.

సీబీఐ నివేదిక వెలుగులోకి వచ్చిన తర్వాత బాధ్యత వహించాల్సిన చోట, జగన్‌రెడ్డి, ఆయన ముఠా తమకు తామే 'క్లీన్ చిట్' ఇచ్చుకున్నట్టు ప్రచారం చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమని పల్లా వ్యాఖ్యానించారు. అయితే జాతీయ మీడియా, స్వామీజీలు, పూజారులు, మత పెద్దలు, తిరుమల భక్తులు తీవ్రంగా స్పందించడంతో ఆ ప్రచారం నిలవలేకపోయిందన్నారు. తిరుమల వంటి పవిత్ర క్షేత్రంలో ప్రసాదం తయారీలో కల్తీ ఎలా జరిగిందన్న ప్రశ్న దేశవ్యాప్తంగా వినిపించిందన్నారు.

తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్వయంగా కల్తీ జరిగిందని ఒప్పుకున్నా, ఆ అంశాన్ని పక్కనపెట్టి లేనిపోని సంస్థలపై ఆరోపణలు చేయడం ద్వారా అసలు దోషాల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ దారిమళ్లింపు మాత్రమేనని తెలిపారు.

నిజాలు బయటపడుతున్న క్రమంలో, కల్తీ నెయ్యి వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే హెరిటేజ్ సంస్థను వివాదంలోకి లాగారని పల్లా ఆరోపించారు. తిరుమల దేవస్థానానికి కల్తీ నెయ్యి సరఫరా చేసిందన్న నిరాధార ఆరోపణలను ప్రచారంలోకి తెచ్చారని విమర్శించారు. ఇందాపూర్ డెయిరీతో హెరిటేజ్‌కు యాజమాన్య సంబంధం ఉందన్న అపోహలు సృష్టించారని, అయితే ఇందుకు ఒక్క ఆధారమూ చూపించలేకపోయారని స్పష్టం చేశారు.

హెరిటేజ్ సంస్థపై ప్రచురితమైన పరువు నష్టం కలిగించే కథనాల విషయంలో ఢిల్లీ హైకోర్టు జోక్యం



చేసుకుని 24 గంటల్లోగా సంబంధిత కంటెంట్ తొలగించాలని ఆదేశించడం గమనార్హమన్నారు. అసత్య ఆరోపణలు చట్టపరమైన పరిశీలనను తట్టుకోలేవన్నది స్పష్టమైందని వ్యాఖ్యానించారు.

మూడు దశాబ్దాలకు పైగా నిష్కళంక చరిత్ర కలిగిన హెరిటేజ్ సంస్థపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. నాణ్యతకు మారుపేరుగా నిలిచిన హెరిటేజ్ సంస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు చేసిన ఈ దుష్ప్రచారానికి చట్టపరమైన సమాధానం రావడం సహజమన్నారు. అందుకే బొత్స సత్యనారాయణకు హెరిటేజ్ ఫుడ్స్ లీగల్ నోటీసు జారీ చేసిందన్నారు. బేషరతు క్షమాపణతో పాటు నష్టపరిహారం కోరుతూ నోటీసు ఇవ్వడం వైసీపీ అసత్య ప్రచారానికి గట్టి హెచ్చరికగా అభివర్ణించారు.

గత వైసీపీ పాలనలో ప్రభుత్వ భూములు, ప్రత్యేక జీవోల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన చరిత్రను ప్రజలు మర్చిపోలేదన్నారు. భారతి సిమెంట్స్, సాక్షి వంటి సంస్థలకు ప్రజల సొమ్మును మళ్లించిన వారే ఇప్పుడు ఇతరులపై బురదజల్లడం విడ్డూరమన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కోట్లాది హిందువుల భావోద్వేగాలను అడ్డుపెట్టుకోవడం సమంజసం కాదన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు అమాయకులు కారని, జగన్ ముఠా చేస్తున్న వాటిని వారు స్పష్టంగా గమనిస్తున్నారని తెలిపారు. పవిత్ర క్షేత్రమైన తిరుమలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటే సమాజం సహించదన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారం లో పూర్తి నిజాలు వెలుగులోకి వచ్చి బాధ్యులు శిక్షార్హులవుతారని, ఆలస్యమైనా సత్యమే గెలుస్తుందని శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు.

## ప్రశ్నోత్తరాల కోసం హోంవర్క్ బాగా చేశారు

**మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు రఘురామకృష్ణరాజు ప్రశంస**



అమరావతి (చైతన్యరథం): శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సభాధ్యక్ష స్థానంలో ఉన్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ప్రశంసించారు. సభ్యులకు సమాధాలిచ్చేందుకు హోంవర్క్ బాగా చేశారు' అని వ్యాఖ్యానించారు.

అనంతపురంలోని సర్వజనాసుపత్రిలో ఆ ప్రాంత ప్రజల అవసరాల మేరకు వైద్య సేవలు అందుతున్నాయా అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రధాన ప్రశ్న సంధించారు. అనంతపురం రూరల్ ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పలు అనుబంధ ప్రశ్నలను లేవనెత్తగా మంత్రి సత్యకుమార్ యాదవ్ పూర్తి వివరాలతో సమాధానమిచ్చి సభాధ్యక్షుని మన్నన పొందారు.

అనంతపురం సర్వజనాసుపత్రిలో 560 పడకలు మాత్రమే మంజూరు కాగా ప్రస్తుతం మొత్తం 1,348 పడకలతో విస్తృతమైన సేవలు ప్రజలకు అందుతున్నా యని, ఇందులో 1205 సాధారణ పడకలుండగా మరో 143 ఐసీయూ పడకలున్నాయని మంత్రి వివరించారు. ఈ విధంగా భారీ పడకల సంఖ్యతో ప్రజలకు సేవలందించేందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు న్నాయని తెలిపారు. ఈ ఆసుపత్రిలో ఎం సీహెచ్ నిర్మాణం కోసం గత ప్రభుత్వం 2020లో పరిపాలనా అనుమతి ఇచ్చిందన్నారు. అనంతరం పనులు మందకొడిగా సాగాయని, తొలుత మొత్తం 7 అంతస్తులతో ఈ బ్లాకు నిర్మాణం జరగాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించినా 2 ఫ్లోర్లను మాత్రమే గత ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఐదంతస్తుల నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. ఆర్అండ్‌బీ స్థలానికి సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులతో చర్చించామన్నారు.

పీఎంఅభీమ్ పథకం కింద చేపట్టిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాకు నిర్మాణాన్ని శీఘ్రతరం చేశామని, మరో మూడు నెలల్లో పూర్తి చేస్తామని మంత్రి సభకు తెలిపారు.

ఆసుపత్రిలో ఉచిత మందుల సరఫరా పై స్పందిస్తూ... ఈ విషయంలో గత ప్రభుత్వం రూ.1000 కోట్ల మేర బకాయి లు పెట్టి సరఫరాదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన మొదట్లో ఈ విష యంలో సమస్యలు ఎదురైన మాట వాస్త వమేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం బకాయిలను చెల్లించి మందుల సరఫరా వ్యవస్థను గాడిన పెట్టడంతో మందుల సరఫరా సజావుగా జరుగుతోందన్నారు. గతానికి భిన్నంగా మందులకు సంబంధించిన మొత్తంకేటాయింపుల్లో 20 శాతం మేరకు ఆసుపత్రుల స్థాయిలో అవసరాల ను బట్టి మందుల్ని కొనుగోలు చేసేందు కు వెసులుబాటు కల్పించడంతో సత్ఫలితా లొస్తున్నాయని మంత్రి వివరించారు.

అనంతపురం ఆసుపత్రిలో పరిశుభ్రత (శానిటేషన్), భద్రత (సెక్యూరిటీ) సేవలపై ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అడిగిన అనుబంధ ప్రశ్నకు మంత్రి సవివరమైన సమాధానమిచ్చారు. ఈ రెండు సేవలకు సంబంధించి పక్కా లెక్కలతో సిబ్బంది అవసరాల్ని గుర్తించి వివిధ ఏజెన్సీలకు సేవల బాధ్యత అప్పగించామని, ఈ దిశగా ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం) ఆధారంగా సిబ్బంది కేటాయింపు, హాజరులను పర్యవేక్షిస్తున్నామని వివరించారు. సిబ్బంది కేటాయింపులు లక్ష్యాల మేరకు జరగక పోయినా, ఇతర ఏవైనా అక్రమాలు జరిగినా జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

## బౌద్ధ సర్క్యూట్‌ల అభివృద్ధికి పెద్దపీట

- టీంస్‌లో ఏపీ పురావస్తు సంపద తెచ్చేందుకు చర్యలు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి కందుల దుర్గేష్



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలోని చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు, పురావస్తు తవ్వకాలను ముమ్మరం చేయడంతో పాటు బౌద్ధ సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తామని పర్యాటక, సాంస్కృ తిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శు క్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండ లి బుద్ధప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కందుల దుర్గేష్ క్లుప్తంగా సమాధానమిచ్చారు. రాష్ట్ర విభజనకు ముందు ఆంధ్రప్ర దేశ్‌లో 65 ప్రాంతాల్లో, విభజన తర్వాత పురావస్తు శాఖ 3 ప్రధా న ప్రాంతాల్లో ఫీల్డ్ సీజన్‌లో పురావస్తు శాఖ తవ్వకాలు జరిపిందని తెలిపారు. 2014-15, 2015-16లో జరిపిన తవ్వకాల్లో కాకినా డ జిల్లా ఎ.కొత్తపల్లి (పెద్దమెట్ట) బౌద్ధ క్షేత్రంలో మహాస్థూపాలు, 8 ఓటివ్ స్థూపాలు (చిన్న స్థూపాలు), విహారాలు(నివాస ప్రాంతాలు), ఎర్రమట్టి పాత్రలు బయటపడ్డాయని.. అలాగే పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తవ్వకాలు జరపడం కష్టమని భావించి పోలవరం ముంపు ప్రాంతాలైన రుద్రమకోట, రాయనపేటలలో 2017-18 లో తవ్వకాలు జరపగా క్రీ.పూ.1000-300 నాటి ప్రాచీన మాన వుడి సమాధులు (మెగా లిథిక్స్), ఇనుప వస్తువులు, మట్టి పాత్రలు లభ్యమయ్యాయని వివరించారు. ఈ తవ్వకాలకు ప్రత్యేక బడ్జెట్ అంటూ ఏమీ లేదని పోలవరం ప్రాజెక్టులో భాగంగా పురా వస్తు శాఖ ఎక్స్‌కవేషన్ బడ్జెట్‌లో నుంచి వినియోగించి తవ్వకాలు జరిపామని స్పష్టం చేశారు. తెలంగాణలో ఉండిపోయిన ఏపీ పురావస్తు సంపదను తిరిగి రప్పించే విషయమై త్వరలోనే ఇరు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో దీనిని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పురావస్తు శాఖ ద్వారా మరిన్ని తవ్వకాలు చేపట్టడం, దొరికిన అవశేషాలను నిక్షిప్తం చేయడం, సంబంధిత అంశాలను గ్రంథస్థం చేయడం వాటిని ప్రజల సందర్శనార్థం మ్యూజియంలో పెట్టడం ఆవశ్యకమని భావిస్తున్నామని తెలిపారు. 154 పోస్టులకు గాను 54 మంది సిబ్బంది ఉన్నారని సిబ్బంది కొరతను తీర్చాలని కోరారు. కళింగుల రాజధానిగా కీర్తిపొందిన శ్రీకాకుళం జిల్లా దంతపురం, విజయనగరం జిల్లా గుడివాడకొండలలో రాబోయే రోజుల్లో తవ్వకాలు చేపడతామని ప్రకటించారు. పురావస్తు శాఖ లో సిబ్బంది కొరతను తీర్చడం, తవ్వకాల్లో దొరికిన అవశేషాలను భద్రపరిచి మ్యూజియాల్లో ప్రదర్శనకు ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. హైదరాబాద్‌లోని మ్యూజియం మాత్రమే కాక ఏలూరులోని మ్యూజియం, రాజమహేంద్రవరంలోని రాళ్ల బండి సుబ్బారావు మ్యూజియంలకు ప్రత్యేక చరిత్ర ఉందని ఆయా మ్యూజియాల్లో సంబంధిత నివేదికలు పొందు పరిచేందుకు అవకాశం ఉంద న్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే. రంగారావు(బేబీ నాయన) అడిగినట్లుగా చిత్రకోట బౌద్ధక్షేత్రం అంశం తమ పరిగణలో ఉందన్నారు.

**'బౌద్ధ సర్క్యూట్'గా అభివృద్ధి చేస్తాం**

ఏపీలో బౌద్ధమత వ్యాప్తికి నిలయాలైన అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఆదుర్రు, తొట్లకొండ, బావికొండ, చిత్రకోట వంటి ప్రాంతాలను కలిపి 'బౌద్ధ సర్క్యూట్'గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావ త్ సహకారంతో, కేంద్ర బడ్జెట్ కేటాయింపులను ఉపయోగం చుకుని అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఏపీలో బౌద్ధమత వ్యాప్తి జరిగిన బౌద్ధ క్షేత్రాలను సర్క్యూట్‌గా చేయాలని ఇప్పటికే టూరిజం శాఖ, పురావస్తు శాఖ సంయుక్తంగా కేంద్రాన్ని కోరిందని, తాము కేంద్రానికి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించిన వెంటనే బుద్దిస్ట్ సర్క్యూట్‌లకు సంబంధించిన అభివృద్ధి చేయను న్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మాట్లాడు తూ..తెలుగు భాషసంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక అంశాలపై మండలి బుద్ద ప్రసాద్‌కు ఉన్న శ్రద్ధను, మంత్రి కందుల దుర్గేష్ ఆసక్తిని అభినందించారు. కేంద్రంనుంచి నిధుల సాధన కోసం తామంతా కలిసి కృషి చేస్తామని పేర్కొన్నారు.

చైతన్యరథం

# ప్రజల ఆస్తుల రక్షణకు రెవెన్యూలో సంస్కరణలు

- వివాదాలకు ఆస్కారం లేకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీ
- భూ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- 22ఎ నిషేధిత జాబితా భూముల సమస్యకు ప్రత్యేక డ్రైవ్
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్, విపత్తు నిర్వహణకు రూ.3,867 కోట్లు
- కేసుల స్థితి కోసం ఆన్‌లైన్ రెవెన్యూ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టమ్
- ఇనాం భూములు..త్వరలోనే పరిష్కారం చూపుతాం
- బడ్జెట్ కేటాయింపులపై చర్చలో మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి(చైతన్యరథం): శాసనసభలో శుక్రవారం రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్, విపత్తు నిర్వహణ పద్దు కింద రూ. 3,867.53 కోట్ల బడ్జెట్ కేటాయింపులను రెవెన్యూ శాఖా మంత్రి అనగాన సత్యప్రసాద్ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా బడ్జెట్ కేటాయింపులపై జరిగిన చర్చలో మంత్రి అనగాని మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన పాపాలను ఇప్పటికీ కడుగుతూ ఉన్నామని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో వైసీపీ నేతలు ప్రభుత్వ, ప్రజల భూములను కబళించారని మండిపడ్డారు. రీ సర్వే, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అడ్డం పెట్టుకుని లక్షా 75 వేల ఎకరాలను కాజేయలని ప్రయత్నించారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ వ్యవస్థలో పూర్తిస్థాయి సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే డిజిటల్ వ్యవస్థలో కలిపి..ట్యాంపర్ చేయడానికి వీలులేకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భూమి రికార్డులను భద్రంగా ఉంచుతు న్నామన్నారు. పాత రెవెన్యూ రికార్డులను అత్యాధునిక టెక్నాలజీతో స్కాన్ చేసి సురిక్షత, శాశ్వత డిజిటల్ గుర్తింపుతో భద్రపరుస్తు న్నామని తెలిపారు. దీంతో ఫైల్ పోయింది అనే సమస్య ఉండదని, బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా లిటిగేషన్ సమస్యలను కూడా తగ్గుతాయని చెప్పారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న పాత పొరపాట్లను సరిచేసే ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని, దీని వల్ల విశ్వసనీయ, ఖచ్చి తమైన, వివాదాలకు ఆస్కారం లేని భూ రికార్డులు సిద్ధమవుతాయని చెప్పారు. ప్రతి వారం జిల్లాస్థాయిలో రెవెన్యూ క్లినిక్స్ నిర్వహించి రెవెన్యూ అధికారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి అక్కడికక్కడే ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. కేసుల స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునేందుకు, పర్యవేక్షించేందుకు ఆన్‌లైన్ రెవెన్యూ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి తన బొమ్మల పిచ్చితో తప్పులతో కూడిన నాసిరకం పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారని విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం పట్టాదార్ పాస్‌బుక్ ముద్రించే ముందు వఖ్జ ద్వారా ప్రతి వ్యక్తి తన వివరాలను చెక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని, పొరపాట్లు ఉంటే గ్రామానికే వచ్చి సరిచేస్తారని, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అన్నారు. రీ-సర్వే చేసిన గ్రామాల్లో రాజముద్రతో 15 రకాల రక్షణ అంశాలతో కూడిన పొరపాట్లు లేని పట్టాదార్ పాస్‌బుక్ అంది స్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ పాపాల కారణంగా పెరిగిపోయిన 22ఎ నిషేధిత జాబితా భూముల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. 22ఎ జాబితా నుంచి ప్రైవేట్ భూముల తొలగింపు సరళతరం చేసేలా అధికారాల బదలాయింపు చేశామన్నారు. ఈ జాబితా వాటిని తొలగించే అధికారం ఆర్డీవోలకు అప్పగించామన్నారు. ఒకవేళ ఏదైనా భూమిని 22ఏ జాబితాలో చేర్చాలంటే ఆ పట్టాదారునికి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ, ఈకేవైసీ ద్వారా గానీ నోటీసులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఆ తర్వాత కచ్చితమైన విచారణ చేసి సరైన కారణాలతో ఉత్తర్వులు ఇవ్వాలని చెప్పారు. తాను అధికారులతో ప్రత్యేక సమావేశాలు పెట్టి జిల్లాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు పెట్టి సామాన్యులకు నష్టం లేకుండా 22ఏ భూముల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పదేళ్లకు పూర్వం అసైన్ చేసిన ఇంటి స్థలాలన్నింటికీ కన్వేయన్స్ డీడీలు ఇస్తామని, ఇక వాటిపై వరికి పూర్తి హక్కులు లభిస్తాయని చెప్పారు. ఇనాం భూములపై జీవోఎం త్వరలోనే పరిష్కారాన్ని చూపుతుందని తెలిపారు.

---

## అమరావతి నిర్మాణంలో మరో కీలక ఘట్టం



- ఒకేసారి 4 రాఫ్ట్‌లలో కాంక్రీట్ పనులు ప్రారంభం
- హైకోర్టు భవన ఫౌండేషన్ పనుల ప్రారంభం
- పాల్గొన్న పురపాలక మంత్రి పొంగూరు నారాయణ

అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో భాగంగా హైకోర్టు భవన నిర్మాణ పనులు శరవేగంగా పుంజు కున్నాయి. శుక్రవారం హైకోర్టు నిర్మాణ ప్రాంగణంలో ఒకేసారి 4 రాఫ్ట్‌లలో కాంక్రీట్ పనులను మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏజీఐసీఎల్) ఎండీ శ్రీనివాస్, ఇతర ఉన్న తాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడు తూ ఏకధాటిగా 15,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ స్లాబ్ (రాఫ్ట్) పనులను నేడు చేపట్టాం. మొత్తం నిర్మాణంలో 65,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వినియోగిస్తుండగా.. ఇప్పటికే 15,000 క్యూబిక్ మీటర్లు పూర్తయింది. నేటితో మరో 15,000 క్యూబిక్ మీటర్ల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ హైకో ర్టు భవనాన్ని B+G+8 (బేస్‌మెంట్ + గ్రౌండ్ + 8 అంతస్తులు) విధానంలో 50.4 మీటర్ల ఎత్తుతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మి స్తున్నామని వివరించారు. మొత్తం 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ భవనంలో 52 కోర్టు హాళ్లు అందుబా టులోకి రానున్నాయి. నిర్మాణంలో అత్యంత కీలకమైన 'రాఫ్ట్ ఫౌండేషన్' పనులు పూర్తయితే మిగిలిన భవన నిర్మాణం చాలా వేగంగా కొలిక్కి వస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధానిలో కేవలం కార్యాలయాలే కాకుండా.. పాలన సాగించే యంత్రాంగం కోసం నివాసాల నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుందని మంత్రి వివరించారు. అమరావతిలో అధికారులు, ఉద్యోగుల కోసం మొత్తం 4,026 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. వీటిలో 3,500 ఇళ్లను ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఐఏఎస్ అధికారుల నివాస భవనాలు ఇప్పటికే దాదాపుగా పూర్తి కావచ్చాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షణలో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు.

---

## 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తే లక్ష్యం

- దేశంలో తొలిసారి ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమిదే
- విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి రూ.890 కోట్లు ఆదా
- 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సరఫరా
- బడ్జెట్‌పై చర్చలో మంత్రి గొట్టిపాటి రవికుమార్
- విద్యుత్ రంగాన్ని వైసీపీ నాశనం చేసిందని మండిపాటు



అమరావతి(చైతన్యరథం): ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ రంగాన్ని దీర్ఘకాలిక స్థిరత్వం, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, వినియోగదా రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ రంగమే మూల స్తంభమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అసెంబ్లీలో పేర్కొన్నారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు నాంది పలికిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని తెలిపారు. ఆయన చేపట్టిన సంస్కరణల ఫలితంగానే సాంకేతిక రంగం అభివృద్ధి సాధ్యమైంద న్నారు. 2014--19 కాలంలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిపామని, అదే సమయంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 7 గిగావాట్లకు పెంచిన ఘనత ఆ ప్రభుత్వానిదని చెప్పారు.

### వైసీపీ పాలనలో ప్రజలపై భారం

2019-24 మధ్య కాలంలో విద్యుత్ వ్యవస్థ తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో పడిందని విమర్శించారు. తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ట్రూ-అప్ చార్జీల పేరిట సుమారు రూ.30 వేల కోట్ల భారం ప్రజలపై మోపారని మండిపడ్డారు. ప్రస్తుతం అప్పుల్లో కూరుకుపోయిన విద్యుత్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలను వైసీపీ నాయకులు రాష్ట్రం నుంచి తరిమికొట్టారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్ 21,457 మెగావాట్ల ఇన్‌స్టాల్డ్ కెపాసిటీతో ముందు వరుసలో ఉందని తెలిపారు. అందులో 37 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే ఉత్పత్తి అవుతోందన్నారు. ఇటీవల ఏపీ జెన్కో 6 వేల మెగావాట్ల ఉత్పత్తితో రికార్డు స్థాయి సాధించిందని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరగడంతో దేశం లో తొలిసారిగా 13 పైసలు ట్రూ డౌన్ చేసి వినియోగదారులకు ఉపశమనం కల్పించామని చెప్పారు. యూనిట్ కొనుగోలు ధరను రూ.7.71 నుంచి రూ.6.35కు తగ్గించడం ద్వారా 2025--26 ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.340 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.550 కోట్లు ఆదా సాధించామని వెల్లడించారు.

### విద్యుత్ సబ్సిడీకి ఈ బడ్జెట్‌లో రూ.13 వేల కోట్లు

ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బడ్జెట్‌లో రూ.13 వేల కోట్లు విద్యుత్ సబ్సిడీకి కేటాయించామని తెలిపారు. 22 లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, వ్యవసా య, అనుబంధ రంగాలకు రోజుకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాల వినియోగ దారులకు 24 గంటల నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, 20 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామని తెలిపారు. చేనేత, దోభీ, సెలూన్లకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నామని వివరించారు. ఏప్రిల్ 1 నుంచి హ్యాండ్లూమ్‌కు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు 500 యూనిట్లు ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీతో పీఎం సూర్యఘర్ పథకాన్ని అమ లు చేస్తున్నామని తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో ద్వారా గ్రిడ్‌ను బలోపే తం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 378 ఈహెచ్‌టీ సబ్ స్టేషన్లు, 71,549 ఎంవిఏ సామర్థ్యం, 33,000 కి.మీ పైగా ట్రాన్స్‌మిషన్ లైన్లు ఉన్నాయని వివరించారు. 950 సర్క్యూట్ కిలోమీటర్ల లైన్ల చార్జింగ్ ద్వారా గ్రిడ్ కనెక్టివిటీ మెరుగుపడిందని తెలిపారు. 2000 మెగావాట్ సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ నిల్వ వ్యవస్థ ప్రాజెక్టుకు అనుమతి లభించిందని, దేశంలోనే అత్యల్ప టారిఫ్‌తో ఇది అమలు అవుతోందని పేర్కొన్నారు. విద్యుత్ రంగా న్ని సమగ్రంగా పునరుద్ధరిస్తూ, పునరుత్పాదక ఇంధన విస్తరణతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

# అమరావతిలో పోలీస్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు





- ప్రారంభించిన హోంమంత్రి అనిత, డీజీపీ
- 160 దేశాల్లో లైవ్ టెలికాస్టింగ్‌కు ఏర్పాట్లు

అమరావతి(చైతన్యరథం): మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ గ్రౌండ్స్‌లో రెండవ అఖిల భారత పోలీస్ సౌత్‌జోన్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ టోర్నీని హోం మంత్రి వంగలపూడి అనిత, ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల మార్చ్ పాస్ట్ అందరినీ ఆకట్టుకుంది. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు అతిథులు. కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, అండమాన్ అండ్ నికోబార్, ఐటీబీపీ, బోర్డర్ టీమ్‌లు ఈ పోటీలో తలపడుతున్నాయి. హోంమంత్రి అనిత మాట్లాడుతూ పోలీసుల్లో క్రీడా స్ఫూర్తిని, ఐక్యతను బయట పెట్టేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడ, ఏ విపత్తు జరిగినా మొదట పరుగెత్తేది పోలీసు లేనని, 24 గంటలూ డ్యూటీలో ఉండేవారికి ఇలాంటి క్రీడలు మానసిక ఆనందాన్ని స్తాయని చెప్పారు. ఈ టోర్నీని ఇక్కడ నిర్వహించడంతో పాటు 160 దేశాల్లో లైవ్ టెలికాస్ట్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. రాబోయే కాలంలో అమరావతి ప్రైడ్ మరింత విస్తరిస్తుందని తెలిపారు.

### క్రీడా నైపుణ్యానికి ప్రధాన కేంద్రంగా అమరావతి: డీజీపీ

డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేవలం క్రీడాపోటీ మాత్రమే కాదని.. పోలీస్ బలగాల క్రమశిక్షణ, ఐక్యత, స్ఫూర్తికి నిదర్శన మన్నారు.అమరావతి ఇప్పటికే 'ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025–26'ను విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. ఇప్పుడు ఈ టోర్నమెంట్‌తో క్రీడా నైపుణ్యానికి ప్రధాన కేంద్రంగా మారుతుందని చెప్పారు. ˇక్షిణ భారతదేశం, కేంద్ర బలగాల క్రీడాకారులకు సెల్యూట్ చేశా రు. ఈ కార్యక్రమానికి శాప్, జిల్లా కలెక్టర్లు, విశ్వవిద్యాలయ భాగస్వాములు, స్పాన్సర్లు సహకారం అందించినట్టు చెప్పారు.

# దుష్ట పరిపాలన మళ్లీ రాకూడదు

- చంద్రబాబు అరెస్టు వైసీపీ దుర్మార్గానికి నిదర్శనం
- స్కిల్ కేసులో క్లీన్‌చిట్ ఆయన నిజాయితీకి నిలువుటద్దం
- న్యాయశాఖలో ఖాళీల భర్తీ, భవనాల నిర్మాణానికి చర్యలు
- కర్నూలు హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తీర్మానం చేసి పంపాం
- అసెంబ్లీలో న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాం మొత్తం దుష్ట పరిపాలన చేశారని, అలాంటి పరిపాలన మళ్లీ రాకూడదని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ ఏర్పాటు, న్యాయశాఖలో ఖాళీల భర్తీ, కోర్టు భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. నంద్యాలలో చంద్ర బాబును అరెస్టు చేసినప్పుడు అప్పటి ప్రభుత్వంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించిన తీరును వివరించారు. సీనియర్‌నని నన్ను ఒక్కడిని వదిలేశారని తనదైన శైలిలో మంత్రి ఫరూక్ చెప్పడంతో సభలోని సభ్యులు నవ్వులు చిందించారు. స్కిల్ డెవలప్మెంట్ కేసుకు సంబంధించి చంద్రబాబును జిల్లా కేంద్రమైన నంద్యాలలో స్థానికంగా మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టమని చెప్పిన ప్పటికీ దుర్మార్గంగా రాజమండ్రికి తీసుకెళ్లడం జరిగిందని వెల్లడించారు. ఆసమయంలో కాల్వ శ్రీనివాసులు రాగా సార్ వెళ్లమంటావా.. అని అడుగుతున్న సమయంలో మాఇద్దరి (ఫరూక్, కాల్వ శ్రీనివాసులు) కళ్లల్లో నీళ్లు వచ్చాయని గుర్తు చేసుకున్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో ముఖ్యమంత్రి చంద్ర బాబు పవిత్రంగా బయటకు వచ్చారని, నిజాయితీకి నిదర్శనమని సభ్యుల చప్పట్ల మధ్య పేర్కొన్నారు.

### హైకోర్టు బెంచ్, ఖాళీల భర్తీ, కోర్టు భవనాలకు కృషి

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంపై, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు క్యాబినెట్, అసెంబ్లీలో తీర్మానించి హైకోర్టు దృష్టికి తీసుకెళ్లామని ప్రశ్నోత్తరాల్లో సమాధానం ఇచ్చారు. గత ఆర్థిక సంవత్సరంలో న్యాయ శాఖకు కేటాయించిన బడ్జెట్‌లో 99.9 శాతం నిధులు మొత్తం ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో అదనంగా రూ.130 కోట్లు కేటాయించా మన్నారు. న్యాయ రాజధాని పేరుతో గత ప్రభుత్వం రాయలసీమ ప్రజలను మభ్యపెట్టిందని మంత్రి ఫరూక్ విమర్శించారు. 2026–2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రూ.1352.49 కోట్లు కేటాయించ గా, ఇందులో రూ.180.5 కోట్లు మౌలిక సదుపాయాలకు, అడ్వకేట్ జనరల్ కార్యాలయానికి రూ. 22.54 కోట్లు, ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీకి రూ. 48.65 కోట్లు, ఏపీ జ్యుడీషియల్ అకా డమీకి రూ.8.37 కోట్లు కేటాయించడం జరిగిందని.. బడ్జెట్‌ను ఆమోదించాలని సభాముఖంగా కోరుతున్నటు పేర్కొన్నారు. న్యాయశాఖలో అభివృద్ధి పనులకు సంబంధించి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అన్ని చర్యలను హైకోర్టు ఆదేశానుసారం ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తామని ప్రశ్నోత్తరాల సమయంలో వివరించారు.

# రాష్ట్ర అభివృద్ధికి ఖనిజ వనరులు వినియోగించుకుందాం

- భవిష్యత్తును మార్చేలా రేర్ ఎర్త్ మినరల్ కారిడార్
- గత ఐదేళ్లు మైనింగ్ రంగాన్ని దోపిడీ కోసం వాడారు
- ఇంటిగ్రేటెడ్ వేల్యూ చైన్ ఏర్పాటు చేయబోతున్నాం
- అసెంబ్లీలో గనులు, భూగర్భవనరుల మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర భవిష్యత్తును సమగ్రంగా మార్చేలా మన ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకుంటామని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండు శంకరరావు అడిగిన ప్రశ్నకు అసెంబ్లీలో సమాధానమిచ్చారు. ఉత్తరాంధ్ర సహా సుమా రు 970 కి.మీల మేర ఉన్న సముద్ర తీరంలో అపారమైన సహజ సంపద ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపే అవకాశం లభిస్తుందన్నారు. అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ఫ్లోరేషన్ అండ్ రీసెర్చ్‌పై ఆధారపడి దాదాపు 102 మిలియన్ టన్నుల నిల్వలతో రాష్ట్ర ప్రభుత్వం 7,762 హెక్టార్లలో 8 బీచ్ శాండ్ కలిగి ఉన్న ప్రాంతా లను గుర్తించింది. ఈ ప్రాంతాలను ఏపీఎండీసీకి రిజర్వ్ చేసేలా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీ, కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ 97 మిలియన్ టన్నుల నిల్వతో గార మండలంలో 670 హెక్టార్లు, 239 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న రెండు బీచ్ శాండ్ ప్రాంతాలను ఏపీఎండీసీకి మైనింగ్ లీజు మంజూరు చేయడానికి సిఫార్సు చేశాం. గార మండలంలో 909 హెక్టార్లకుపైగా ఏకీకృత లీజు కోసం ఏపీఎండీసీకి ఎల్వోఐ జారీ చేసింది. మిగిలిన ఆరు బీఎస్ఎం బేరింగ్ ప్రాంతాల్లో డిపార్ట్ మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీ ఇటీవల 41 మిలియన్ టన్నుల నిల్వలు, ఎచ్చెర్ల రణస్థలం గార మండలాల్లో మూడు బీఎస్ఎం బేరింగ్ ప్రాంతాలకు మైనింగ్ లీజులను మంజూరు చేయడానికి ఏపీఎండీసీని నామినేట్ చేసింది. చట్టబద్ధమైన అనుమతులు పొందే ప్రక్రియ కొనసాగుతోంది. బీచ్ శాండ్ ఖనిజ నిక్షేపాలతో శ్రీకాకుళం జిల్లాలో అందుబాటులో ఉన్న 4 క్వారీ లీజులు క్వార్జ్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, గ్రావెల్, రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ సహా మాంగనీస్ కోసం కాంపోజిట్ లైసెన్స్ కూడా అమలు చేయడం జరిగింది. శ్రీకాకుళం జిల్లాలో పేర్కొన్న ఖనిజాల కోసం 301 లీజులు 1359 హెక్టార్లు, మాంగనీస్ బ్లాక్ 152 హెక్టార్లలో విస్తరించి ఉంది. రాష్ట్రంలో అత్యంత విలువైన బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. గత ఐదేళ్లు రాష్ట్రంలోని సహజ వనరులను దోపిడీ కోసం వాడుకున్నారు. లీజుదారులను బెదిరిం చి లాక్కున్నారు. పెనాల్టీలతో వేధింపులకు గురిచేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లీజు దారులకు అండగా నిలుస్తూ.. అన్ని లీజులను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం తాజాగా క్రిటికల్ మినరల్ పార్కులు ఏర్పాటుకు అనుకూలంగా నిర్ణయం తీసుకుం ది. ఆ మేరకు కారిడార్ల ఏర్పాటుకు బడ్జెట్ కేటాయింపులు కూడా చేశారు. మన దేశంలో విలువైన వనరులు ఉన్నప్పటికీ వాటిని ప్రాసెస్ చేసే వ్యవస్థ లేకుండా పోయింది. కానీ నేడు వాటిని ప్రాసెస్ చేసి వేల్యే యాడెడ్ పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. వనరులను ఉత్పత్తి చేయడం కాకుండా.. ఇంటిగ్రేటెడ్ వేల్యూ చైన్ ఏర్పాటు ద్వారా రేర్ ఎర్త్ మినరల్స్ తయారీ వ్యవస్థకు కీలకంగా ఏపీని మార్చబోతున్నాం. దేశ వ్యాప్తంగా ఉన్న మోనోజైట్ నిల్వల్లో ఏపీలోనే 30 శాతానికి పైగాఉన్నాయి. అయస్కాంతాల తయారీకి వినియోగించే నియో డైమియం, ప్రసియోడైమియం ఆధారమైన మోనోజైట్, ఏరోస్పేస్‌లో కీలక భూమిక పోషించే టైటానియం ఇల్మెనైట్, సిరామిక్స్ అండ్ న్యూక్లియర్ ఎనర్జీలో కీలకంగా ఉపయోగించే జిర్కాన్, పారిశ్రామిక రంగంలో ఉపయోగించే గార్నెట్ సిల్లిమ నైట్ లాంటి ఖనిజాలు ఆంధ్రప్రదేశ్ తీరంలో అత్యంత కీలకంగా లభిస్తున్నాయి. మన సముద్ర తీరంలో లభించే సంపదను మన రాష్ట్ర అభివృద్ధికి, మన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రచిస్తున్నామని పేర్కొన్నారు.

# కల్పవృక్ష వాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం



హైదరాబాద్ (చైతన్యరథం): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామివార్షిక బ్రహ్మో త్సవాల్లో నాలుగో రోజైన శుక్రవారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

క్షీరసాగర మథనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్పవృక్షం ఒకటి. ఈ చెట్టు నీడన చేరిన వారికి ఆకలిదప్పులుండవు. పూర్వ జన్మ స్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. అలా కాక కల్పవృక్షం కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో భక్తులకు తనివితీరా దర్శనమిచ్చాడు శ్రీనివాసుడు.

వాహనసేవలో ఎల్‌ఏసీ ప్రెసిడెంట్ ఏవీ రెడ్డి, అర్చకులు, ఏఈవో రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నిరంజన్, హరికృష్ణ, పలువురు అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి: సీఎస్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చేపట్టిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కలక్టర్లు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. పీఎం కుసుం, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఇచ్చిన రుణాల రికవరీ, మనమిత్ర వాట్సాప్ సేవలు



తదితర అంశాలపై శుక్రవారం ఆయన సచివాలయంలో కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆ సేవలను వినియోగించేందుకు కృషి చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి జిల్లాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల కింద వాహనాల కొనుగోలు, స్వయం ఉపాధికి రుణాలు తీసుకున్న లబ్దిదారులు ఏప్రిల్‌లోగా అసలు చెల్లిస్తే వారికి వడ్డీ మాఫీ చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ కార్పొరేషన్ల ద్వారా అసలు రూ.260 కోట్లు, వడ్డీ రూ.40 కోట్లు వసూలు కావాల్సి ఉందని చెప్పారు. రికవరీకి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఇందుకు పూర్తిగా సహకరిస్తారని చెప్పారు. అంతకు ముందు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై సీఎస్ మాట్లాడుతూ... దానిని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.నాయక్, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, సీడీఎంఏ జి.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## దేవుడ్ని కించపరుస్తూ.. "రక్షించు గోవిందా" అని వేడుకుంటారా?

**వైసీపీ తీరుపై బ్రాహ్మణ ప్రతినిధుల ఆవేదన**

అమరావతి(చైతన్యరథం): శాసనమండలిలో వైసీపీ సభ్యుల తీరుపై సంస్కార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లకు బూట్లు వేసుకుని వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను చేత్తో పట్టుకుని రక్షించు గోవింద రక్షించు గోవింద అంటున్నారు.. వారి చర్యలు భక్తుల మనోభావాలను గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. వేంకటేశ్వర స్వామి వారి చిత్రపటాలను పట్టుకుని...పాదరక్షలు (బూట్లు) ధరించి నినాదాలు చేయడం అత్యంత శోచనీయమన్నారు. కాళ్లకు బూట్లు వేసుకుని రోడ్లపై నిరసనలు తెలపడం మన సంస్కృతిని, సంప్రదాయాన్ని అవమానించడమే. స్వామి ఛాయ చిత్రం ఒక గొప్ప యంత్రంతో సమానం.. ఫొటో చాలా పవిత్రమైనది, అటువంటి ఫొటోలను రోడ్డుపై ప్రదర్శిస్తూ నాయకులు అందరూ బూట్లు వేసుకుని స్వామి ఫొటోలతో నిరసన కార్యక్రమాలు చేస్తారా అని ప్రశ్నించారు. స్వామి వారినే అవమానిస్తూ "రక్షించు గోవిందా" అని వేడుకుంటున్నారంటే తాము తప్పు చేశామని ఒప్పుకుంటున్నారా? లేక స్వామివారిని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారా? అని ప్రశ్నించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం దైవ స్వరూపాలను, మత విశ్వాసాలను కించపరచవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజేష్‌కుమార్, తిరుపతి బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## హిందూపురంలో సొంతింటి నిర్మాణానికి బాలయ్య భూమిపూజ



హిందూపురం(చైతన్యరథం): వన్నమ్మ కాలనీలో సొంతింటి నిర్మాణం కోసం నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం భూమిపూజ చేశారు. తనకు హిందూపురం సొంతూరు అన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడం కోసం ఇక్కడ సొంతింటి నిర్మాణానికి పూనుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించారు. హిందూపురాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని బాలకృష్ణ తెలిపారు.

# చెప్పులు, బూట్లు వేసుకునే దేవుడి ఫొటోతో వచ్చారు

- ఇదిగో ఆధారం.. రాజీనామా చేస్తారా..
- వైసీపీ ఎమ్మెల్సీకి మంత్రి గుమ్మడి సంధ్యారాణి షాక్





అమరావతి (చైతన్యరథం): వైసీపీ ఎమ్మెల్సీకి మంత్రి గుమ్మడి సంధ్యారాణి షాక్ ఇచ్చారు. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో తాము సభలోకి వెళ్లినట్లు ఒక్క ఫొటో, వీడియో అయినా చూపించినా ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తానని వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు తెలపగా.. వీడియో బయటపెట్టి ఎమ్మెల్సీ రాజీనామా మంత్రి గుమ్మడి సంధ్యారాణి డిమాండ్ చేశారు. వేంకటేశ్వరస్వామి ఫొటోలను ప్లకార్డుల్లా వాడటం దుర్మార్గం. స్వామి వారి ఫొటోను ఒకరు తలకిందులుగా పట్టుకున్నారు. ఇంకొకరు నిరసన అవ్వగానే టేబుల్‌పై పడేశారు. దేని కోసం డిమాండ్ చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి. వికృత చేష్టలతో స్వామి వారిని అవమానించిన తీరు మనసు కలచివేసింది. దేవుడు పట్ల భక్తి భయం లేకుండా ప్రవర్తిస్తున్నారు. లడ్డూలో కల్తీ జరిగిందని ఒప్పుకున్న మరో చిన్నాన్న వివేకాలా తనకీ గుండెపోటు వస్తుందేమో అనే భయంతో ఉన్నాడు. హుండీలో డబ్బులు దొంగతనం చేస్తే అది చిన్న దొంగతనమే కదా అంటున్న జగన్... సిగ్గు పడాలి. పాలు లేకుండా నెయ్యి తయారు చేసిన తమ నాయకుడికి సన్మానం చేయాల్సింది పోయి నిందిస్తారా అంటూ మైండ్ పోయి మాట్లాడుతున్నారు. 5 కోట్ల మంది ప్రజలకు జగన్, వైసీపీ నేతలు క్షమాపణలు చెప్పి తీరాలని డిమాండ్ చేశారు.

## వేంకటేశ్వరుడు మీ పాపాలు చూస్తున్నాడు

- సత్యనారాయణ పేరు పెట్టుకుని బొత్స అసత్యాలు
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



అమరావతి (చైతన్యరథం): వైసీపీ నేతలకు దేవుడంటే భయం, భక్తి,విశ్వాసం లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. వైసీపీ నేతలు స్వార్థ రాజకీయాల కోసం దేవుడిని వాడుకోవడం దుర్మార్గం. నిండు సభలో వైసీపీ సభ్యులు చెప్పులేసుకుని వెంకటేశ్వర స్వామి చిత్ర పటాలు పట్టుకొని అపవిత్రం చేసి సిగ్గు లేకుండా బుకాయిస్తు న్నారు. ఇలా మాట్లాడమని వైసీపీ నేతలకు జగనే చెప్పారా? సత్యనారాయణ అని పేరు పెట్టుకున్న బొత్స అసత్యాలు తప్ప సత్యాలు ఏనాడు మాట్లాడరు. వైసీపీ బతుకంతా ఫేక్ మాటలు, ఫేక్ రాజకీయాలే. వైసీపీ నీచ రాజకీయాలన్నీ ఆ వెంకటేశ్వ రస్వామి గమనిస్తున్నాడు. వాళ్లు చేసిన తప్పులకు ఆ దేవుడే తగిన విధంగా శిక్షిస్తాడని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హెచ్చరించారు.

## వెంకన్న ఆగ్రహానికి గురికాక తప్పదు


- హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి
- బీసీ సంక్షేమ మంత్రి సవిత హెచ్చరిక



అమరావతి(చైతన్యరథం): హిందువుల మనోభావాలు దెబ్బతినేలా శాసనమండలిలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరుపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంకన్న ఫొటోలను సభలో విచ్చలవిడిగా పడేసి అపచారానికి పాల్పడ్డారని, ఆ కలియుగ దైవం ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తక్షణమే హిందువులకు, ప్రజలకు జగన్, వైసీపీ సభ్యులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. కలియుగ దైవం వెంకన్న స్వామి ఫొటోలతో రాజకీయం చేయడం క్షమించరాని నేరమన్నారు. జగన్‌రెడ్డి సూచన మేరకే మండలిలో వెంకన్న స్వామి ఫొటోలను వైసీపీ సభ్యులు వాడుకున్నారని మండిపడ్డారు. వారంతా హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారని వ్యాఖ్యానించారు. మహిళలన్నా గౌరవం లేదని, ప్రజల పట్ల బాధ్యతలేదని వైసీపీ సభ్యులపై మండిపడ్డారు. కల్తీ నెయ్యి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి వైసీపీ సభ్యులు రచ్చ చేస్తున్నారన్నారు. 33 ఏళ్ల నుంచి హెరిటేజ్ ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని వ్యాపార ప్రస్థానాన్ని ముందుకు సాగిస్తోందన్నారు. హెరిటేజ్‌కు, టీటీడీకి ఎటువంటి సంబంధమూ లేదని తేల్చిచెప్పారు.

## మండలి చరిత్రలో ఇది ఒక చీకటిరోజు

**మంత్రి కొలుసు పార్థసారథి**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించేలా చట్టాలు,శాసనాలు చేయాల్సిన నిండు సభలో శ్రీవారికి అపచారం జరిగింది. హిందువుల మనోభావాలతో చెలగాట మాడారు. శ్రీవారి ఫొటోలను పట్టుకుని కాళ్లకు బూట్లు, చెప్పులు వేసుకుని వైసీపీ సభ్యులు దుర్మార్గానికి ఒడిగట్టడం దారుణం. జగన్మోహన్ రెడ్డికి వెంకన్నస్వామి మీద నమ్మకం లేకపోతే తన పార్టీ ఎమ్మెల్సీలతో అపచారం కార్యక్రమాలు చేయించడం న్యాయమా? నోరుతెరిస్తే శ్రీరంగనీతులు చెప్పే బొత్స సత్యనారాయణ దగ్గరుండి ఈ దారుణాన్ని ప్రోత్సహించడం హైందవ లోకానికి తీరని అవమానం. హిందువుల మనోభావాలు, శ్రీవారి భక్తుల మనోభావాలపై జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు ముప్పేట దాడులు చేయడం గర్హనీయం. వెంకన్నస్వామికి ద్రోహం తలపెట్టిన వారు శిక్ష అనుభవించక తప్పదు. ఈరోజు శాసనమండలి లో శ్రీవారి ఫొటోలతో నీచ రాజకీయాలకు పాల్పడిన వైసీపీ ఎమ్మెల్సీల తీరును యావత్ హైందవలోకం ఖండించాల్సిన అవసరం ఉంది. నిన్న కల్తీ నెయ్యితో అపచారం..నేడు కాళ్లకు బూట్లు, చెప్పులతో శ్రీవారి పటాలు పట్టుకుని మహాపచారానికి పాల్పడటం జగన్‌రెడ్డి రాజకీయ వికృతక్రీడకు నిదర్శనమని మండిపడ్డారు.

# జగన్ హయాంలో రైతన్నలని పట్టించుకోలేదు..

- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజం
- గుంటూరు మిర్చి యార్డు కమిటీ ప్రమాణం



గుంటూరు(చైతన్యరథం): జగన్ హయాంలో రైతన్నలని పట్టించుకోలేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో అన్నదాతలని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

రైతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. జగన్ హయాంలో అన్నదాతలు అనేక కష్టాలు పడ్డారని చెప్పుకొచ్చారు. శుక్రవారం గుంటూరు మిర్చి యార్డ్ నూతన పాలకమండలి ప్రమాణస్వీకార మహోత్సవం జరిగింది. చైర్మన్‌గా కుర్రా అప్పారావు, వైస్ చైర్మన్‌గా బిట్రగుంట మల్లిక ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీతో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రమాణస్వీకారం చేయించారు. మంత్రి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. గుంటూరు మిర్చి యార్డ్ అభివృద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వ్యాఖ్యానించారు. ఏపీలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన మార్కెట్ గుంటూరు మిర్చి యార్డ్ అని పేర్కొన్నారు. మిర్చి రైతుల పెట్టుబడి ఇబ్బందులు, నష్టాలను అరికట్టేందుకు కృషి చేస్తామని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడాలం టే రైతులు పురుగు మందుల వాడకం తగ్గించి.. నాణ్యమైన దిగుబడి సాధించడంపై దృష్టి సారించాలని వివరించారు. సిటీ నడిబొడ్డుకు చేరిన యార్డ్ మార్పుపై నివేదిక ఇస్తే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వంలో మార్కెట్ యార్డ్ సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తామని మాటిచ్చారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు నక్కా ఆనంద బాబు, చదలవాడ అరవింద్ బాబు, బూర్ల రామాం జనేయులు, భాష్యం ప్రవీణ్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, పలువురు కార్పొరేషన్ చైర్మన్‌లు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి

- రాయదుర్గంలో నిలిచిన బ్రిడ్జిలను పూర్తి చేస్తాం
- అసెంబ్లీలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి



అమరావతి(చైతన్యరథం): పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిపై అసెంబ్లీలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రశ్నకు మంత్రి బీసీ జనార్ద న్‌రెడ్డి సమాధానమిచ్చారు. కొవ్వూరు నియోజకవర్గంలో రోడ్లన్నీ దెబ్బతిన్నాయనడంలో వాస్తవం లేదు.. కొన్ని రోడ్లు మాత్రమే పాక్షి కంగా దెబ్బతిన్నాయి. రోడ్ల మరమ్మతులు, విస్తరణ పనుల కోసం రూ.50.74 కోట్లు మంజూరు చేసి 63 పనులు చేపట్టాం. రూ.42.56 కోట్ల మేర 58 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన 5 పనులు రూ.8.18 కోట్లతో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ప్రభుత్వం గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. పుష్కరాలు జరిగే ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధిపై త్వరలో సమావేశం కానున్నా మని తెలిపారు. ఈ క్రమంలో పుష్కరాలు జరిగే నియోజకవర్గాల్లో రోడ్లను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలో మధ్యలో నిలిచిపోయిన బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. గోదావరి జిల్లాల్లో బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జిలు కూలిపోయే పరిస్థితిపై స్థానికంగా ఆందోళన ఉందన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు.. తన నియోజక వర్గంలో కోపల్లె వంతెనకు నిధులు మంజూరు చేసిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

## కాంగ్రెస్ తీరు సిగ్గుచేటు

### ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్

అమరావతి(చైతన్యరథం): ఢిల్లీలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తూ, ప్రపంచ సాంకేతిక రంగంలో తన సత్తాను, నాయకత్వాన్ని చాటుతోంది. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం దేశ గౌరవం కంటే అల్లర్లకే ప్రాధాన్యత నిచ్చిందని ఏపీ బీజేపీ చీఫ్ పివిఎన్ మాధవ్ దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో, కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీలోని భారత మండపం సమ్మిట్ వేదిక వద్ద చొక్కాలు విప్పి రభస చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇది ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్టను దిగజార్చడానికి ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర. భారత్ అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేరా? దేశం గ్లోబల్ టెక్ పవర్‌హౌస్ గా ఎదిగేం దుకు కృషి చేస్తుంటే, కాంగ్రెస్ ప్రవర్తన భారత్ వెనుకబడాలని కోరుకునే శక్తులకు వత్తాసు పలికేలా ఉందన్నారు. రాజకీయం ముఖ్యమా? దేశం ముఖ్యామా? అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంటుంది, కానీ దేశం యొక్క ఇమేజ్‌ను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదు. దేశానికి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు వద్దు.. భారత్ మెరుగైన రాజకీయాలను కోరుకుంటోందని హితవుపలి కారు.

## ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లకు స్థలాల సేకరణ

- వారంలో పూర్తి కావాలి
- ఒప్పందం ప్రకారం నాలుగు నెలల్లో యూనిట్లు ఏర్పాటు చేయాలి
- అధికారులకు, ఏజెన్సీలకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశాలు



విజయవాడ (చైతన్యరథం): నగరాలు, పట్టణాల్లో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లకు కావాల్సిన భూ సేకరణను వారంలోపు పూర్తి చేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్లు (ఆర్డీలు), మున్సిపల్ కమిషనర్లు, ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పే ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లను ఎంత తొందరగా ఏర్పాటుచేస్తే అంత తొందరగా లెగసీ వేస్ట్‌ని క్లియర్ చేయగలుగుతామని చెప్పారు. అప్పుడే డంప్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తని కూడా క్లియర్ చేసి ఆ ప్రాంతంలో పచ్చదనంతో నిండిన పార్కులు ఏర్పాటు చేసుకోగలుగుతామన్నారు. బయోమైనింగ్ పూర్తికి ప్రాసెసింగ్ యూనిట్లే కీలకమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ అంశాలపైనే దృష్టిపెట్టమన్నారని చెప్పారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లకు స్థలాల సేకరణకు, వాటిని ప్రారంభించడానికి చైర్మన్ పట్టాభిరామ్ డెడ్‌లైన్ విధించారు.

రాష్ట్రంలో మొత్తం 107 నగరాలు, మున్సిపాల్టీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభిస్తామని చెప్పారు. వాటిలో 72 చోట్ల మాత్రమే భూమి అందుబాటులో ఉందన్నారు. మిగిలిన చోట్ల కూడా యూనిట్ల స్థాపనకు భూమిని గుర్తించి, ఖరారు చేయాలన్నారు. భూములు నగరాలు, పట్టణాలకు అవకాశం ఉన్నంత మేర దగ్గరగా ఉండేలా చూడాలన్నారు. కొన్ని మున్సిపాల్టీల్లో భూమి అందుబాటులో ఉందని... రెండు మూడు స్థలాలు ఉన్నందున ఏదో ఒక భూమిని ఖరారు చేయవలసి ఉందని ఆర్డీలు చైర్మన్ పట్టాభిరామ్‌కు వివరించారు. మరికొన్ని చోట్ల భూమి అందుబాటులో లేదన్నారు. భూమి గుర్తింపును మూడు రకాలుగా విభజించుకోమని పట్టాభిరామ్ అధికారులకు సలహా ఇచ్చారు. 1. అందుబాటులో ఉన్న భూమి 2.భూములు అందుబాటులో ఉండి ఖరారు చేయవలసిన భూమి, 3. భూమి అందుబాటులో లేకపోవడం. స్థలాలను వేగవంతంగా సమకూర్చమని ఆదేశించారు. ఏ జిల్లాలోనైనా భూమికి సమస్యలు ఉంటే సంబంధింత అధికారులు ఆయా జిల్లాల కలెక్టర్లను కలిసి సమస్య వివరిస్తే పరిష్కరిస్తారని పట్టాభిరామ్ చెప్పారు.

### ఏజెన్సీలకు డెడ్‌లైన్

ఒప్పందం ప్రకారం నాలుగు నెలల్లో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లను సిద్ధం చేయాలని ఏజెన్సీలను చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశించారు. ఏజెన్సీ ప్రతినిధులు ఆర్డీలను కలిసి సమన్వయంతో పనిచేయాలని కోరారు. యూనిట్ల స్థాపన వివరాలు, భూములకు సంబంధించిన డేటాను ఆర్డీలకు అందజేయమన్నారు. రెండు నెలల్లో సివిల్, ఎలక్ట్రిక్ వర్క్ పూర్తి చేయాలని, మరో ఐదు వారాల్లో మిషనరీ పనులు పూర్తి కావాలని, ఆ తర్వాత మరో వారంలో ట్రయల్ రన్ నిర్వహించాలని ఆదేశించారు. ఒప్పందం ప్రకారం మొత్తం నాలుగు నెలల్లో యూనిట్లను ప్రారంభించాలని డెడ్‌లైన్ విధించారు. ప్లాంట్ ఏర్పాటుకు భూమితో పాటు పవర్ కూడా అందుబాటులో ఉందో లేదో ముందుగానే చెక్ చేసుకోవాలని సూచించారు. అనుకున్న సమయానికి ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులు పూర్తి కావడానికి అందరూ సహకరించాలని కోరారు.

### గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ ప్రవర్తన

## దేశ గౌరవానికి విరుద్ధం

### నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

అమరావతి (చైతన్యరథం): 'భారతదేశం ఏఐ రంగంలో వేగంగా ఎదుగుతోంది... లక్షలాది యువతకు ఉద్యోగాలు, స్టార్టప్‌లకు అపార అవకాశాలు, దేశ ఆర్థిక శక్తికి బలమైన పునాది అంటే అతిశయోక్తి కాదు. ప్రపంచ స్థాయిలో భారత్ తన టెక్ సామర్థ్యాన్ని, ఆవిష్కరణలను బలంగా చాటుకుంటున్న ఈ కీలక దశలో... ఏఐ వంటి గ్లోబల్ వేదికపై దేశ ప్రతిష్టను మరింత ఉన్నతంగా నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపై ఉంది. కానీ కాంగ్రెస్ నాయకులు ప్రదర్శించిన వైఖరి దేశ ప్రతిష్ట దిగజార్చే విధంగా ఉంది.' అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వ్యాఖ్యానించారు.ప్రపంచ నాయకులు, టెక్ దిగ్గజాలు భారత్ ఆతిథ్యంలో జరిగే ఈ సమ్మిట్‌ను గౌరవిస్తుంటే, కాంగ్రెస్ పార్టీ తీరు దేశ గౌరవానికి తీవ్ర దెబ్బ అన్నారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవమానకర చర్యలు భారత్‌ను గ్లోబల్ స్టేజ్‌పై నవ్వులపాల్జేశాయన్నారు. ఇది జాతి ఆత్మగౌరవానికి, దేశ అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు జరిగిన బహిరంగ అవమానమని... ప్రతి భారతీయుడూ ఖండించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి దేశ ప్రయోజనాల కంటే స్వార్థ రాజకీయాలే ప్రాధాన్యమని, భారత్ అభివృద్ధి చెందకూడదు, యువతకు ఉద్యోగాలు రాకూడదు, ప్రపంచంలో గౌరవం పెరగకూడదు అనే దురుద్దేశంతోనే కాంగ్రెస్ నాయకులు ప్రతి అవకాశంలో అడ్డుపడుతున్నారన్నారు. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే ఈ ఘటనలను వైసీపీ ఖండించకపోవడం అన్నారు. ఆ పార్టీకి దేశ గౌరవం గురించి ఆలోచన లేదు. అందుకే తల్లి కాంగ్రెస్–పిల్ల కాంగ్రెస్ అంటారు.. దేశ ప్రయోజనాల విషయంలో ఇద్దరి వైఖరి ఒకటే – పార్టీ ప్రయోజనం ముందు, దేశ ప్రయోజనం తర్వాత అన్నారు.

## ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయవద్దు



విజయనగరం (చైతన్యరథం): ఏపీ శాసనమండలిలో వైసీపీ సభ్యులు చెప్పులు ధరించి దేవుడి ఫొటోలు తీసుకొచ్చి సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ సమాజానికి వారు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం విజయనగరం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవుడితో రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. భగవంతుడు వైసీపీ అధ్యక్షుడు జగన్, ఎమ్మెల్సీలకు జ్ఞానోదయం కల్పించాలని కోరారు. ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. శాసనమండలిలో వైసీపీ సభ్యులు తమ ప్రవర్తన మార్చుకోవాలని కోరారు.

## వైసీపీ తీరుని సభ్య సమాజం వ్యతిరేకిస్తోంది

### ●దేవుడితో రాజకీయం దారుణమని మండిపడ్డ టీడీపీ నేతలు

**కలియుగ దైవం ఫోటోలను చెప్పులు వేసుకుని ప్రదర్శించడమా? ఎంపీ సానా సతీష్**



శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరును సభ్య సమాజం వ్యతిరేకిస్తోందని టీడీపీ ఎంపీ సానా సతీశ్ పేర్కొన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు వేసుకుని ప్రదర్శిస్తున్న తీరు వైసీపీ నేతల మూర్ఖత్వానికి నిదర్శనని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతల పిచ్చి పరాకాష్టకు చేరిందని విమర్శించారు. జగన్ ఆనందం కోసమే ఆ పార్టీనేతలు ఇలా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇలాంటి తప్పులు చేస్తూ వైసీపీ నేతలు కూడా పాపాలూ చేసే పరిస్థితి కొని తెచ్చుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎవరు చెప్పులు వేసుకుని రాలేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని ఎంపీ సతీశ్ విమర్శించారు. సభ్య సమాజమంతా వైసీపీకి బుద్ధి చెప్పే సమయం వస్తుందని సానా సతీశ్ హెచ్చరించారు. లోకేశ్ క్రికెట్ చూడటానికి వెళ్తే జగన్‌కు వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. లోకేశ్‌ను చూసి జగన్ రెడ్డికి జలసీ, కుళ్లు అని ఎద్దేవా చేశారు. జగన్ ఎక్కడికైనా వెళ్లాలంటే కోర్టు పర్మిషన్ తీసుకుని వెళ్లాలని విమర్శించారు. టీవీలో క్రికెట్ చూడాలని జగన్‌కు రాసిపెట్టి ఉందని.. ఆయన నేరస్థుడు కాబట్టి బయటకు వెళ్లి క్రికెట్ చూడలేని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ఇతర దేశాళకు వెళ్లాలంటే జగన్ రెడ్డి న్యాయస్థానం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు.



టీటీడీ లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేయడానికి హెరిటేజ్‌కు ముడిపెట్టారని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కోను దేవుడు శిక్షిస్తారని.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 మంది సభ్యులు కూడా మిగలరని సానా సతీశ్ సెటైర్లు వేశారు.

**అప్పన్న ఎవరి పీఏనో అందరికీ తెలుసు: ఎంపీ ప్రభాకర్ రెడ్డి**

శ్రీవారి కల్తీ లడ్డూ వ్యవహారంపై టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పన్న ఎవరి పీఏనో అందరికీ తెలుసని, ఆయనకు సహాయం చేయమని జగన్‌మోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి గతంలో తనకు చెప్పారని అన్నారు. సహాయం చేసినందుకు ఆ నింద తనపై పడిందన్నారు. అప్పన్న ఎవరి పీఏనో దేశమంతా తెలుసునని ఎంపీ పేర్కొన్నారు.

## శాసనమండలిలో వైసీపీ చర్యలు హేయం

### ● ఆగ్రహం వ్యక్తం చేసిన ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్



హిందువుల కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఫొటోలు పట్టుకొని వైసీపీ ఎమ్మెల్సీలు ర్యాలీ చేయడం హేయమైన చర్య అని ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ పేర్కొన్నారు. శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు.. కాలికి బూట్లు, చెప్పులు వేసుకొని.. వేంకటేశ్వరస్వామి ఫొటోలు పట్టుకోవడం అమానుషమని అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీయడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ నేతలు హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేవుళ్లను, మతాలను రాజకీయంగా వాడుకోవడం వైసీపీ నేతలకే చెల్లుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేంకటేశ్వరస్వామి ఫొటోలను.. ప్లకార్డుల తరహాలో వాడటం దుర్మార్గమని మండిపడ్డారు. స్వామి వారి ఫొటోను ఒకరు తలకిందులుగా పట్టుకున్నారని.. ఇంకొకరు నిరసన అవ్వగానే టేబుల్‌పై పడేశారని విమర్శించారు. దేనికోసం డిమాండ్ చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి అంటూ వ్యాఖ్యానించారు.

# మండలిలో వైసీపీ మహాపచారం

### ● చెప్పులు, బూట్లు ధరించి వెంకన్న స్వామి ఫొటోతో ఆందోళన, శ్రీవారి పటాలు విసిరివేత

### ● వైసీపీ చర్యలపై మండిపడ్డ కూటమి నేతలు... హిందువుల మనోభావాలు దెబ్బతీశారని ఆగ్రహం



అమరావతి (చైతన్యరథం): శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు మహాపచారానికి ఒడిగట్టారు. హిందువులు కలియుగ దైవంగా భావించే వెంకటేశ్వరస్వామి ఫొటోలను పట్టుకుని చెప్పులు, బూట్లతో ర్యాలీ నిర్వహించి, ప్రదర్శించారు. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో సభకు రావటంపై మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. చట్టసభలో మహాపచారానికి పాల్పడ్డారంటూ అధికార పక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. గందరగోళం మధ్య ఛైర్మన్ సభను వాయిదా వేయగానే వైసీపీ సభ్యులు ప్లకార్డులను, స్వామి వారిని ఫొటోలను టేబుల్‌పై పడేసి వెళ్లిపోవడం తీవ్ర దుమారానికి తెరలేపింది.

శాసనమండలిలోనూ, అసెంబ్లీ బయట వెంకటేశ్వరస్వామి ఫొటోతో వైసీపీ సభ్యులు చెప్పులు, బూట్లు వేసుకుని ప్రవర్తించిన తీరును కూటమి నేతలు తీవ్రంగా పరిగణించారు. సభలోనే దీనిపై శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వెంకటేశ్వరస్వామికి సభలో జరిగిన అవమానంపై కూటమి సభ్యుల అత్యవసర సమావేశం నిర్వహించారు. టీడీఎల్పీలో మంత్రి లోకేశ్ నేతృత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్సీలు సమావేశమయ్యారు. ప్లకార్డులా దేవుడి ఫొటో వాడి మహాపచారానికి పాల్పడిన తీరును ఎన్డీఎల్పీ తీవ్రంగా ఖండించింది. విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని నిర్ణయించారు. దేవుడికి జరిగిన అవమానానికి కోపంతో హెడ్ ఫోన్ విసిరానని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. చెప్పు తీయాలనేంత కోపం వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. విషయాన్ని వదిలిపెట్టకూడదన్న సోము వీర్రాజు డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది క్షమించరాని నేరం అని మండిపడ్డారు. సమావేశం నుంచి పార్టీ జాతీయ పెద్దలకు ఫోన్ చేసి సభలో జరిగిన పరిణామాలను వివరించారు. స్వామి వారికి జరిగిన అపచారాన్ని పార్టీ సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు.

**మహాపచారంపై కఠిన చర్యలు :** మండలి ఛైర్మన్ ఛాంబర్ వద్ద మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఎన్డీఏ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ చేసిన మహాపచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, గొట్టిపాటి రవి, స్వామి, రామానాయుడు, కొల్లు రవీంద్ర, కూటమి ఎమ్మెల్సీలు నిరసనలో పాల్గొన్నారు. హిందు మతాన్ని అవమానించారని ఛైర్మన్‌కు మంత్రులు తెలిపారు. ఇలాంటి చర్యకు ఛైర్మన్‌గా ఎలా అంగీకరిస్తారని నిలదీశారు. వైసీపీ చేసింది తప్పేనని మండలి చైర్మన్ మోషేన్ రాజు స్పష్టం చేశారు. ఆ సభ్యులను పిలిచి మాట్లాడతానని ఛైర్మన్ తెలిపారు. బహిరంగ క్షమాపణలు చెప్పించి లెంపలేసుకునేలా చేయాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు.

చట్టసభ సాక్షిగా వైసీపీ సభ్యులు హిందువుల మనోభావాలు దెబ్బతీశారని మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, శాసన మండలి బీజేపీ పక్షనేత సోము వీర్రాజులు ధ్వజమెత్తారు. హిందూ మతాన్ని రెచ్చకొట్టేలా వైసీపీ ప్రవర్తించిందని మండిపడ్డారు. వైసీపీ ఎమ్మెల్సీలు హద్దులు దాటి ప్రవర్తించిన తీరు ఎంతో కలచివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయమనం పాటించే కొద్దీ రెచ్చకొడుతున్నారని, హిందువుల పట్ల వైసీపీ విధానం ఇదేనా అని నిలదీశారు. వెంకటేశ్వర స్వామి పట్ల తమ పార్టీ విధానం ఇదేనని జగన్ చెప్తున్నారా అని ప్రశ్నించారు.

**వెంకటేశ్వరస్వామి పటాలను విసిరేసి :** హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పేవరకు విషయాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు. సభ వాయిదా పడగానే వెంకటేశ్వరస్వామి పటాలను ప్లకార్డులతో పాటు విసిరేసి వెళ్లారని ఆయన ఆరోపించారు. చెప్పులతో వెంకటేశ్వర స్వామి పటాన్ని జగనే పంపించినట్లుందని విమర్శించారు. భారతజాతికి జగన్మోహన్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ డైరెక్షన్‌లో వైసీపీ ఎమ్మెల్సీలు వెంకటేశ్వరస్వామిని తీవ్రంగా అవమానించారని దుయ్యబట్టారు. వేంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని నిర్లక్ష్యంగా విసిరేయటం తేలిగ్గా తీసుకునే విషయం కాదని ధ్వజమెత్తారు.

**వైసీపీపై విరుచుకుపడ్డ కూటమి :** దేవదేవుడికి మహాపచారం తలపెట్టారంటూ మంత్రులు, ఎన్డీయే ఎమ్మెల్సీలు వైసీపీపై విరుచుకుపడ్డారు. హిందూ మతానికి జగన్ క్షమాపణలు చెప్పే వరకూ వదిలిపెట్టమని మండిపడ్డారు. మతంపై వైసీపీ దాడిని తీవ్రంగా పరిగణిస్తామని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ డైరెక్షన్‌లో హిందువులపై జరుగుతున్న దాడికి ప్రజలే బుద్ధి చెప్తారని మంత్రులు, ఎన్డీయే ఎమ్మెల్సీలు హెచ్చరించారు. జరిగిన ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. ఈ మేర కార్యక్రమాల నిర్వహణకు కార్యచరణ సిద్ధం చేస్తున్నారు.

శాసనమండలికి వెంకటేశ్వరస్వామి ఫొటో తీసుకురావడాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తీవ్రంగా తప్పుబట్టారు. మండలిలో వైఎస్సార్సీపీ సభ్యుల తీరు పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే చర్యలు సరికాదని విమర్శించారు. విలువైన సభా సమయాన్ని వృథా చేస్తూ వైసీపీ ప్రతిరోజూ సభను వాయిదా వేస్తుందని మండిపడ్డారు. వైసీపీ ఎమ్మెల్సీల వ్యవహారశైలితో వరుసగా నాలుగోరోజూ శాసన మండలి దద్దరిల్లడం సహా ప్రజా సమస్యలు ప్రస్తానకు నోచుకోకపోవడంపై పలువురు కూటమి, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఆవేదన వ్యక్తం చేశారు.

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం.. సిట్ నివేదికపై ఏకసభ్య కమిటీ

తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై ఇప్పటికే సిట్ దర్యాప్తు పూర్తయ్యి నివేదిక సమర్పించిన నేపథ్యంలో.. ఆ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ అధ్యక్షతన ఈ ఏకసభ్య కమిటీని ఏపీ సర్కార్ నియమించింది. ఈ కమిటీ ప్రధాన బాధ్యత.. సిట్ నివేదికలో పేర్కొన్న అంశాలను పూర్తిగా పరిశీలించడం, దర్యాప్తులో బయటపడ్డ విషయాలను విశ్లేషించడం, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇవ్వడం. ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం, ఈ ఏకసభ్య కమిటీ 45 రోజుల్లోగా తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. సిట్ నివేదికలో ఉన్న అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి, అవసరమైతే అదనపు వివరాలను సేకరించి.. బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేయనుంది. తిరుమలలో శ్రీవారి లడ్డూ కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావిస్తారు. అలాంటి పవిత్ర ప్రసాదం విషయంలో కల్తీ ఆరోపణలు రావడం భక్తుల్లో ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసింది. సిట్ ఇప్పటికే లడ్డూ తయారీ ప్రక్రియ, ముడి సరుకుల సరఫరా, నాణ్యత నియంత్రణ వ్యవస్థ, సంబంధిత అధికారుల పాత్ర వంటి అంశాలపై విస్తృత విచారణ జరిపింది. ఆ నివేదిక ఆధారంగా ఇప్పుడు ఏకసభ్య కమిటీ మరింత సమగ్రంగా విశ్లేషణ చేయనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# అతిథ్య రంగంలో అపార అవకాశాలు : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విజయవాడ (చైతన్యరథం): అవకాశాలు పుష్కలంగా ఉండే కెరీర్‌లో అతిథ్య రంగం ఒకటిగా మారిందని, ప్రపంచమంతా గోబల్ విలేజ్‌గా మారుతున్న నేపథ్యంలో అతిథ్య రంగానికి డిమాండ్ రోజు రోజుకు పెరుగుతుందని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ రావు వ్యాఖ్యానించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాజధాని ప్రాంతమైన విజయవాడలో పెద్దఎత్తున ఫుడ్ అండ్ బెవరేజ్ సంస్థలు నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం సాయంత్రం విజయవాడ నగరం మహానాడు రోడ్డులోని గణేష్ నగర్‌లో సౌదీ అరేబీయా ఎన్‌ఆర్‌ఐ టీడీపీ అధ్యక్షుడు ఖలీద్ సైపుల్లా ఆధ్వర్యంలో నిర్మించిన కే.ఎస్ గ్రాండ్ బ్యాంకెట్ హాల్ ను ఎమ్మెల్యే రామ్మోహన్ ప్రాంరభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఈ రాష్ట్రానికి చెందిన ఎంతో మంది ఎన్‌ఆర్‌ఐలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. సౌదీ అరేబీయా ఎన్‌ఆర్‌ఐ టీడీపీ అధ్యక్షుడు ఖలీద్ సైపుల్లా నిర్వహిస్తున్న కే.ఎస్ గ్రాండ్ బ్యాంకెట్ హాల్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. స్థానిక ఆహార సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు నగరవాసులు, పర్యాటకుల అభిరుచులకు తగ్గట్టు అతిథ్యాన్ని అందించే ప్రయత్నం చేయాలని కోరారు.

**విజయవాడకు ప్రతిష్టాత్మక వేదికగా నిలవనున్న కే.ఎస్ గ్రాండ్ బ్యాంకెట్ హాల్ : ఎన్‌ఆర్‌ఐ గౌల్ఫ్ కౌన్సిల్ అధ్యక్షుడు రావి రాథకృష్ణ**



క్రమశిక్షణ, అంకితభావం, విలువలు, విశ్వనీయతతో ముందుకు నడుస్తూ వ్యాపారం రంగంలో రాణించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఎన్‌ఆర్‌ఐ టీడీపీ అధ్యక్షుడు ఖలీద్ సైపుల్లా ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న కే.ఎస్ గ్రాండ్ బ్యాంకెట్ హాల్ ప్రజల ఆధారాభిమానాలతో ముందుకు సాగాలని ఎన్‌ఆర్‌ఐ గౌల్ఫ్ కౌన్సిల్ అధ్యక్షుడు రావి రాథకృష్ణ ఆకాంక్షించారు. ఈ బ్యాంకెట్ హాల్‌లో జరిగే ప్రతి కార్యక్రమం విజయవాడకు ఒక ప్రతిష్టాత్మక వేదికగా నిలవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌ఆర్టీ అధ్యక్షలు డాక్టర్ వేమూరి రవికుమార్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాం ప్రసాద్, ఎన్‌ఆర్‌ఐ గౌల్ఫ్ కౌన్సిల్ అధ్యక్షుడు రావి రాథకృష్ణ, ఏపీ ఎన్‌ఆర్టీ డైరక్టర్ నాగేంద్రబాబు తదితరులు పాల్గొని కే.ఎస్ గ్రాండ్ బ్యాంకెట్ హాల్ నిర్వహకులకు శు భాకాంక్షలు తెలిపారు.

# భగవంతుడితో ఆటలు... వైసీపీ పతనానికి బాటలు

- **పెద్దల సభలో వైసీపీ సభ్యుల వ్యవహారశైలి... ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ**
- **ప్రజాస్వామ్యమనే పచ్చని పైరుకు పట్టిన చీడపురుగు వైసీపీ : ప్రత్తిపాటి పుల్లారావు మండిపాటు**

చిలకలూరిపేట (చైతన్యరథం): “ప్రతిపక్ష హోదా కోసం మంకుపట్టు పడుతూ... అసెంబ్లీకి దుమ్మా కొడుతున్న జగన్, ప్రజాసమస్యలపై పోరాటానికి అవకాశం ఉన్న శాసనమండలిని కూడా తన చౌకబారు, దిగజారుడు రాజకీయాలకు వేదికగా మారుస్తున్నాడు. నేడు మండలిలో వైసీపీ సభ్యుల ప్రవర్తన, వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా మిగులుతుంది. చేసిన మహాపాపాలను కప్పిపుచ్చుకునేందుకు ఏకంగా భగవంతుడితో ఆటలు ఆడే దుస్థితికి దిగజారిన వైసీపీ... తన పతనానికి తానే బాటలు వేసుకుంటోంది.. అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు.. అసభ్యతకు...అశ్లీలతకు వేదికగా మార్చిన వైసీపీ.. నేడు కూడా అదే పంథాను అనుసరించడం దురదృష్టకరం. ప్రజలు 11 సీట్లతో సత్కరించినా జగన్ అహంకారధోరణి, వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పెడధోరణి మారలేదు. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లన్నట్టు జగన్ తన దురుద్దేశాలు, దుర్మార్గాలను కూటమిప్రభుత్వంపై నెట్టే ప్రయత్నాలు చేస్తూ, ప్రజలతో ఛీ కొట్టించుకుంటున్నాడు. ప్రెస్ మీట్ల పేరిట అనుకూల మీడియా ముందు గంటలు... గంటలు అబద్ధాలు, అసత్యాలు చెప్పడం.. వాటిని ఏదో ఒకరూపంలో ప్రజల్లోకి వెళ్లేలా చేయాలనే కుట్రపూరిత ఆలోచనలతో తన పార్టీసభ్యులతో చట్టసభల్లో వెర్రిమొర్రి వేషాలు వేయించడం జగన్‌కు అలవాటుగా మారింది.

**ప్రజాస్వామ్యమనే పచ్చని చెట్టుకు పట్టిన చీడపురుగు వైసీపీ**

బడ్జెట్ పై అసెంబ్లీకి వచ్చి మాట్లాడే ధైర్యం లేని పార్టీ అధినేత... పెద్దల సభలో దేవుడిని అవమానిస్తూ వైసీపీ సభ్యుల పిల్లచేష్టలు చూశాక, ఆ పార్టీ ప్రజాస్వామ్యమనే పచ్చని పైరుకు పట్టిన



చీడపురుగనే చెప్పాలి. ప్రజలకు తనకిచ్చిన 11 స్థానాల ఓటమి తాలూకా నిరుత్సాహం, నిర్వేదాన్ని కప్పిపుచ్చుకోవడానికే జగన్ చంద్రబాబు, పవన్, లోకశ్‌లపై నేలబారు విమర్శలు చేస్తున్నాడు. ప్రభుత్వ నిర్ణయాలు.. పాలనాంశాల కంటే తన అబద్ధాలు. అసత్యాలు, ప్రభుత్వం, ప్రధాన నాయకులపై చేసే విమర్శలే జనంలో నానాలన్న లక్ష్యంతోనే జగన్ ప్రెస్ మీట్ల పేరుతో నోటికొచ్చిన అబద్ధాలు చెబుతున్నాడు. అని మాజీమంత్రి ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్

**●కాకినాడ రూరల్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ కటకశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి)**

కాకినాడ (చైతన్యరథం): కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ప్రజల సమస్యలకు ప్రత్యక్ష వేదికగా మారిన ప్రజా దర్బార్ కార్యక్రమం కరప మండలం యండమూరి గ్రామంలో రాజు గారి పంచాయతీ వద్ద ప్రజా దర్బార్ విశేష స్పందన పొందింది. కాకినాడ రూరల్ టిడిపి కో కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వివరించారు. సందర్భంగా కటకం శెట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్యులు నారా లోకేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇల్లు పట్టాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లు, ట్రై సైకిళ్లు, సీఎంఆర్ఎఫ్, చంద్రన్న బీమా తదితర అంశాలపై మొత్తం 126 అర్జీలు స్వీకరించినట్లు వెల్లడించారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు వెంటనే పంపించి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్ గౌడ్, రాష్ట్ర మాల



కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లబత్తుల అప్పారావు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కౌజు నెహ్రూ, మూడో వార్డు ఇంచార్జ్ యాళ్ళ రాజా, గుడాల లోవరాజు, దాసరి దొరబాబు, సవరపు సత్తిబాబు, తోట కృష్ణ,తెలుగుదేశం నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లతో 3వ డివిజన్‌లో అభివృద్ధి పనులు

**●రూ.10 లక్షలతో డ్రైనేజీల అభివృద్ధికి శంకుస్థాపన**

**●ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడి**

రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక 3వ డివిజన్‌లో రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సదరు డివిజన్‌లోని డ్రైనేజీల అభివృద్ధి కోసం రూ. 10 లక్షలతో చేపట్టిన పనులకు ఈ రోజు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్దే ధ్యేయంగా పనులు చేయడం జరుగుతోందన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో ఏదో ఒక ప్రాంతంలో నిత్యం అభివృద్ధి పనులు జరుగుతుండడాన్ని మనం చూడొచ్చన్నారు. కాగా 3వ డివిజన్‌లో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు రూ. 20 లక్షలతో గతంలో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని వివరించారు. ప్రస్తుతం రూ. 10 లక్షలతో డ్రైన్స్ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మొత్తంగా రూ. 30 లక్షలతో పనుల పూర్తి చేయడం... చేపట్టడం జరిగిందన్నారు. ఏవీ అప్పారావు రోడ్డునుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ ఉన్న రోడ్డును రూ.కోటి 80 లక్షలతో నిర్మించేందుకు ప్రణాళికలు ఉన్నాయి... దానికి సంబంధించిన పనులు టెండర్ స్టేజ్‌లో ఉన్నాయన్నారు. సదరు 3వ డివిజన్‌లో రోడ్లు డ్రైనేజీల నిర్మాణానికి మరో రూ. 2 కోట్లు



అవసరం ఉందన్నారు. ఆ పనులన్నీ పూర్తయితే ఈ డివిజన్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చేసినట్టు అవుతుందన్నారు. ఇవన్నీ పుష్కరాలలోపు పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నామన్నారు. కాగా గత వైకాపా పాలకులు ఉన్న నిధులను ఎలా దుర్వినియోగం చేశారో... సుంకరీకరణ పేరుతో ఎలా ప్రచార ఆర్భాటం చేశారో ప్రజలు గమనించాలన్నారు. ఆ నిధులన్నీ అనవరమైన పనులకు వెచ్చించారని మండిపడ్డారు. ప్రస్తుతం తామయితే ప్రజలకు ఏం అవసరమో... ప్రజల ఆలోచనలకు తగ్గట్టే ఆ పనులు చేయడం జరుగుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవనీ కుమార్, ఛాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు, స్థానిక నాయకులు జక్కంపూడి అర్జున్, అహ్మదున్నీషా, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# కాకినాడ బకింగ్ హోమ్ కెనాల్‌ను అభివృద్ధి పరచాలి

**●శాసనసభలో వనమాడి కొండబాబు ప్రస్తావన**

కాకినాడ (చైతన్యరథం): కాకినాడ నుండి రాజమండ్రి గోదావరి మీదుగా తమిళనాడు పుదుచ్చేరి వరకు విస్తరించి ఉన్న బకింగ్ హోమ్ కెనాల్‌ను అభివృద్ధి పరిచి టూరిజం మరియు రవాణా రంగానికి వినియోగించుకొనెలా చర్యలు చేపట్టాలని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు శుక్రవారం శాసనసభలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో కాకినాడ నుండి పుదుచ్చేరి వరకు విస్తరించి ఉన్న బకింగ్ హోమ్ కెనాల్‌ను రవాణా రంగానికి వినియోగించు కొనేవారని, బకింగ్ హోమ్ కెనాల్ అభివృద్ధికి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో అభివృద్ధిపరిచి టూరిజం మరియు రవాణా రంగానికి ఉపయోగపడేలా ప్రణాళికలు సిద్ధం చేయగా గత వైసిపి ప్రభుత్వం బకింగ్ హోమ్ కెనాల్ అభివృద్ధిని విస్మరించిందని, నేడు



పరిశ్రమలు మరియు పట్టణాలు నుండి మురుగునీరు కెనాల్‌లోకి చేరుతుందని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మరియు ఇరిగేషన్ శాఖ చర్యలు చేపట్టి మురుగునీరు కెనాల్‌లోకి చేరకుండా చర్యలు చేపట్టాలని, కాకినాడ నుండి తమిళనాడు వరకు విస్తరించి ఉన్న బకింగ్ హోమ్ కెనాల్‌ను టూరిజం మరియు రవాణా రంగానికి ఉపయోగపడేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి పరచాలని కొండబాబు శాసనసభలో కోరారు.

# చింతలపూడి జూనియర్ జడ్జి సివిల్ కోర్టుల భవనాలు మంజూరు

చింతలపూడి (చైతన్యరథం): చింతలపూడిలో రెండు జూనియర్ సివిల్ కోర్టు భవనాల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ని, కార్యదర్శి ప్రతిభా దేవిని కోరారు. శు క్రవారం సచివాలయంలో ఆయన కలిసి ఈ మేరకు విజ్ఞాపన పత్రం సమర్పించారు. అదే విధంగా కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరును నియమించాలని విజ్ఞప్తి చేశారు. చింతలపూడిలో రెండో అదనపు కోర్టు భవనాలు 2026-27 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేస్తామని సిబ్బందినీ నియమిస్తామని కార్యదర్శి ప్రతిభా దేవి పేర్కొన్నారు. సిబ్బంది నియామకం అయిన తర్వాత ఏజీపీని నియమిస్తామని ఆమె పేర్కొన్నారు.

# కల్తీ నెయ్యి అంశం పక్కదారిపట్టించేందుకే హెరిటేజ్‌పై దుష్ప్రచారం

**◆హెరిటేజ్‌పై దుష్ప్రచారం ఆపాలంటూ టీడీపీ నేతల హెచ్చరిక**



విజయవాడ (చైతన్యరథం): తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో ఆ అంశం పక్క దారి పట్టించేందుకు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కల్తీ నెయ్యి వ్యవహారంలోకి కావాలనే నారా భువనేశ్వరి నడుపుతున్న హెరిటెజ్ సంస్థపై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథం మండిపడ్డారు. వైసీపీ నాయకులు హెరిటెజ్ సంస్థపై చేసిన అసత్య ఆరోపణలు ఖండిస్తూ శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ నేతల దొంగే దొంగ అని అరుస్తున్నట్లు" ఉన్నాయని విమర్శించారు. స్వార్థ రాజకీయ లాభాల కోసం వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ, మీడియా దృష్టి ఆకర్షించేందుకు హెరిటేజ్‌పై బురద జల్లుతున్నారని ఆరోపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మటానికి సిద్దంగా లేరన్నారు. ఈ నెల 14 వ తేదీన బ్లూ మీడియా పత్రికలో ప్రచురించిన కథనాలను సోషల్ మీడియాలో తొలగించాలని ఢిల్లీ హైకోర్టు చెప్పినా, కోర్టు ఆదేశాలను వైసీపీ బేఖాతరు చేసి... విమర్శలకు దిగుతోందని గురునాథం ఆగ్రహం వ్యక్తం చేశారు. హెరిటేజ్ సంస్థ రూ.100 కోట్ల పరువు నష్టం దావా కూడా దాఖలు చేసినట్లు తెలిపారు. శాసనమండలిలో వైసీపీ చేస్తున్న ఆరోపణలను నిరూపించమంటే... వాకౌట్ చేస్తూ బయటకు వెళ్లిపోతున్నారని ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థను నారా భువనేశ్వరి సుమారు 33 సంవత్సరాల క్రితం కేవలం రూ.4 కోట్ల పెట్టుబడితో ప్రారంభించగా, ఈ సంస్థ 4 వేల కోట్ల టర్నోవర్‌తో ఎదిగి, దాదాపు మూడు లక్షల మంది పాడి రైతులకు ఆదాయ వనరుగా నిలుస్తోందన్నారు. నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, 300 మందికి పైగా నిపుణులతో ఉత్పత్తుల పరీక్షలు నిర్వహించే పారదర్శక వ్యవస్థగా హెరిటేజ్ నిలిచిందని వివరించారు. హెరిటేజ్‌కు ఎలాంటి సంబంధం లేని సంస్థలను కలిపి చూపిస్తూ వైయస్సార్‌సీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బోలే బాబా మిల్క్ ప్రొడక్ట్స్‌కు హెరిటేజ్‌తో సంబంధం వుందని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అదే విధంగా ఇందాపూర్ సంస్థకూ హెరిటేజ్‌తో ఎలాంటి సంబంధం లేదని, ఆ సంస్థ ప్రతినిధులే స్పష్టంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. హెరిటెజ్ సంస్థ తొమ్మిది రాష్ట్రాల్లో పారదర్శకమైన ఉత్పత్తులతో ముందుకెళ్తోందని వివరించారు. వైసీపీ హయంలో బ్లూ మీడియా భారతి సిమెంట్స్ వంటి సంస్థలకు అనుకూలంగా వ్యవహరించిన విషయాలు అందరికీ తెలిసినవేనని అన్నారు. వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలకు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారని... ఏపీలో వైసీపీ మనుగడ సాగించలేదని గురునాథం దుయ్యబట్టారు. సీఎంగా చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పారదర్శక పరిపాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో-ఆర్డినేటర్ వల్లభనేని నరసింహా చౌదరి, టీడీపీ క్రిస్టియన్ నాయకులు ఇత్తడి చార్లెస్ పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలను రక్షించాలి... వెంటనే సాగునీటిని విడుదల చేయాలి

**◆మంత్రి నిమ్మలను కోరిన నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ**

అమరావతి (చైతన్యరథం): నాగార్జునసాగర్ ఎడమకాలువ 2వ, 3వ జోన్‌లలో ఆయకట్టుదారులు సాగు చేసిన ఆరుతటి పంటలకు తెలంగాణా నుంచి సాగర్ జలాలను విడుదల చేయించి రైతులను కాపాడాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు నాగార్జునసాగర్ ఎడమకాలువకు ప్రాజెక్ట్ కమిటీ కోరింది. శుక్రవారం సాయంత్రం విజయవాడ, ఎం.జి రోడ్లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణరావు ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు కలిసి పూర్తి వివరాలతో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విజయవాడ నుండి సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ... నాగార్జునసాగర్ ఎడమకాలువ 3వ జోన్లో ఉమ్మడి కృష్ణాజిల్లా నూజివీడు, గన్నవరం, మైలవరం, తిరువూరు, నందిగామ నియోజకవర్గాలలోని ఆయకట్టు దారులు 80 వేల ఎకరాలలో మొక్కజొన్న, మిర్చి తదితర ఆరుతడి పంటలను ఈసీజన్ లో సాగర్ జలాల మీద ఆధారపడి సాగు చేయటం జరిగిందని, ఈ జనవరి నుంచి కృష్ణానది యాజమాన్య బోర్డు (కె.ఆర్.ఎం.బి) విడుదల ఉత్తర్వులు ఉన్నప్పటికీ పైన తెలంగాణా ప్రభుత్వం ఇంతవరకు సాగర్ జలాలను విడుదల చేయకపోవుటం వలన ఆయకట్టులోని ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయిని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని 3వ జోన్‌కు 14 టి.ఎం.సి లు కోటా ఉండగా ఇంతవరకు 3 టి.ఎం.సి.లు మించి సాగు జలాలు రాలేదని ఈ తీవ్ర నీటి ఎద్దటి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ బోర్డర్ 101 కి.మీకు 15 రోజులు నిరాటంకంగా 1800 క్యూసెక్యులు తెలంగాణా నుంచి సాగర్ జలాలను విడుదల చేయించాలని మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి సమర్పించారు.

# నేడు వినుకొండకు సీఎం చంద్రబాబు

**◆ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినుకొండ పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వెల్లడించారు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు నాయుడు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వినుకొండకు చేరుకుంటారని జీవీ ఆంజనేయులు వెల్లడించారు. పట్టణంలోని ఎన్ఎస్పీ కాలనీలోని ప్రజావేదిక సభా ప్రాంగణాన్ని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జిల్లా కలెక్టర్ కృతికాశుక్ల, ఎస్పీ బి. కృష్ణారావులతో కలిసి సందర్శించారు. సభ నిర్వహణ తీరుతెన్ను, సీఎం రాకకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్గాన్ని పరిశీలించారు. సీఎం చంద్రబాబు సందర్శించనున్న స్వచ్ఛరత్నం స్టాల్స్ ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ పట్టణ శాశ్వత తాగునీటి పథకానికి రూ.210 కోట్లు నిధులు ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. రూ.9.60 లక్షల కోట్లు అప్పులు చేసిన జగన్ రాష్ట్రాన్ని దోచుకున్నారని జీవీ ధ్వజమెత్తారు. విదేశీ పెట్టుబడులు ఆకర్షించడంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందని, రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు ఏపీకి రావటంలో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషి ఎంతో ఉందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఆరోగ్య ఆంధ్ర సాధించాలంటే స్వచ్ఛాంధ్ర సాధించాలన్నారు. స్వచ్ఛాంధ్ర సాధించి, స్వర్ణాంధ్రగా రాష్ట్రం అడుగులు వేయాలన్నదే చంద్రబాబునాయుడు తపన అని జీవీ అన్నారు. రాష్ట్రంలో ఆయు:ప్రమాణం 75 ఏళ్ళ నుండి 90 ఏళ్ళకు పెంచడమే ఆరోగ్య ఆంధ్ర లక్ష్యమని జీవీ వివరించారు. జగన్ అధికారం నుండి దిగిపోతూ చెత్తమీద పన్ను వేయటమేకాక, 85 లక్షల టన్నులు చెత్త వదలి వెళితే రాష్ట్రాన్ని చక్కబెట్టే బాధ్యత చంద్రబాబు తీసుకున్నారని అన్నారు. వినుకొండ పురపాలక సంఘానికి రాష్ట్రంలో 9వ ర్యాంకు రాగా రానున్న రోజుల్లో మొదటి ర్యాంకులో నిలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు హయాంలో 23 లక్షల మరుగుదొడ్లు నిర్మించామని చెప్పారు. ప్రజల మేలు కోరేది కూటమి ప్రభుత్వమేనని జీవీ స్పష్టం చేశారు. వినుకొండ నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎంకు వివరిస్తానని, ఎన్ఎస్పీ స్థలంలో అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు సీఎం సహకారం కోరతామని జీవీ వెల్లడించారు. అప్పుల భారం ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట కోసం సూపర్ సిక్స్ పథకాలకు రూ.70 వేల కోట్లు ఏటా ఖర్చుచేస్తున్నామన్నారు.

# చెప్పులు, బూట్ల వేసుకొని దేవుడి ఫొటోలతో రాజకీయాలు మహాపాపం

**◆ వైసీపీ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి: దేవినేని ఉమా ధ్వజం**



విజయవాడ (చైతన్యరథం): దేవుడి ఫొటోలను ఉపయోగించి నిరసన ప్రదర్శనలు చేయడం అనైతికమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వైసీపీపై తీవ్రంగా మండిపడ్డారు. ప్లకార్డుల్లో స్వామి చిత్రాలను పెట్టుకుని చెప్పులు వేసుకుని ర్యాలీలు చేయడం హిందూ సంప్రదాయాలపై అవమానమని పేర్కొన్నారు. స్వామివారి ప్రసాదం తీసుకునేటప్పుడు చెప్పులు తీసి భక్తితో స్వీకరించే సంస్కృతి మనదని, అలాంటి పవిత్రమైన విషయాన్ని రాజకీయాలకు వాడుకోవడం దురదృష్టకరమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చర్యలు హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. సభలో స్వామివారి పట్ల జరిగిన ఘటన మహాపాపమని, రాష్ట్ర ప్రజలకు వైసీపీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతి ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుల్లో ముద్దాయిగా జైలుకు వెళ్లిన వారు దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా హెరిటేజ్ గురించి మాట్లాడాతరా అని ప్రశ్నించారు. 35 ఏళ్లుగా మచ్చలేకుండా నడుస్తున్న హెరిటేజ్ ఫుడ్స్‌పై రాజకీయ కక్షతో బురదజల్లుతున్నారని విమర్శించారు. వేల కోట్ల ఆస్తులను అడ్డగోలుగా అమూల్‌కు దోచిపెట్టి ఇప్పుడు రైతులు, డెయిరీల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు బయటపడతాయనే భయంతోనే అసెంబ్లీకి వెళ్లడం లేదని వైసీపీపై ఉమా తీవ్ర విమర్శలు గుప్పించారు.

# హెరిటేజ్‌పై వైసీపీవి నిరాధార ఆరోపణలు : ఏపీ టీఎస్ ఛైర్మన్ మన్నవ



గుంటూరు (చైతన్యరథం): నిజం గడప దాటకముందే అబద్దం ఊరు చుట్టేస్తుందన్నట్లు ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి అట్లాగే వుంది. నోటికి వచ్చిన అబద్దాలు ఆడటం, ఆరోపణలు చేయడం, దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం వైసీపీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్యగా మారిపోయిందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్టన వ్యాఖ్యానించారు. గత వైసీపీ హయాంలో టీటీడీలో ఎన్నో ఘోరాతి ఘోరాలు, మరెన్నో పాపిష్టి పనులకు తెగబడిన జగన్ అండ్ కో... ఇప్పుడు తాము ఏదో పవిత్రులం అయినట్లు జగన్నాటకాలు ఆడటం విడ్డూరంగా ఉందన్నారు. గత 35 ఏళ్లుగా ఎటువంటి మచ్చలేకుండా నడుస్తున్న హెరిటేజ్ సంస్థపై జగన్ తన అక్కసును వెళ్లగక్కుతున్నాడని మండిపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ మహాపాపం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తప్పుడు ఆరోపణలు చేస్తూ.. శుక్రవారం శాసనమండలిలో వైసీపీ సభ్యులు ఏకంగా దేవుడి ఫోటోలతో గదరగోళం సృష్టించి మరింత దారుణమన్నారు. గోవింద గోవింద అంటూ గోవింద నామాలపై నినాదాలు చేయడం... అరుపులు, కేకలు వేస్తూ దేవుడి ఫోటోలను టేబుల్‌పై విసిరేసి వెళ్లడం దేవదేవుడికే అపచారమని, వికృత చేష్టలతో స్వామి వారిని అవమానించిన తీరు మనసు కలచివేసిందన్నారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరులో మన్నవ మోహనకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... దేవుడు పట్ల భక్తి-భయం లేకుండా వైసీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారని, చివరికి దైవం పట్ల పాపభీతి కూడా వారికి లేదన్నారు. ఎంతో పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి పాపం మూటకట్టుకున్నారని, ఇదే విషయం సీబీఐ వేసిన సిట్ సైతం స్పష్టం చేసిందని తెలిపారు. ఈ అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి, సభలో చర్చలకు ఆటంకం కలిగించడానికి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి వైసీపీ సభ్యులు రచ్చ చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలతో పాటు తిరుపతి లడ్డూ అంశంపైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించినా వైసీపీ సభ్యులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా, తమ తప్పులు బయటపడకుండా వైసీపీ సభ్యులు ఎంతటి నీచానికైనా దిగజారిపోతున్నారని మండిపడ్డారు. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారం బయటకు రావడంతో జగన్, వైసీపీ సభ్యులు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని, ప్రజలను వారిని పట్టించుకోవడం మానేశారని అన్నారు. చేసిన తప్పులు ఒప్పుకుని దేవుడిని క్షమాపణ వేడుకుంటే జగన్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్తు ఉంటుందని మోహనకృష్ణ హెచ్చరించారు.

# ఇంటికో మహిళా పారిశ్రామికవేత్త కావాలన్నదే సీఎం లక్ష్యం

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



బుచ్చిరెడ్డిపాలెం (చైతన్యరథం): మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే నవసమాజ నిర్మాణం సాధ్యం అవుతుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డి పాలెం పట్టణంలో మెప్మా ఆర్థిక సహాయంతో స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శారీ రోలింగ్ సెంటర్ ను ఆమె ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలకు శ్రీకారం చుట్టి 25 ఏళ్లు పూర్తికావస్తుండటం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డ్వాక్రా సంఘాల విజయాలను పురస్కరించుకొని సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకోబోతున్నామని ఆమె వెల్లడించారు. నాడు చంద్రబాబు నాయుడు వేసిన డ్వాక్రా సంఘాల పునాది నేడు మహిళల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఒకప్పుడు కేవలం ఇంటికే పరిమితమైన మహిళలు పొదుపు సంఘాలలో సభ్యులై నేడు స్వయం ఉపాధి రంగాల్లో రాణించడం మహిళా సాధికారతకు నిదర్శనం అన్నారు. ప్రతి ఇంటి నుండి ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. పొదుపు మహిళల ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డి పాలెంలో ప్రారంభించిన ఈ శారీ రోలింగ్ సెంటర్ దినదినాభివృద్ధి చెంది మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆదర్శం కావాలన్నారు. మెప్మా ద్వారా పొదుపు సంఘాలకు ఆర్థిక సహాయం అందించి వారు సొంతంగా వ్యాపారాలు చేసుకునేలా ప్రభుత్వం నిరంతరం ప్రోత్సహిస్తుందని హామీ ఇచ్చారు. మార్చి 8 నుంచి డ్వాక్రా మహిళల కోసం ప్రత్యేక రుణ పథకాలను ప్రభుత్వం అమలు చేయబోతోందని ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్లు శివకుమార్ రెడ్డి, పటాన్ నస్రీన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు వీఎ శేషయ్య, నగర అధ్యక్షుడు శ్రీనివాసులు, జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, బుచ్చిరెడ్డి పాలెం పట్టణ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, మెప్మా అధికారులు పాల్గొన్నారు



# చిత్తూరు నగర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

## చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

చిత్తూరు (చైతన్యరథం): జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరం ప్రగతి పథంలో పయనిస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తూరు నగర సర్వతోముఖాభివృద్ధేలక్ష్యంగా పనిచేస్తోందని ఉద్ఘాటించారు. చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో ని 10 వార్డు శాంతి నగర్లో 7.25 లక్షలు, అలాగే 15 డివిజన్లో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీ రోడ్లను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజా సేవే పరమావధిగా భావించి తాము పని చేస్తున్నామని తెలిపారు. చిత్తూరు నగర రూపురేఖలు మార్చడమే తమ సంకల్పమన్నారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ఆ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చూడ ఛైర్పర్సన్ కఠారి హేమలత, మార్కెట్ చైర్మన్ ఝాన్సీ వెంకటేష్, 10 వార్డు, 15 డివిజన్ కూటమి, నాయకులు కార్యకర్తలు, నగరపాలక సంస్థ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమమే లక్ష్యం: మంత్రి సతీమణి రమాదేవి



నెల్లూరు (చైతన్యరథం): ముస్లీం మైనార్టీల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి పేర్కొన్నారు. నెల్లూరులోని గోమతి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ముస్లిం మైనార్టీ నేతలు మత పెద్దలతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరుల కోసం చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలు, మైనార్టీల సంక్షేమం భవిష్యత్ కార్యాచరణపై ఈ సందర్భంగా వారు సుదీర్ఘంగా చర్చించారు. మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల మత పెద్దలు సంతృప్తి వ్యక్తం చేస్తూ, పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ం ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాబ్ మేళాకు విశేషస్పందన

దర్శి (చైతన్యరథం): పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు డిగ్రీ కాలేజీ యాజమాన్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో దర్శి టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొని నిరుద్యోగ యువతని ఉద్దేశించి ప్రశాంగించారు. వారితోపాటు పొట్టి శ్రీరాములు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.పెద్దిరాజు, ప్రకాశం జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి జె రవికుమార్ తదితరులు ఉన్నారు. ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో దర్శి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్నానని గొట్టిపాటి స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామిని నెరవేర్చడం కోసం ఈరోజు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా పొట్టి శ్రీరాములు డిగ్రీ కాలేజీ లో ఈ జాబ్ మేళా ఏర్పాటు జరిగిందన్నారు. దర్శి నియోజకవర్గం లో ఇప్పటి వరకు 4 జాబ్ మేళాలు నిర్వహించామన్నారు. ఉద్యోగ మేళాకు నిరుద్యోగ యువత నుండి భారీ స్పందన వచ్చింది. దర్శి నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాలనుండి భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి. పిచ్చయ్య, దర్శి ఏఎంసి చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, టౌన్ టీడీపీఅధ్యక్షులు చిన్న పాల్గొన్నారు.



# తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా చదవాలి : కోటంరెడ్డి పిలుపు



నెల్లూరు, (చైతన్యరథం): తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా అందరూ కష్టపడి చదవాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఏసీ నగర్ లోని మల్లెల సంజీవయ్య మెమోరియల్ స్కూల్లో నిర్వహించిన యాన్యువల్ స్పోర్ట్స్ మీట్లో సతీమణి సంధ్యారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులను కోటంరెడ్డి ఘనంగా సాగించారు. వారిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో నందమూరి బాలకృష్ణ సేవా సమితి పేరు మీద లక్ష రూపాయల విలువ చేసే స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఈ పాఠశాలను దత్తత తీసుకున్న మాజీ కౌన్సిలర్ కోటంరెడ్డి సంధ్యాను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలలోనే కాకుండా విద్యలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తూర్పు ప్రాంతానికి పెన్నా నీళ్ళు తీసుకురావాలని ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించిన రోజులు గుర్తు వస్తున్నాయనీ ఆయన అన్నారు. ఎంపీ నిధులతో స్టాఫ్ రూమ్, వాష్ రూమ్ ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి నారాయణ సహకారంతో 12 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. తమ కుటుంబానికి ఈ స్కూల్ సెంటిమెంట్ అని దిన్ని అన్ని విధాలా అభివృద్ధి చెయ్యడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హెడ్ మాస్టర్ మురళి కృష్ణ, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, పసుపులేటి మల్లికార్జున, సుభాన్ భాష డివిజన్ నాయకులు కార్యకర్తలు లైన్స్ క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.. ఈ కార్యక్రమంలో ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, పసుపులేటి మల్లికార్జున, సుభాన్ భాష డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మైనార్టీల్లో అత్యధికం కార్మిక వర్గానికి చెందిన వారే

## ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు, (చైతన్యరథం): నగరంలోని శిఖరం వారి వీధిలోగల జామియా మస్జిద్‌లో ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, ముస్లిం సామాజిక వర్గంలో అత్యధిక శాతం కార్మిక వర్గానికి చెందిన వారే ఉన్నారని వారు ఉపవాసం ఉండి కూడా వారి యొక్క రోజువారి పనులు చేసుకుంటూ ఉంటారని, దేవుడి దయ వల్ల వాతావరణం కూడా అనుకూలంగా ఉందని అన్నారు. ఈ జామియా మసీద్ ను తరతరాలు గుర్తుపెట్టుకోవాలని, ఈ మసీదు యొక్క స్థలంలోనే ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మించబోతున్నామని అన్నారు. ఈ మసీదుకు నూతనంగా కమిటీని నియమించామని, కమిటీలో కొంతమందిని మాత్రమే నియమించగలిగామని అందరూ కలిసి దేవుడి పని చేయాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి వక్ఫ్ సంస్థ రెంట్ రివ్యూ చేపట్టాలని, మార్కెట్ వ్యాల్యూ కు అనుగుణంగా అద్దెలు చెల్లించాలని అన్నారు. వక్ఫ్ సంస్థలకు ఆదాయాన్ని పెంచి ఆ ఆదాయాన్ని పేద ముస్లిం సమాజానికి ఉపయోగించాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ ఆస్తులకు అద్దె తక్కువ ఇచ్చి ముస్లింలు బాగుపడటం కాదని వ్యాపారం బాగా చేసుకుని ఆ సంస్థలకు ఆదాయాన్ని పెంచి ముస్లిం సమాజ యొక్క అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. దేవుడి వస్తువులను చీప్‌గా కాదని, ప్రీమియంగా తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మార్కెట్ విలువకు అనుగుణంగా అద్దెలు చెల్లించాల్సిందేనని, ఆ విషయంలో తాను చాలా గట్టిగా ఉన్నానని తెలిపారు. రంజాన్ సందర్భంగా అన్ని మసీదుల వద్ద శానిటేషన్ మెరుగ్గా ఉండాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మైనుద్దీన్, నన్నే సాహెబ్, సాబీర్ ఖాన్, ఇంతియాజ్, రియాజ్, హయాత్ బాబా, ఆదిల్, మునీర్ పాల్గొన్నారు.

# రైతుల పాసుపుస్తకాలపై నీ ఫోటో ఎలా వేసుకుంటావ్ జగన్‌రెడ్డీ!



## అసెంబ్లీ వేదికగా వైసీపీ నిర్వాకాన్ని నిలదీసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు (చైతన్యరథం): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు సంబంధించిన పాసుపుస్తకాలపై తన ఫోటోలు వేసుకోవడమే కాకుండా రీసర్వే పేరుతో ఆందోళన సృష్టించారని, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీ వేదికగా వైసీపీ నిర్వాకాన్ని దుయ్యబట్టారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మరోసారి ప్రజా సమస్యలపై తన వాణి వినిపించారు. వైసీపీ పాలనలో విద్యుత్ రంగ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో మిగులు విద్యుత్తుతో పాటు విద్యుత్ ఛార్జీలు కూడా తగ్గించారన్నారు. ఈ బడ్జెట్లో సుమారు 14వేల కోట్ల కేటాయించారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేశారని, ఇంకా సోమలదొడ్డి, బండమీదపల్లి, మన్నీల, ఆలమూరు, వేపకుంట, దాదులూరు, న్యామద్దల గ్రామాలలో నూతన సబ్ స్టేషన్లు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన 15వందల మంది రైతులకు ట్రాన్స్ ఫార్మర్లు, ఇతర మెటీరియల్, 100కిలోమీటర్లు కేబుల్ మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ సిబ్బంది కొరత ఉందని.. లైన్ మెన్లు, ఏ.ఈ లను నియమించాలని కోరారు. ఎన్ని చర్యలు తీసుకున్నా.. అక్కడక్కడ లో ఓల్టేజ్ సమస్య ఏర్పడుతోందని దీనిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రెవెన్యూశాఖకు రూ”3868కోట్లు కేటాయించినందుకు ముఖమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. రాయలసీమ నేలపై పుట్టిన ఓ మహిళా ప్రజాప్రతినిధిగా, భూమి అంటే ఏంటి.. ఆ విలువ ఏంటి అనేది నాకు బాగా తెలుసన్నారు. భూమి అంటే కేవలం ఆస్తి కాదు రైతు భవిష్యత్తు అని సునీత అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, రాజకీయ అక్రమాల వల్ల రాష్ట్రంలో భూముల రికార్డులు గందరగోళంగా మారాయాన్నారు. రైతు తన సొంత భూమి పత్రం చూసుకుని కూడా భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు పాసుపుస్తకంపై రాజముద్ర కాకుండా సైకో సీఎం ఫోటో వేసుకున్నారని విమర్శలు చేశారు. సుమారు 7వేల గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేలో భారీ లోపాలు బయటపడ్డాయని.. 5వేల గ్రామాల్లో పంపిణీ చేసిన భూ హక్కు పత్రాల్లో తీవ్రమైన తప్పులు దొర్లాయన్నారు. ఈ ప్రభుత్వంలో నిర్వహించిన గ్రామసభల్లో 7లక్షల 50వేల ఫిర్యాదులు రావడం గత పాలన వైఫల్యానికి అద్దం పడుతోందన్నారు. మేము ఎక్కడికి వెళ్లిన రెవెన్యూ సమస్యలే మాకు వినిపిస్తున్నాయన్నారు. భూ హక్కు పత్రాలపై రాజకీయ నేత ఫోటోలు ముద్రించడం పరిపాలనా అహంకారానికి నిదర్శనమని సునీత వ్యాఖ్యానించారు. సర్వే రాళ్లపై బొమ్మల కోసం 7వందల కోట్లు, పత్రాలపై ఫోటోలకు 22కోట్లు ఖర్చు చేయడం ప్రజాధన దుర్వినియోగం కాదా అని వైసీపీని నిలదీశారు. వీటిన్నింటినీ కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు సరి చేశారన్నారు. ఇది రైతుల నమ్మకాన్ని నిలబెట్టిన ప్రభుత్వం అని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# ఘనంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ట

## కార్యక్రమంలో పాల్గొన్న ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్



ధర్మవరం (చైతన్యరథం): ధర్మవరం మండలం మల్లాకాలువ గ్రామంలో జరిగిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు శుక్రవారం జరిగిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి వచ్చిన శ్రీరామ్ కు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అర్చకులు శ్రీరామ్‌కు ప్రత్యేకంగా ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణంతో ఒక ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోందన్నారు. గ్రామస్థులంతా ఐక్యంగా ఆలయం నిర్మిస్తున్నారని ఇది మంచి పరిణామమన్నారు. గ్రామాల్లో ఉత్సవాలు, జాతరలు అందరి ఐక్యతకు చిహ్నంగా ఉంటాయన్నారు. ఆ స్వామి వారి ఆశీస్సులు ఈప్రాంత ప్రజలపై ఉండాలని, పాడిపంటలతో రైతులంతా సంతోషంగా ఉండాలని శ్రీరామ్ ఆకాంక్షించారు.

# శాసనమండలి చరిత్రలో చీకటి రోజు



## హిందూపురం పార్లమెంటు సభ్యుడు పార్థసారధి ఆవేదన

హిందూపురం (చైతన్యరథం): రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించేలా చట్టాలు, శాసనాలు చేయాల్సిన నిండు సభలో శ్రీవారికి అపచారం జరిగిందని హిందూపురం ఎంపీ పార్థసారధి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీవారి ఫోటోలను పట్టుకుని కాళ్లకు బూట్లు, చెప్పులు వేసుకుని వైసీపీ సభ్యులు దుర్మార్గానికి ఒడిగట్టడం దారుణమన్నారు. హిందువుల మనోభావాలతో చెలగాటమాడుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డికి వెంకన్నస్వామి మీద నమ్మకం లేకపోతే తన పార్టీ ఎమ్మెల్సీలతో అపచారం కార్యక్రమాలు చేయించడం న్యాయమా అని నిలదీశారు. నోరుతెరిస్తే శ్రీరంగనీతులు చెప్పే బొత్స సత్యనారాయణ దగ్గరుండి ఈ దారుణాన్ని ప్రోత్సహించడం హైందవ లోకానికి తీరని అవమానమన్నారు. హిందువుల మనోభావాలు, శ్రీవారి భక్తుల మనోభావాలపై జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు ముప్పేట దాడులు చేస్తున్నారని, ఇది గర్హనీయమని ధ్వజమెత్తారు. శిక్ష అనుభవించక తప్పదు. శుక్రవారం శాసనమండలిలో శ్రీవారి ఫోటోలతో నీచ రాజకీయాలకు పాల్పడిన వైసీపీ ఎమ్మెల్సీల తీరును యావత్ హైందవలోకం ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. నిన్న కల్తీ నెయ్యితో అపచారం....నేడు కాళ్లకు బూట్లు, చెప్పులతో శ్రీవారి ఫోటోలు పట్టుకుని మహాపచారం. ఇది జగన్మోహన్ రెడ్డి రాజకీయ వికృతక్రీడకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.




# కాణిపాకంలో కమ్మ భవన్

## ప్రారంభించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు మురళీమోహన్, జగన్‌మోహన్

కాణిపాకం (చైతన్యరథం): వరసిద్ధి వినాయక స్వామి దివ్య ఆశీస్సులతో కాణిపాకంలో నూతనంగా నిర్మించిన కమ్మ భవన్‌ను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కాణిపాకం ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మణి నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమార్తె దీప, పాలకమండలి సభ్యుడు వూట్ల నాగరాజునాయుడు, టీడీపీ ఐరాల మండల శాఖ అధ్యక్షుడు హరిబాబునాయుడు, సీనియర్ నేత చంద్రప్రకాష్, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, జడ్పీటీసీ సుచిత్ర, కాణిపాకం పంచాయతీ మాజీ సర్పంచ్ మధుసూదన్, ఐరాల సింగిల్ విండో అధ్యక్షుడు శేషాద్రినాయుడు, తవణంపల్లి మాజీ ఎంపీపీ వేణుగోపాలనాయుడు ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులకు పూతలపట్టు నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కన్వీనర్ గిరిధర్ బాబు నేతృత్వంలో కమ్మ సామాజికవర్గ నేతలు, కూటమి నాయకులు, కార్యకర్తలు సాదర స్వాగతం పలికారు. అనంతరం కాకతీయ కమ్మవారి నిత్యాన్నదాన సత్రంలో కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ముఖ్య అతిథులుగా హాజరు కాగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, కమ్మ సేవా సమితి ముఖ్య నేతలు పాల్గొన్నారు.





తెలుగు నేలపై పుట్టి విదేశీ గడ్డపై నివసిస్తున్నా తెలుగు వెలుగులు విరజిమ్ముతున్నారు మన తెలుగు యువకులు. నూతనోత్తేజంతో, అద్వితీయమైన శక్తితో ప్రపంచ పుటల్లో తమ ఖ్యాతిని లిఖిస్తున్నారు. ఇందుకు నిలువెత్తు నిదర్శనం భరత్ పత్తిపాటి. అతడు రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియో ప్రథమ స్థానంలో నిలిచి భారతదేశ రాజధాని న్యూఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇండియా సమ్మిట్-2026లో ప్రదర్శితమైంది. దీనిని వీక్షించిన భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ప్రపంచం నలుమూలల నుంచి విచ్చేసిన నేతలు బాగుందంటూ ప్రశంసించారు. దీంతో భరత్ ప్రతిభ విశ్వవ్యాప్తమైంది.




# ఏఐ సమ్మిట్‌లో తెలుగు తేజం

- మెల్‌బోర్న్ నివాసి భరత్ పత్తిపాటి వీడియోకు ప్రథమ స్థానం
- వీక్షించి ప్రశంసించిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- విశ్వవ్యాప్తమైన భరత్ ప్రతిభ




మెల్‌బోర్న్: భారత ప్రధానమంత్రి కార్యాలయం మార్గదర్శకత్వంలో ఢిల్లీలో ఏఐ ఇండియా సమ్మిట్-2026 ప్రతిష్టాత్మకంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కంపెనీలు, సృష్టికర్తలు, ఆవిష్కర్తల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తూ ఏఐ వీడియో పోటీ నిర్వహించారు. ఇందులో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు చెందిన ప్రవాస ఆంధ్రుడు భరత్ పత్తిపాటి రూపొందించిన ఏఐ వీడియో ఆకట్టుకోవడంతో పాటు ఆలోచింపజేసింది.



భరత్ ఏఐ వీడియో ఫైనలిస్ట్‌గా ఎంపికవ్వడమే గాక ప్రథమ స్థానంలో నిలిచిందని భారత ప్రభుత్వ కమ్యూనికేషన్లు, ప్రసార శాఖకు చెందిన ఔట్‌రీచ్ టీమ్ ఈ-మెయిల్ పంపింది. కాగా ఈ వీడియోను ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన నేతలు, వివిధ దేశాల ప్రధాన మంత్రులతో పాటు భారత ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో ప్రదర్శించారు.

మెల్‌బోర్న్‌లో నివసిస్తున్న తెలుగు వ్యక్తి ప్రపంచ వేదికపై గుర్తింపు పొందడం ప్రతిభకు హద్దులు లేవని నిరూపిస్తోంది. తెలుగువారు అన్నిచోట్లా ఉన్నారని, అత్యున్నత స్థాయిలో సహకరిస్తూ, ఆవిష్కరణలు చేస్తూ, అగ్రగామిగా నిలుస్తున్నారని ఇది రుజువు చేస్తోంది.

ప్రపంచ పోటీలో మొదటి స్థానంలో నిలవడం అంకితభావం, సృజనాత్మకత, సాంకేతికతతో కూడిన దృష్టి శక్తిని ప్రతిబింబిస్తోంది. అంతేగాక యువతరం పెద్దగా కలలు కనేలా ప్రేరేపిస్తోంది.

'ఈ రోజు మనందరికీ చరిత్రాత్మకమైన రోజు. ఈ విజయం కేవలం భరత్ వ్యక్తిగత మైలురాయి మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి తెలుగు వ్యక్తీ గర్వించదగిన క్షణం. మీరు ప్రపంచవ్యాప్తంగా తెలుగు సమాజం గర్వపడేలా చేశారు. ఈ అద్భుతమైన విజయాన్ని సాధించిన మీకు హృదయపూర్వక అభినందనలు' అంటూ భరత్ పత్తిపాటిని తెలుగు ప్రజలు వేనోళ్ల పొగుడుతున్నారు.


Dear Sir / Ma'am,

Greetings from IndiaAI Mission, MeitY.

We would like to thank you for your participation in the Expression of Interest (EOI) process for production of the **Official Opening Film for the India AI Impact Summit 2026**.

We are pleased to inform you that **your entry has been shortlisted** by the Evaluation Committee.

As the next step, the Committee would like to interact with the shortlisted agencies to share broad feedback and outline the way forward. This interaction may be treated as a **feedback and briefing session** to discuss next steps.

Accordingly, you are requested to kindly join a meeting scheduled as under:

**Date:** February 10, 2026
**Time:** 7:00 PM
**Mode:** Online

The meeting will be brief and focused, and no presentation is required from your side at this stage.

We look forward to your participation.


Regards,

Communications and Outreach Team
India AI Impact Summit 2026
Ministry of Electronics and Information Technology
Government of India

## 'లాస్య 2026 ది ఎన్‌చాంటెడ్ టేల్'

### భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలకు ముస్తాబైన కిర్క్‌ల్యాండ్

కిర్క్‌ల్యాండ్: భారతీయ సంప్రదాయ కళల వైభవం ఉట్టిపడేలా ఒక అద్భుతమైన వేడుకకు అమెరికాలోని కిర్క్‌ల్యాండ్ నగరం ముస్తాబైంది. సీటెల్ సితార ఆధ్వర్యంలో 'లాస్య 2026 ది ఎన్‌చాంటెడ్ టేల్' థీమ్‌తో జాతీయ స్థాయి కళాశాలల భారతీయ శాస్త్రీయ నృత్య, కథా ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ వేడుక ఫిబ్రవరి 21వ తేదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకు కిర్క్‌ల్యాండ్ పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో ప్రారంభమవుతుంది.




దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులు హాజరై తమ నాట్య కౌశలాన్ని ప్రదర్శించనున్నారు. కేవలం నృత్యమే కాకుండా పురాణ గాథలను, చారిత్రక కథలను శాస్త్రీయ నృత్య రూపంలో ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్టు వివరించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. భారతీయ సంస్కృతిని విదేశాల్లో ఉన్న నేటి తరం యువతకు పరిచయం చేయడానికి ఇటువంటి వేదికలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

కళాభిమానులు, స్థానిక భారతీయ కుటుంబాలు ఈ సాంస్కృతిక వేడుకను వీక్షించేందుకు tinyurl.com/laasya2026 వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. సీటెల్ సితార అధికారిక వెబ్‌సైట్, ఫేస్‌బుక్ ఇన్‌స్టాగ్రామ్ పేజీల ద్వారా కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాలను తెలుసుకోవచ్చు. స్థానిక స్వచ్ఛంద సంస్థలు, కళాకారులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మద్దతు ఇస్తున్నారు.

## 55వ వసంతంలోకి టీఎల్‌సీఏ

### 2026 నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా సుమంత్ రాంశెట్టి

నార్త్ అమెరికా: ఉత్తర అమెరికాలోని పురాతన తెలుగు సంఘాల్లో ఒకటైన తెలుగు సారస్వత సాంస్కృతిక సంఘం (టీఎల్‌సీఏ) 2026 ఎగ్జిక్యూటివ్ కమిటీని అధికారికంగా ప్రకటించింది. 1971లో స్థాపితమైన ఈ సంస్థ ప్రస్తుతం 55వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షుడిగా సుమంత్ రాంశెట్టి (2025-2026) వ్యవహరించనున్నారు.



కమిటీలోని ఇతర ముఖ్య బాధ్యులు వీరే:

వైస్ ప్రెసిడెంట్: శ్రీనివాస్ సాగిపల్లి

సెక్రటరీ: లావణ్య అట్లూరి

ట్రెజరర్: సునీల్ చల్లాగుళ్ల

ఎగ్స్-అఫీషియో పాస్ట్ ప్రెసిడెంట్: కిరణ్ రెడ్డి పర్వతాల

జాయింట్ సెక్రటరీ: దివ్య దొమ్మరాజు

జాయింట్ ట్రెజరర్: సుధా మన్నవ

కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్ కారణం, సునీత పోలేపల్లి, శిరీష తునుగుంట్ల, రజిత కల్లూరి, రాంబాబు జల్లెపల్లి, సాయి దేవినేని నియమితులయ్యారు.

**55 ఏళ్ల ఘన చరిత్ర**

న్యూయార్క్, న్యూజెర్సీ, కనెక్టికట్ ప్రాంతాల్లోని తెలుగు ప్రజలను ఏకం చేస్తూ... తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతిని భావితరాలకు అందించడంలో టీఎల్‌సీఏ కీలక పాత్ర పోషిస్తోంది. 55 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఈ సంస్థ అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది. నూతన కార్యవర్గం నేతృత్వంలో రాబోయే కాలంలో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## మధుబని పెయింటింగ్ వర్క్‌షాప్

### 'టాటా' మహిళా విభాగం ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్న ప్రసిద్ధ కళాకారిణి రూప విశ్వనాథ

నార్త్ కరోలినా: ట్రయాంగిల్ ఏరియా తెలుగు అసోసియేషన్ ఆఫ్ NC (TATA) తన 35 సంవత్సరాల ప్రస్థానాన్ని పురస్కరించుకుని 'టాటా మహిళ' విభాగం మహిళల కోసం ప్రత్యేకంగా మధుబని పెయింటింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. ప్రసిద్ధ కళాకారిణి రూప విశ్వనాథ శిక్షణ ఇవ్వనున్నారు.




కార్యక్రమ వివరాలు: ఫిబ్రవరి 21, శనివారం

సమయం: మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు

వేదిక: 707 Carpenter Town Ln, Cary, NC 27519

అర్హత: కేవలం టాటా మహిళా సభ్యులకు మాత్రమే

మరిన్ని వివరాల కోసం టాటా మహిళా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, ట్రెజరర్ హేమ దాసరిని (919-760-7434) సంప్రదించవచ్చు.

టాటా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ - 2026

ప్రెసిడెంట్: వినోద్‌కుమార్ కట్రగంట

వైస్ ప్రెసిడెంట్, టీఎల్‌ఏ: నాగ గొంధి

సెక్రటరీ: వెంకట్ కోగంటి

ట్రెజరర్, మహిళ: హేమ దాసరి

జాయింట్ సెక్రటరీ, తెలుగు బడి: సాయిమహేష్ గడ్డంశెట్టి

స్పోర్ట్స్: వెంకట నరేష్ మొక్క

మెంబర్‌షిప్: ప్రవీణ్ పెద్ది

ఫుడ్, లాజిస్టిక్స్: సాయి శ్రీకాంత్ ఉప్పలపాటి

లాజిస్టిక్స్, చేయూత: భూమేష్ గండే

కల్చరల్, సాహిత్య వేదిక: శివ బొనగిరి

టాటా యువ: గణేష్ మంత్రిప్రగడ

# అమెరికా ఆధ్వర్యంలోని కీలక కూటమిలో భారత్ చేరిక




రేర్ ఎర్త్ ఖనిజాల సరఫరా వ్యవస్థల భద్రత, కృత్రిమ మేధ అభివృద్ధి కోసం అమెరికా సారధ్యంలో ప్రారంభమైన ప్యాక్స్ సిలికా కూటమిలో భారత్ శుక్రవారం అధికారికంగా చేరింది. 15 రకాల లాంథనైడ్స్, స్కాండియమ్, యిట్రియమ్ ఖనిజాలను రేర్ ఎర్త్ ఖనిజాలు అని పిలుస్తారు. సెమీ కండక్టర్, కృత్రిమ మేధ రంగాలకు ఈ ఖనిజాలు అత్యంత కీలకం. అధిక ఖర్చుతో కూడుకున్న సంక్లిష్టమైన ప్రక్రియలతో వీటిని వెలికి తీస్తారు. ఈ ఖనిజాలపై చైనా అధిపత్యాన్ని సవాలు చేసేందుకు అమెరికా ప్యాక్స్ సిలికా కూటమిని ప్రారంభించింది. ప్రస్తుతం జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో భారత్ ఈ కూటమిలో చేరింది. ఈ సందర్భంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ భారత ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ రంగాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ రెండు రంగాలకు సంబంధించి పూర్తిస్థాయి వ్యవస్థ దేశంలో అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్యానించారు. ఈ దిశగా ప్యాక్స్ సిలికా కూటమి ఉపకరిస్తుందని చెప్పారు. ఇది యువతకు ఎంతో లాభిస్తుందన్నారు. ఇది భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యమని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వ్యాఖ్యానించారు. ఈ కూటమిలో భారత్ చేరిక ఒక వ్యూహాత్మక అవసరమని పేర్కొన్నారు. ఖనిజాల ప్రాసెసింగ్ రంగంలో భారత్ మంచి పురోగతి సాధిస్తోందని, ఇక్కడి ఇంజనీరింగ్ నిపుణుల ప్రతిభ అద్భుతమని కొనియాడారు. టెక్నాలజీ రంగంలో భారత్‌అమెరికాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు. అమెరికాతో పూర్తి స్థాయి వాణిజ్య ఒప్పందానికి తుది రూపు ఇచ్చేందుకు భారత్ ప్రయత్నిస్తున్న తరుణంలోనే ప్యాక్స్ సిలికా కూటమిలో చేరడంపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం రేర్ ఎర్త్ ఖనిజాల నిల్వలు అత్యధికంగా ఉన్న దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా వీటి వెలికితీత కార్యకలాపాలు 90శాతం చైనాలో జరుగుతున్నాయి.

# ఇక పిన్ అవసరం లేదు! ఫోన్‌పేలో కొత్త బయోమెట్రిక్ ఫీచర్




భారతీయ డిజిటల్ చెల్లింపుల రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు జేబులో పర్సు లేకపోతే బయటకు వెళ్లడానికే భయపడేవాళ్లం. కానీ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు ప్రపంచాన్ని చుట్టేయొచ్చు అనే స్థాయికి సాంకేతికత చేరుకుంది. ఈ క్రమంలోనే ప్రముఖ డిజిటల్ పేమెంట్స్ యాప్ ఫోన్‌పే తన వినియోగదారుల కోసం అత్యంత సౌకర్యవంతమైన, అదే సమయంలో అత్యాధునికమైన భద్రతా ఫీచర్‌ను పరిచయం చేసింది. సాధారణంగా మనం ఏదైనా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినప్పుడు లేదా ఎవరికైనా డబ్బులు పంపేటప్పుడు 4 లేదా 6 అంకెల పిన్ ఎంటర్ చేయడం తప్పనిసరి. అయితే రద్దీగా ఉండే ప్రదేశాల్లో లేదా ఆదరాబాదరాగా పేమెంట్ చేసే సమయంలో పిన్ టైప్ చేయడం కొంచెం ఇబ్బందిగా అనిపించవచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకుని పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే కేవలం మీ వేలిముద్ర లేదా ముఖ గుర్తింపు ద్వారా లావాదేవీని పూర్తి చేసే బయోమెట్రిక్ ఆథంటికేషన్ వ్యవస్థను ఫోన్‌పే అందుబాటులోకి తెచ్చింది. చిన్న చిన్న దుకాణాలు, పెట్రోలు బంకుల్లో చేసే పేమెంట్ల కోసం మీరు ఇకపై పిన్ గుర్తుంచుకోవాల్సిన పనిలేదు. ఐదు వేల రూపాయల కంటే ఎక్కువ మొత్తం పంపాల్సి వచ్చినప్పుడు మాత్రం భద్రతా దృష్ట్యా పాత పద్ధతిలోనే యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫీచర్‌ను మీ ఫోన్‌లో ఎనేబుల్ చేసుకోవడం చాలా సరళం. దీని కోసం మీరు పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. మొదట మీ ఫోన్ పే యాప్‌ను ప్లేస్టోర్ లేదా యాప్ స్టోర్ నుంచి లేటెస్ట్ వర్షన్‌కు అప్డేట్ చేయాలి. అనంతరం యాప్ ఓపెన్ చేసి... ఎడమవైపు పైన ఉండే మీ ప్రొఫైల్ ఐకాన్‌పై క్లిక్ చేయాలి. అక్కడ కనిపించే ఆప్షన్లలో 'మేనేజ్ పేమెంట్స్' లేదా సెక్యూరిటీ సెట్టింగ్స్‌లోకి వెళ్లాలి. అక్కడ మీకు 'బయోమెట్రిక్ పే' అనే కొత్త ఐకాన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మీ ఫోన్‌లో ఇప్పటికే ఉన్న ఫింగర్ ప్రింట్ లేదా ఫేస్ ఐడీని లింక్ చేయాలి. ఒక్కసారి ఇది ఎనేబుల్ అయ్యాక... మీరు చేసే ప్రతి చిన్న లావాదేవీకి పిన్ అడగడానికి బదులుగా, ఫోన్ స్క్రీన్ అన్‌లాక్ చేయడానికి ఉపయోగించే బయోమెట్రిక్ సెన్సార్‌ను ఉపయోగించమని అడుగుతుంది. ఇది సమయాన్ని ఆదా చేయడమే కాకుండా పేమెంట్ ఫెయిల్యూర్ రేటును కూడా తగ్గిస్తుంది. అయితే ఈ ఫీచర్‌ను ఉపయోగించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు కూడా అవసరం. మీ ఫోన్‌లో ఇతరుల వేలిముద్రలు రిజిస్టర్ అయి ఉంటే, వారు కూడా మీ ప్రమేయం లేకుండా పేమెంట్లు చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి, మీ ఫోన్ బయోమెట్రిక్ యాక్సెస్ కేవలం మీకు మాత్రమే ఉండేలా చూసుకోవాలి.

# తమిళనాట కొత్త 'పొత్తులు'




తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం. అసెంబ్లీ ఎన్నికల వేళ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. తమిళనాడులో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని భావిస్తున్న బీజేపీ అన్నాడీఎంకేతో జత కట్టింది. అటు డీఎంకే తిరిగి తమదే అధికారం అనే ధీమాతో ఉంది. సినీ హీరో విజయ్ రాజకీయంగా తొలి అడుగులోనే సక్సెస్ రేట్ నిరూపించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో సీఎం స్టాలిన్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. తిరిగి అధికారమే లక్ష్యంగా వేస్తున్న అడుగులు ఇప్పుడు రాజకీయంగా సంచలనంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమిళనాడులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అన్నా డీఎంకేతో జత కట్టడం ద్వారా తమిళనాడులో బలం పెరుగుతుందని బీజేపీ నేతలు కొత్త లెక్కలు వేశారు. అటు విజయ్ చీల్చే ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో కలిసి వస్తుందని భావించారు. ఇటు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కొత్త నిర్ణయాలు అమలు చేస్తున్నారు. రాజకీయంగా.. ప్రత్యర్థులపై 'సైలెంట్ ఆపరేషన్' కొనసాగిస్తున్నారు. తాజాగా మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే వలంటీర్ల హక్కుల పునరుద్ధరణ కమిటీ సమన్వయకర్త పన్నీర్‌సెల్వం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిశారు. ఇద్దరూ వన్ టు వన్ సమావేశమయ్యారు. సుదీర్ఘంగా సాగిన భేటీలో ఎన్నికలు, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ వ్యూహాలపై చర్చించారు. 'స్టాలిన్ పాలన బాగుంది, డీఎంకే తిరిగి అధికారంలోకి వస్తుంది' అని పన్నీర్ సెల్వం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తమిళ రాజకీయాల్లో కీలక మలుపుగా మారుతున్నాయి.

## ఎన్నికల పొత్తుల వేళ మారుతున్న లెక్కలు

పన్నీర్‌సెల్వం అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం స్టాలిన్‌ను స్వయంగా కలవడం.. ఆయన పాలనను ప్రశంసించడం ద్వారా రాజకీయంగా స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్టు విశ్లేషణలు మొదలయ్యాయి. స్టాలిన్-ఓపీఎస్ సమావేశం తర్వాత, ఓపీఎస్ డీఎంకేలో చేరబోతున్నారా అనే ప్రశ్న తలెత్తింది. ఓపీఎస్ మద్దతుదారులు ఒక్కొక్కరుగా ఆయన్ను వదిలిపెడుతున్నందున, ఒకటి లేదా రెండు రోజుల్లో ఆయన ఒక ప్రధాన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

కాగా డీఎంకే ఐదేళ్ల పాలనను పొగిడిన పన్నీర్‌సెల్వం.. డీఎంకే పాలనపై ప్రజల్లో నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ డీఎంకే గెలుస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తద్వారా ఇక పన్నీర్ సెల్వం డీఎంకేలో చేరడం లాంఛనంగానే కనిపిస్తోంది. మరోపక్క విజయ్ కొత్తగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఆయన డీఎంకే, ఎన్డీఏ రాజకీయ వ్యూహాలను జాగ్రత్తగా గమనిస్తూ.. అభ్యర్థుల ఖరారుపై ఫోకస్ చేశారు. దీంతో ఎన్నికలకు ముందే రాష్ట్రంలో రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది.



# అన్నదాతను మనువాడితే.. రూ. పది లక్షల నజరానా..!

## కర్ణాటక ప్రభుత్వానికి చేరిన వినూత్న ప్రతిపాదన

అన్నం పెట్టే అన్నదాతకు పిల్లనిచ్చే నాథుడే కరువయ్యాడు. ఎకరాల భూమి, పక్కా ఇల్లు ఉన్నా.. 'రైతు' అనే ముద్ర పడటమే పెళ్లికి అడ్డంకిగా మారుతోంది. కర్ణాటకలో వేలాది మంది యువ రైతులు బ్రహ్మచారులుగా మిగిలిపోవడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. రాన్రానూ సామాజిక సంక్షోభంగా మారుతున్న ఈ పరిస్థితిని చక్కదిద్దాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. తాజా అసెంబ్లీ సమావేశాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యే రంగనాథ్ రైతుల పెళ్లి సమస్యపై మాట్లాడారు. యువ రైతులను పెళ్లి చేసుకునే యువతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. దీంతో కన్నడనాట ఈ అంశం విస్తృత చర్చకు దారితీస్తోంది. ఏపీలోనూ రాయలసీమ ప్రాంతంలో ఇలాంటి సంక్షోభమే ఏర్పడుతోందంటున్నారు. దీంతో రాజకీయ పార్టీలు వచ్చే ఎన్నికల నాటికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాల్సిన అవసరం వస్తుందేమోనని సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు.

రాష్ట్రంలోని మండ్య, కోలార్, తుమకూరు వంటి వ్యవసాయ ఆధారిత జిల్లాల్లో 30 నుంచి 35 ఏళ్ల వయసు దాటిన వేలాది మంది యువ రైతులు పెళ్లి కాకుండా బ్రహ్మచారులుగా గడపాల్సి వస్తోందంటున్నారు. 2024లో మండ్య జిల్లాకు చెందిన సుమారు 200 మందికి పైగా బ్రహ్మచారి యువ రైతులు "వధువు కావాలి" అని కోరుకుంటూ చామరాజనగర్ జిల్లాలోని ఎంఎం హిల్స్ వరకు సుమారు 100 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయడం సమస్య తీవ్రతకు నిదర్శనంగా చెబుతున్నారు.

యువ రైతుల పెళ్లి సమస్య ఒక సామాజిక సంక్షోభంగా మారుతోందని అంటున్నారు. దీనిపై కచ్చితమైన గణాంకాలు లేకపోయినప్పటికీ, క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం వేల సంఖ్యలో యువ రైతులు పెళ్లి కాక ఇబ్బంది పడుతున్నట్లు చెప్తున్నారు. కోట్ల ఆస్తి ఉన్నా సరే వ్యవసాయం చేస్తున్నారన్న కారణంగా యువకులకు పెళ్లికావడం లేదని చెబుతున్నారు. వ్యవసాయంలో వచ్చే ఆదాయం స్థిరంగా ఉండదనే భయం, నగర జీవనంపై వ్యామోహం, గ్రామీణ ప్రాంతాల్లో ఉండటానికి యువతులు ఇష్టపడకపోవడం వంటి కారణాలతో యువతులు రైతులను పెళ్లి చేసుకోవడానికి ఆసక్తి చూపట్లేదంటున్నారు. కూలిపనైనా సరే నగరంలో ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్తున్నారు. సొంతంగా ఎకరాల భూమి ఉన్న రైతును చేసుకోవడానికి వధువుతో పాటు ఆమె తల్లిదండ్రులు ఆసక్తి చూపట్లేదని ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ సమస్యను అధిగమించడానికి ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగాల్సి వస్తోంది. తాజాగా అసెంబ్లీలో చర్చ సందర్భంగా రైతును పెళ్లి చేసుకునే యువతి పేరిట రూ.10 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో 20% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్లు వినిపించాయి. నిజానికి ఈ అంశం గత ఎన్నికల సమయంలోనే తెరపైకి వచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో యువ రైతులను పెళ్లి చేసుకునే యువతులకు రూ.2లక్షలు ప్రోత్సాహకం ఇస్తామని జేడీఎస్ అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రకటించారు. అయితే ఎన్నికల్లో ఆ పార్టీ గెలవకపోవడంతో ఈ హామీకి ప్రాధాన్యం లేకపోయింది.

కానీ ఎన్నికల సమయం నుంచి యువ రైతుల పెళ్లి సమస్య చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. రాష్ట్రంలో 30 ఏళ్లు దాటిన బ్రహ్మచారి యువ రైతుల సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితి ఏపీలో కూడా కొంతవరకు ఉందని విశ్లేషిస్తున్నారు. కర్ణాటకకు సమీపంలో ఉండే అనంతపురం జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగుతోందని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అసెంబ్లీలో ఒకసారి ప్రస్తావించారు. కాకపోతే కర్ణాటకలో మాదిరిగా ఏపీలో సమస్య ముదరలేదంటున్నారు. గతంలో వివాహాల కోసం వధువు తల్లిదండ్రులు కట్నం ఇచ్చేవారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోవడంతో ఎదురు కట్నాలు ఇచ్చుకునేందుకు వరుడు సిద్ధమవుతున్నా వధువు దొరకని పరిస్థితి ఉందని అంటున్నారు. మొత్తానికి అసెంబ్లీలో చర్చ తరువాత ప్రభుత్వం ఈ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తి రేపుతోంది.

# అది 'ప్రాణాంతక వైఫల్యమే'!

## సునీత యాత్రా ప్రమాదంపై నాసా తాజా నివేదిక



భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ 8రోజుల రోదసి యాత్రకు వెళ్లి.. 9 నెలలపాటు అంతరిక్షంలో ఉండిపోవాల్సి రావడం 'ప్రాణాంతక వైఫల్యం'గా అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తాజా నివేదికలో పొందుపర్చింది. దానిని 'టైప్-ఏ' ప్రమాదంగా అభివర్ణించడం ఏరోస్పేస్ ఇండస్ట్రీని షాక్‌కు గురి చేసే అంశమే. సాధారణంగా అత్యంత విపత్కర యాక్సిడెంట్లను మాత్రమే 'టైప్-ఏ'గా గుర్తిస్తారు. 2003లో జరిగిన కొలంబియా షటిల్ డిజాస్టర్‌ను 'టైప్-ఏ' ప్రమాదంగా పిలిచారు. ఆ ప్రమాదంలోనే భారత అమెరికన్ వ్యోమగామి కల్పనా చావ్లా సహా మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కూడా ఇంజినీర్ల ఆందోళనలను పట్టించుకోకుండా మిషన్‌ను ప్రయోగించడంతో విషాదం చోటుచేసుకుంది.

ఇదిలావుంటే, వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ మిషన్‌పై నాసా 311 పేజీల నివేదిక విడుదల చేసింది. దీనిపై నాసా చీఫ్ జేర్డ్ ఐజాక్ మ్యాన్ కీలక వ్యాఖ్యలు చేస్తూ.. భద్రతాపరమైన హెచ్చరికలను విస్మరించి నాటి నాసా మేనేజ్మెంట్, బోయింగ్ మిషన్‌పై ముందుకెళ్లారన్నారు. "2024 జూన్‌లో ఈ మిషన్‌ను ప్రయోగించిన వెంటనే సమస్య మొదలైంది. రాకెట్‌కు థ్రస్టును ఉత్పత్తి చేసే స్పేస్ క్రాఫ్ట్ ప్రొపల్షన్ వ్యవస్థ విఫలమవడం ప్రారంభించింది. స్పేస్ స్టేషన్‌కు సమీపిస్తుండగానే ఐదు థ్రస్టర్లు పనిచేయడం ఆగిపోయాయి. దీనికితోడు హీలియం లీకేజీ మరింత భయపెట్టింది. అయితే, అదృష్టవశాత్తూ డాకింగ్ సురక్షితంగా పూర్తవడంతో వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగలిగారు" అని నివేదికలో వెల్లడించారు. భద్రతాపరమైన ప్రోటోకాల్స్‌ను పక్కనబెట్టి ప్రయోగాన్ని అనుకున్న షెడ్యూలు చేపట్టేలా నాసా మేనేజర్లపై ఒత్తిడి తెచ్చినట్టు దర్యాప్తులో గుర్తించారు. ఈ మిషన్‌ను 'టైప్-ఏ' వైఫల్యంగా ధ్రువీకరించడంతో వ్యోమగాముల ప్రాణాలను ఫణంగాపెట్టి ప్రయోగం చేపట్టామని నాసా అంగీకరించినట్టయ్యింది.

గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్లు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం 8 రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు కారణంగా వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. అనంతరం వీరిని తీసుకొచ్చేందుకు బోయింగ్ అనేక ప్రయత్నాలు చేసింది. చివరకు తొమ్మిది నెలల తర్వాత 2025 మార్చిలో వీరిద్దరూ సురక్షితంగా భూమిని చేరుకోవడం తెలిసిందే.

# 'ప్రపంచం ముందుకు ఏలియన్స్ సీక్రెట్స్ ఫైల్స్'



అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర వాసుల గుట్టు (సమాచారం) బహిర్గతం చేస్తానని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఏలియన్ల సమాచారమున్న ప్రభుత్వ ఫైళ్లను గుర్తించి, విడుదల చేయాలని ఈమేరకు ఫెడరల్ ఏజెన్సీలకు మార్గదర్శకాలు జారీ చేశారు.

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో గహాంతర వాసుల సమాచారం గురించి మాట్లాడిన నేపథ్యంలో ట్రంప్ సమాఖ్య సంస్థలకు తాజాగా ఈ మార్గదర్శకాలు జారీ చేశారు. దశాబ్దాలుగా అనేకమంది అమెరికన్లు తమ ప్రభుత్వంవద్ద ఉన్న గ్రహాంతర జీవుల సమాచారాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని ట్రంప్ అన్నారు. అందుకే వాటికి సంబంధించిన ముఖ్యమైన.. ఆసక్తికరమైన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ఒబామా గ్రహాంతర వాసుల ఉనికి గురించి మాట్లాడుతూ ఓ రహస్య విషయాన్ని వెల్లడించారని ట్రంప్ మండిపడ్డారు. ఆయన అలా చేసి ఉండకూడదన్నారు. అయితే ఒబామా చెప్పిన రహస్యం ఏంటనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

**ఒబామా ఏమన్నారంటే..?**

గతవారం ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఒబామా ఏదోక గ్రహంపై గ్రహాంతరవాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానన్నారు. కానీ.. ఏలియన్స్‌ను అమెరికాలోని నెవాడలో ఉన్న అత్యంత రహస్య ప్రాంతం 'ఏరియా 51'లో యూఎస్ ప్రభుత్వం నిర్బంధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని పేర్కొన్నారు. గ్రహాంతరవాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్టు తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు. తనకు తెలిసినంతవరకు ఏరియా 51లో ఎటువంటి భూగర్భ కేంద్రాలు లేవని.. ఒకవేళ ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియవన్నారు.

# ఫ్లోరిడా ఎయిర్‌పోర్టుకు ట్రంప్ పేరు



ఫ్లోరిడాలోని పామ్ బీచ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టనున్నారు. సంబంధిత బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ త్వరలోనే దీనిపై సంతకం చేయనున్నారు. ఈ ఎయిర్‌పోర్టు పేరు మార్పునకు ఫెడరల్ ఏవియేషన్ ఆమోదం అవసరం. ట్రంప్ నివాసం 'మార్ ఎ లాగో'కు కొద్ది దూరంలోనే ఉన్న ఈ ప్రాంతం ఇసుక బీచ్లు, లగ్జరీ ఎస్టేట్లకు ప్రసిద్ధి. స్థిరాస్తి వ్యాపారంలో ఉన్న ట్రంప్‌నకు ఆయన పేరుతో ప్రపంచవ్యాప్తంగా అనేక భవనాలున్నాయి. అయితే, అమెరికాలోని ప్రముఖ ప్రాంతాలకు తన పేరు ఉండాలని భావిస్తున్న ట్రంప్.. ఇందుకోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. వాషింగ్టన్‌లోని కెనడీ స్మారక కాంప్లెక్స్ పేరును 'ట్రంప్-కెనడీ సెంటర్'గా మార్చేందుకు ఇప్పటికే ఆమోదం తెలిపారు. న్యూయార్క్ పెన్ స్టేషన్‌తోపాటు వాషింగ్టన్‌లోని డల్లెస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్లకు తన పేరు పెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ తీవ్ర వ్యతిరేకత వచ్చినట్టు సమాచారం.

# 'బాలికకు షాకులిస్తుంటే.. మాజీ యువరాజు అక్కడే ఉన్నాడు'



ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ బ్రిటన్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఆ దేశ రాజ కుటుంబానికి చెందిన మాజీ యువరాజు ఆండ్రూమౌంట్ బాటెన్-విండ్సర్‌ను పోలీసులు అరెస్టు చేసి, వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన గురించి మరిన్ని ఆరోపణలు బయటకు వచ్చాయి. బ్రిటన్ మీడియా కథనాల ప్రకారం.. ఆరు నుంచి ఎనిమిదేళ్ల వయసున్న బాలికకు సెక్స్ రాకెట్ నేరస్థుడు ఎప్‌స్టీన్ ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చి హింసించాడని, అప్పుడు ఆండ్రూ అక్కడే ఉన్నాడని కథనాలు పేర్కొన్నాయి. ఆ బాలికను టేబుల్‌పై బంధించి ఈ అరాచకానికి పాల్పడ్డారని ఓ గుర్తు తెలియని వ్యక్తి సమాచారమిచ్చారు. ఈ ఆరోపణలు ఎఫ్‌బిఐ (అమెరికాకు చెందిన లా ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీ) పత్రాల్లో ఉన్నాయి. ఈ ఘటన బ్రిటన్‌లోని ప్రొగ్నోర్ కాటేజ్‌లో జరిగిందని కథనాలు వెల్లడించాయి. అయితే ఆండ్రూ మాత్రం తనపై వచ్చిన ఈ ఆరోపణలను ఎప్పటికప్పుడు ఖండించారు.

# 17వ అంతస్తునుంచి పడి మిలియనీర్ అనుమానాస్పద మృతి





ప్రముఖ ఫ్యాషన్ డిజైన్ కంపెనీ ఆసస్ సహ వ్యవస్థాపకుడు క్వెంటిన్ గ్రిఫిత్స్ (58) అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయారు. థాయిలాండ్‌లోని అపార్ట్‌మెంట్ 17వ అంతస్తు బాల్కనీ నుంచి కిందపడి చనిపోయారు. ఎమర్జెన్సీ సర్వీస్ అధికారులు వచ్చి చూసేసరికి ఆయన నేలపై నిర్జీవంగా కనిపించారు. మరణానికి ముందు అపార్ట్మెంట్ లోపల ఎలాంటి ఘర్షణ జరిగిన ఆనవాళ్లు లేవని పోలీసులు వెల్లడించారు. అయితే కుట్ర కోణాన్ని మాత్రం వారు తోసిపుచ్చలేదు. పోస్టుమార్టం పూర్తయ్యాక మృతికి గల కారణాలు తెలుస్తాయని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఆ అపార్ట్మెంట్లోనే ఆయన నివసిస్తున్నట్లు తెలుస్తోంది. బ్రిటన్ జాతీయుడైన క్వెంటిన్.. 2000లో ప్రారంభమైన ఆసస్ వ్యవస్థాపకుల్లో ఒకరు. తర్వాత అది బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదిగింది. ఈ సంస్థ ఫ్యాషన్ ఉత్పత్తులు వినియోగించే వారిలో ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కేట్ మిడిల్టన్, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సతీమణి మిషెల్ ఒబామా కూడా ఉన్నారు. కాగా.. క్వెంటిన్ తన మొదటి భార్యనుంచి విడాకులు తీసుకున్న తర్వాత 2007లో థాయిలాండ్‌కు మకాం మార్చారు. అక్కడ థాయ్ మహిళను వివాహం చేసుకున్నారు. తర్వాత వారిద్దరూ విడిపోయారు. క్వెంటిను ముగ్గురు సంతానం.

అయితే ఆయనకు, థాయ్ మాజీ భార్యకు మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇద్దరూ కలిసి నడిపిన సంస్థ నుంచి ఈ మిలియనీర్ రూ.6 కోట్లు దొంగిలించారని ఆమె ఆరోపించారు. అలాగే తనకు తెలియకుండా భూమి, షేర్లను విక్రయించేందుకు దొంగ పత్రాలను సృష్టించారని ఫిర్యాదు చేయడంతో ఆయన అరెస్టయ్యారు కూడా. కానీ తనపై వచ్చిన ఆరోపణలను క్వెంటిన్ ఎప్పటికప్పుడు తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం గమనార్హం.

# ట్రంప్‌నకు బ్రిటన్ షాక్

## ఫెయిర్‌ఫోర్డ్ నుంచి ఇరాన్‌పై దాడులను అనుమతించలేమని వెల్లడి



తమ వైమానిక స్థావరం ఫెయిర్‌ఫోర్డ్ నుంచి ఇరాన్‌పై ముందస్తు దాడులకు అనుమతించేది లేదని బ్రిటన్ ప్రభుత్వం అమెరికాకు స్పష్టం చేసింది. దాడులకు అనుమతిస్తే అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించినట్టు అవుతుందని భావించిన బ్రిటన్ ప్రభుత్వం.. ఈ నిర్ణయం తీసుకున్నట్టు కథనాలు వెలువడ్డాయి. ఇరాన్‌తో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో అమెరికా తన సైనికదళాలను మోహరిస్తోంది. ఇరాన్‌ను అడ్డుకునేందుకు ముందస్తు దాడులు చేయాల్సి రావచ్చనే అంచనాతో తగు ప్రణాళికలనూ రూపొందించుకుంది. ఇందులో భాగంగా హిందూ మహాసముద్రంలోని ఛాగోస్ ద్వీప సముదాయంలోని డియేగో గార్సియా సైనిక స్థావరంతోపాటు బ్రిటన్‌లోని ఫెయిర్‌ఫోర్డ్‌ను ఎంచుకుంది. ఇరాన్ దాడులను అడ్డుకునేందుకు ఈ రెండూ కీలకమని భావిస్తోంది. డియేగో గార్సియా సైనిక స్థావరాన్ని అమెరికా, బ్రిటన్లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. బ్రిటన్ ఆధీనంలోని ఫెయిర్‌ఫోర్డ్ వైమానిక స్థావరంలో అమెరికాకు చెందిన భారీ బాంబర్స్ సిద్ధంగా ఉన్నాయి. అమెరికా భారీ బాంబర్ విమానాలకు అనుకూలమైన వైమానిక స్థావరం యావత్ యూరప్‌లో ఫెయిర్‌ఫోర్డ్ ఒక్కటే. దీంతో, అవసరమైతే ఫెయిర్‌ఫోర్డ్‌ను వినియోగించుకునేందుకు అనుమతి కోసం అమెరికా పట్టుబడుతుండగా బ్రిటన్ నిరాకరించింది.

# టాప్ జట్లు ఒకే గ్రూపులోనే...

**రసవత్తరంగా టీ20 మారనున్న సూపర్ 8 - నేడు న్యూజిలాండ్, పాకిస్తాన్ మ్యాచ్ - ఐసీసీ ప్రి సీడింగ్ ఫార్మాట్‌పై విమర్శలు**






టీ20 ప్రపంచ కప్ 2026.. గ్రూప్ స్టేజి దాదాపు ముగింపు దశకు చేరుకుంది. ఎనిమిది జట్లు సూపర్ 8కి చేరుకున్నాయి. అయితే ప్రస్తుతం చర్చంతా.. పసికూన జింబాబ్వే మీదే! ఎందుకంటారా.. ఆస్ట్రేలియా, శ్రీలంక జట్లున్న గ్రూప్‌లో జింబాబ్వే జట్టు అగ్రస్థానంలో నిలుస్తుందని ఎవరైనా అనుకుని ఉంటారా? ఈ జట్టు ధాటికి బలమైన ఆస్ట్రేలియా ప్రపంచ కప్ టోర్నీ నుంచే నిష్క్రమిస్తుందని ఎవరైనా ఊహించి ఉంటారా? అనూహ్యంగా అసాధారణమైన ప్రదర్శనతో అజేయంగా నిలిచిన జింబాబ్వే.. గ్రూప్ బిలో 'టాప్' లేపింది. ఆసీస్‌పై విజయం అదృష్టం కాదని నిరూపిస్తూ.. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకనూ చిత్తు చేసింది. అయితే సూపర్ 8లో భాగంగా భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే జట్లు గ్రూప్ 1లో ఉన్నాయి. భారత్, సఫారీలు మాత్రమే హాట్ ఫేవరెట్లు కాదని.. వెస్టిండీస్, జింబాబ్వే కూడా గట్టి పోటీనివ్వనున్నాయని క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం. దీనికి ఓ కారణం లేకపోలేదు.. లీగ్ స్టేజిలో ఈ నాలుగు జట్లు ఒక్క ఓటమిని కూడా చవి చూడలేదు. దీంతో సూపర్ 8లో గ్రూప్ 1.. ప్రతి మ్యాచ్ సెమీఫైనల్ పోరులా రసవత్తరంగా మారనుంది.

### సఫారీలు ప్రతీకారం తీర్చుకుంటారా?

ఫామ్ పరంగా చూస్తే భారత్, దక్షిణాఫ్రికా జట్లు సెమీస్‌కు ఫేవరెట్లు. ఎప్పుడైనా సరే.. సౌతాఫ్రికా జట్టు చాలా ప్రమాదకరం. ఆఖరి బంతి వరకు గెలుపు కోసం పోరాడటం వారి నైజం. దానికి టీ20 ప్రపంచ కప్ 2024 ప్రత్యక్ష ఉదాహరణ. ఫైనల్‌లో ఓడిన ప్పటికీ గట్టి పోటీనిచ్చి భారత్‌ను భయపెట్టిందనడంలో సందేహం లేదు. నాటి ఓటమికి టీమిండియాపై సఫారీలు ఇప్పుడు ప్రతీకారం తీర్చుకుంటారా? అనేది చూడాల్సి ఉంది. అలాగే వెస్టిండీస్‌ను ఏమాత్రం తక్కువగా అంచనా వేయలేం. 2016లో భారత్ వేదికగా జరిగిన టోర్నీలో టైటిల్ గెలిచిన జట్టు అదే. అంచనాలు లేకుండా బరిలోకి దిగి అసాధారణమైన ప్రదర్శన కనబర్చగల ప్లేయర్లు ఈ కరేబియన్ జట్టు సొంతం.

### గ్రూప్ 2 తేలికగా కనిపించినా..

మరోవైపు గ్రూప్ 2లో పాకిస్థాన్, ఇంగ్లాండ్, శ్రీలంక, న్యూజి లాండ్ జట్లు ఉన్నాయి. ఈ



గ్రూప్‌లోని ప్రతి జట్టు గ్రూప్ దశలో ఒక మ్యాచ్ ఓడింది. ఇంగ్లాండ్ వెస్టిండీస్ చేతిలో, న్యూజిలాండ్ దక్షిణాఫ్రికా చేతిలో, పాకిస్థాన్ భారత్ చేతిలో పరాజయం పాల య్యాయి. శ్రీలంక మాత్రం బలమైన ఆసీస్‌ను ఓడించి.. పసికూన జింబాబ్వే చేతిలో ఓడటం గమనార్హం. కాగా సూపర్ 8లో ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. జింబా బ్వే అండర్ డాగ్ కథ ఇక్కడితో ఆగుతుందా? లేక మరో సంచల నానికి నాంది పలుకుతుందా? అన్నది చూడాలి.

### సూపర్-8 ఫార్మాట్ విషయంలో ఐసీసీపై విమర్శలు..


టీ20 ప్రపంచ కప్‌లో సూపర్-8 ఫార్మాట్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కొంటోంది. ప్రీ-సీడింగ్ విధానం వల్ల టోర్నీలో అసమతుల్యత ఏర్పడిందని క్రికెట్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి.. ప్రీ-సీడింగ్ విధానం విషయంలో ఐసీసీపై క్రీడా వర్గాలు అసంతృప్తికి కారణాలున్నాయి. సాధారణంగా ఏదైనా టోర్నీలో గ్రూప్ స్టేజ్ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచిన జట్లకు తదుపరి రౌండ్లో కాస్త ఉపశమనం ఇచ్చేలా సీడింగ్ విధానం ఉంటుంది. అయితే ఈసారి ఐసీసీ టీ20 ప్రపంచ కప్-2026 టోర్నీ ప్రారంభం కాకముందే ఏ టీమ్ ఏ గ్రూపులో ఉండాలో ఫిక్స్ చేసేసింది. టోర్నీ ప్రారంభం కాకముందే సీడింగ్ వేయడంతో దీన్ని ప్రీ-సీడింగ్ అంటారు. దీని అర్థం ఏంటంటే.. ఒక టీమ్ తన గ్రూపులో మొదటి స్థానంలో నిలిచినా, రెండో స్థానంలో నిలిచి నా... ముందుగా అనుకున్న స్లాట్‌లోనే ఉంటుంది. ఈ ముందస్తు నిర్ణయం వల్ల తాజాగా ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. గ్రూప్ స్టేజ్‌లో టాపర్లుగా నిలిచిన భారత్, వెస్టిండీస్, సౌతాఫ్రికా, జింబాబ్వే జట్లు.. సూపర్ 8లో ఒకే గ్రూపులో ఉన్నాయి. మరోవైపు రెండో స్థానంలో నిలిచిన పాకిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లు మరో గ్రూపులో(గ్రూప్-2) ఉన్నాయి. ఇదే ప్రస్తు తం క్రికెట్ అభిమానులతో పాటు, క్రీడా నిపుణుల నుంచి ఐసీసీకి విమర్శలు ఎదుర్కొనేలా చేస్తోంది. ఈ విధానం కారణంగా గ్రూప్ స్టేజ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన నాలుగు జట్లలో రెండు జట్లు ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. అదే సమయంలో గ్రూప్ స్టేజ్‌లో రెండో స్థానంలో నిలిచిన రెండు జట్లకు సెమీస్‌కు చేరడం సులభమవు తోంది. ఇది టాపర్లుగా నిలిచిన జట్లకు అన్యాయం చేసినట్లే అని, ప్రతిభను గౌరవించేలా లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఐసీసీ స్పందన ఇదే..

సూపర్-8 ఫార్మాట్ విధానంపై వస్తున్న విమర్శలపై ఐసీసీ స్పందించింది. ఈ టోర్నీని భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వ హిస్తున్నందున రవాణా, భద్రత, బ్రాడ్‌కాస్టింగ్ షెడ్యూల్‌కు సంబం ధించి ముందుగానే ప్లాన్ చేసుకోవడం కోసమే ఇలా చేశామని చెబుతోంది. వేల సంఖ్యలో ప్రయాణించే అభిమానులు, మీడియా కు ఇబ్బంది కలగకుండా ఏ జట్టు ఎక్కడ ఆడుతుందో ముందే తెలిస్తే సౌకర్యంగా ఉంటుందని ఐసీసీ సమర్థించుకుంటోంది.

## తేనెటీగల దాడి..
### మైదానంలోనే అంపైర్ మృతి

క్రికెట్ మైదానంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అండ ర్ 13 మ్యాచ్‌లో అంపైర్ అనూహ్యంగా మరణించారు. మ్యాచ్ జరుగుతుండగానే తేనెటీగల గుంపు ఒక్కసారిగా దాడి చేయడంతో కాన్పూర్ క్రికెట్ సంఘం(కేసీఏ) సీనియర్ అంపైర్ మాణిక్ గుప్తా(65) ప్రాణాలు కోల్పోయారు. యూపీలోని ఉన్నావ్ జిల్లా శుక్లాగంజ్‌లో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వైఎంసీసీ, పారామౌంట్ జట్ల మధ్య కేడీఎంఏ లీగ్ మ్యాచ్‌లో జగదీశ్ శర్మ, మాణిక్ గుప్తా అంపైర్లుగా వ్యవహరించారు.



మ్యాచ్ జరుగుతుండగా తేనెటీగల గుంపు మైదానంలోని అంపైర్లు, ఆటగాళ్లపై దాడి చేసింది. సుమారు 10 నిమిషాల పాటు అవి బీభత్సం సృష్టించాయి. ప్రాణాలు కాపాడుకోవడానికి ఆటగాళ్లు, అధికారులు పరుగులు తీశారు. ఈ క్రమంలో మాణిక్‌తో పాటు మరో అంపైర్, పలువురు ఆటగాళ్లు తీవ్రంగా గాయపడ్డారు. అపస్మారక స్థితికి చేరుకున్న మాణిక్‌ను వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా.. ఆయన అప్పటికే మృతిచెం దినట్లు వైద్యులు తెలిపారు. కాగా సుమారు 30 ఏళ్లుగా కేసీఏ అంపైర్ ప్యానెల్‌లో మాణిక్ సభ్యుడి గా ఉన్నారు.

## కర్ణాటక 15వ సారి.. రంజీట్రోఫీ ఫైనల్‌కు చేరిక

**24 నుంచి జమ్మూ కశ్మీర్‌తో అమీతుమీ**

లఖ్‌నవూ: కర్ణాటక జట్టు 15వసారి ప్రతిష్ఠాత్మక రంజీట్రోఫీ ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఉత్తరాఖండ్‌తో ఇక్కడ జరిగిన సెమీ ఫైనల్లో..మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా టైటిల్ ఫైట్‌కు చేరింది. ఈనెల 24 నుంచి హుబ్లీలో జరిగే తుది పోరులో జమ్మూ కశ్మీర్‌ను ఢీకొంటుంది. మరో సెమీఫైనల్‌లో బెంగాల్‌కు జమ్మూ షాకిచ్చిన సంగతి తెలిసిందే. ఓవర్‌నైట్ 299/6 స్కోరుతో గురువారం, రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక 323 పరుగులకు ఆలౌటైంది. రవిచంద్రన్ స్మరణ్ (127) శతక మోత మోగించాడు. కేఎల్ రాహుల్ (86 నాటౌట్) అజేయంగా నిలిచాడు. మొత్తంగా కర్ణాటక 826 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకుంది. అనంతరం 827 పరుగుల కనీవినీ ఎరుగని లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఉత్తరాఖండ్ చివరి రోజు ఆట ఆఖరికి 260/6 స్కోరు చేసింది. 11 ఏళ్ల తర్వాత కర్ణాటక ఫైనల్‌కు చేరింది.

సంక్షిప్త స్కోర్లు:

కర్ణాటక: 736, 323 (స్మరణ్ 127, కేఎల్ రాహుల్ 86 నాటౌట్, మయాంక్ మిశ్రా 4/69, అభయ్ నేగి 2/63);

ఉత్తరాఖండ్: 233, 260/6 (అవ్‌నీష్ 66, అభయ్ నేగి 57 నాటౌట్, సౌరభ్ రావత్ 53 నాటౌట్, శ్రేయాస్ గోపాల్ 3/83, ప్రసిద్ధ్ 2/17)



## అంతర్జాతీయ క్రికెట్‌కు స్టార్ క్రికెటర్ గుడ్ బై

టీ20 ప్రపంచ కప్ 2026లో మరో మ్యాచ్‌తో గ్రూప్ స్టేజ్ ముగియనుంది. దీంతో అనేక జట్ల ప్రయాణం ముగిసింది. ఎనిమిది జట్లు ఇప్పటికే సూపర్ 8 దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో కెనడా క్రికెట్ చరిత్రలోనే విజయవంతమైన ఆటగా డు, ఆ జట్టు మాజీ కెప్టెన్ నవనీత్ ధలివాల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు.



గురువారం చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా అఫ్గానిస్థాన్ జట్టుతో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్ అనంతరం తన 11 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. 37 ఏళ్ల నవనీత్ ధలివాల్ కెనడా తరఫున టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఆయన కెరీర్‌లో 48 టీ20 మ్యాచ్‌లు ఆడి 1305 పరుగులు సాధించాడు. బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గానూ జట్టును సమర్థవంతంగా నడిపించాడు. అతడి నాయకత్వంలో కెనడా జట్టు.. 29 టీ 20ల్లో 21 విజయాలను అందుకోవ డం విశేషం.

### కోచ్‌గా సరికొత్త ఇన్నింగ్స్..

మైదానాన్ని వీడినా.. క్రికెట్‌ను వీడనని నవనీత్ తెలిపాడు. కెనడాలో అట్టడుగు స్థాయిలో ఉన్న యువ క్రికెటర్లను తీర్చిదిద్దేందుకు కోచింగ్ వైపు వెళ్లనున్నట్టు ప్రకటించాడు. 19 ఏళ్ల యువ ఆటగాడు యువరాజ్ సమ్రా.. న్యూజిలాండ్‌పై సెంచరీ బాదడం చూస్తుంటే కెనడా క్రికెట్ భవిష్యత్తు ఉజ్వలంగా ఉందని తాను నమ్ముతున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశాడు. కాగా ఈ టోర్నీలో కెనడా గ్రూప్ స్టేజిలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే.



‘కపుల్ ఫ్రెండ్లీ’ టీమ్‌తో ‘డార్లింగ్’

ప్రభాస్ ముచ్చట్లు... నవ్వులే నవ్వులు

విజయవాడ పునుగులపై ‘పాన్ ఇండియా స్టార్’ ప్రేమ

# వెస్పా మీద వెళ్లి మరీ తిన్నా

టాలీవుడ్ యంగ్ హీరో సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన ‘కపుల్ ఫ్రెండ్లీ’ రీసెంట్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర యూనిట్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో స్పెషల్‌గా చిట్‌చాట్ నిర్వహించింది. ఈ సరదా సంభాషణలో ప్రభాస్ చెప్పిన కొన్ని వ్యక్తిగత జ్ఞాపకాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

చిట్‌చాట్ సందర్భంగా హీరోయిన్ మానస వారణాసి... ప్రభాస్‌ను ఒక ఆసక్తికరమైన ప్రశ్న అడిగింది. విజయవాడ పునుగులు ఎప్పుడైనా తిన్నారా? అని అడగ్గా ప్రభాస్ తన పాత రోజుల్ని గుర్తు చేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ప్రమోద్ తన బెస్ట్ ఫ్రెండ్ అని, విజయవాడలో ప్రమోద్ వాళ్ల ఇంటి దగ్గరే ఒక పునుగుల బండి ఉండేదని, సమ్మర్‌లో వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు ప్రమోద్ నాన్న వెస్పా మీద తామిద్దరినీ ఎక్కించుకుని చాలా ఫాస్ట్‌గా తీసుకెళ్లి పునుగులు తినిపించేవారన్నారు. ఆ పునుగులు రుచి అంటే తనకెంతో ఇష్టమని, అలాంటి పునుగులను తన లైఫ్‌లో మళ్లీ ఎక్కడా తినలేదని, వాటిని గుర్తు చేసుకుంటే ఇప్పుడు కూడా నోరూరుతుందని ప్రభాస్ చెప్పిన మాటలు ఫ్యాన్స్‌లో నాస్టాల్జియా రేకెత్తించాయి.

విజయవాడ అంటే పునుగులే గుర్తొస్తాయి... అక్కడి బజ్జీలు బాగున్నా, పునుగులు మాత్రం స్పెషల్ అని ఆయన స్పష్టంగా చెప్పడం విశేషం. దానికి మానస విజయవాడ పునుగులు అంటే ఎమోషన్ అని చెప్పగా ప్రభాస్ కూడా ఆ మాటకు సమ్మతించారు. ప్రతి ఊరికీ ఒక్కో స్పెషల్ ఉంటుంది. విజయవాడ అంటే పునుగులే గుర్తుకొస్తాయి. ఇప్పుడే మాట్లాడుతుంటే కూడా నోట్లో నీళ్లు ఊరుతున్నాయని ప్రభాస్ అన్నారు.

తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా విజయవాడ మీదుగా ప్రయాణించే సందర్భాల్లో వీలు కుదిరితే అక్కడి పునుగులు తింటానని ప్రభాస్ చెప్పడం విజయవాడ ఫ్యాన్స్‌ను ఆనందింపజేస్తోంది. అయితే తాను ఎక్కువగా నైట్ టైమ్‌లో ట్రావెల్ చేస్తానని, ఆ సమయానికి పునుగులు దొరకవని ఫీలైన సందర్భాలు కూడా ఉన్నాయని ప్రభాస్ పేర్కొన్నారు. ప్రభాస్‌లాంటి స్టార్ హీరో పునుగులు లాంటి సింపుల్ ఫుడ్‌పై ఇంత ప్రేమ చూపించడం అతన్ని తన అభిమానులకు మరింత దగ్గర చేస్తోంది. భారీ బడ్జెట్ సినిమాలు, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్నా.. స్థానిక రుచులపై ఆయనకు ఉన్న మమకారం దీని ద్వారా బయటపడింది.

అయితే ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతోంది. డార్లింగ్‌కు పునుగులంటే ఇంత ఇష్టమా అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ప్రభాస్, ఇలాంటి సరదా సంభాషణల్లో పాల్గొనడం అరుదే. అందుకే ఈ చిట్‌చాట్ మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. మొత్తానికి, విజయవాడ పునుగులు కేవలం ఒక వంటకం మాత్రమే కాకుండా ఒక ఎమోషన్ అని ప్రభాస్ చెప్పిన మాట ఇప్పుడు అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది.

# వరుడు ఎవరంటే?

## ఎంగేజ్మెంట్ చేసుకున్న పునర్నవి... ఫొటోస్ వైరల్



పునర్నవి భూపాలం.. తెలుగు ఆడియన్స్‌కు ఎంతో సుపరిచితురాలు. తెలుగు సినీ ఇండస్ట్రీలో చిన్న క్యారెక్టర్‌తో మొదలైంది ఆమె జర్నీ. బిగ్‌బాస్ రియాలిటీ షో తర్వాత విపరీతమైన గుర్తింపు అందుకున్నారు. ఇప్పుడామె లైఫ్‌లో మరో కొత్త జర్నీ మొదలవబోతోంది. రీసెంట్‌గా తన ప్రియుడితో నిశ్చితార్థం చేసుకున్నట్టు సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసిన స్టోరీలు చూస్తుంటే క్లారిటీ వస్తోంది.

బిగ్‌బాస్-3తో మంచి ఫాలోయింగ్

ఉయ్యాల జంపాల మూవీలో హీరోయిన్‌కు ఫ్రెండ్‌గా నటించిన పునర్నవి మంచి గుర్తింపే తెచ్చుకున్నారు. దీంతో ఈ అమ్మడికి తర్వాత పలు సినిమాల్లో అవకాశాలొచ్చాయి.కానీ ఏమంత లాభం లేకుండా పోయింది. అయితే బిగ్‌బాస్-3 మాత్రం పునర్నవి కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారింది.

బిగ్‌బాస్‌లో రాహుల్‌తో క్లోజ్‌గా..

బిగ్‌బాస్‌లో ఉన్నంత కాలం సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తో ఆమె సన్నిహితంగా ఉండటం అప్పట్లో వార్తల్లో బాగానే నిలిచింది. కానీ ఆ షో తర్వాత వారిద్దరి రిలేషన్ కంటిన్యూ అవలేదు. రాహుల్ ఇటీవలే పెళ్లి చేసుకోగా.. పునర్నవి కూడా తన లైఫ్‌లో బిజీగా ఉన్నారు. రీసెంట్‌గానే తన లైఫ్ పార్టనర్‌ను అఫీషియల్‌గా అందరికీ పరిచయం చేసిన పునర్నవి ఇప్పుడు అతనితో నిశ్చితార్థం చేసుకున్నారు.

హేమంత్ వర్మతో నిశ్చితార్థం

ఫిబ్రవరి 19న కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో పునర్నవి-హేమంత వర్మ నిశ్చితార్థం జరిగినట్టు పునర్నవి ఇన్‌స్టా స్టోరీస్ చూస్తుంటే అర్థమవుతోంది. అంతేగాక సంప్రదాయబద్ధంగా లగ్న పత్రిక కూడా రాసుకుని ఈ వేడుకను ఘనంగా నిర్వహించినట్టు తెలుస్తోంది. కాగా పునర్నవి షేర్ చేసిన ఈ ఫొటోలు చాలా సింపుల్‌గా ఉండటం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి.

చాలా కాలంగా హేమంత్ ప్రేమలో...

పునర్నవి ఎంగేజ్‌మెంట్ ఫొటోల్లో బ్లూ కలర్ శారీలో చాలా సింపుల్‌గా కనిపిస్తూనే మరింత అందంగా మెరిసి పోయింది. ఇక ఆమె చేసుకోబోయే అబ్బాయి విషయానికొస్తే పేరు హేమంత్? వృత్తిరీత్యా వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్. ప్రకృతి మధ్య జీవితాన్ని గడిపే అతని ఇన్‌స్టా ప్రొఫైల్ చూస్తే ట్రావెలింగ్, ఫొటోగ్రఫీ అంటే అతనికి బాగా ఇష్టమని తెలుస్తోంది. వీరిద్దరూ చాలా కాలం నుంచి ప్రేమలో ఉన్నట్టు సమాచారం. సోషల్ మీడియాలో పునర్నవి ఫొటోలు చూసి ఆమెకు పలువురు విషెస్ చెప్తున్నారు.

# ఆ పాత్రలో రష్మిక!

ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోతూ మల్టీ టాలెంటెడ్ అని నిరూపించుకుంటున్నారు నటి రష్మిక. ఇప్పుడు ఆమె తర్వాత ప్రాజెక్టు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం ‘కాక్టెయిల్ 2’. షాహిద్‌కపూర్ ప్రధాన పాత్రలో రానున్న ఈ సినిమాలో కృతిసనన్, రష్మిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరి పాత్రల గురించి బాలీవుడ్ మీడియాలో వచ్చిన వార్త అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ చిత్రంలో కృతి, రష్మిక స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నట్టు టాక్ వినిపిస్తోంది. ట్రయాంగిల్ లవ్ స్టోరీగా ఈ చిత్రం రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక సమాచారం రాకపోయినప్పటికీ వీరి పాత్రల గురించి ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది.

హోమీ అదజానియా దర్శకత్వంలో ‘కాక్టెయిల్ 2’ రానుంది. జనవరి 31న ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్టు టీమ్ తెలిపింది. ఇది ఎంతో ప్రత్యేకంగా నిలవనుందని ఆ సందర్భంగా దర్శకుడు వెల్లడించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. షాహిద్‌కపూర్ ఇందులో ఇప్పటివరకూ చూడని పాత్రలో కనిపిస్తాడన్నారు.



# చూడ్డానికి చిన్న హీరోనే...
# కానీ హ్యాట్రిక్ కొట్టేశాడుగా!

సుహాస్ హీరోగా, జీవీ ప్రకాశ్ శిష్యుడు గోపి అచ్చర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘హే బలవంత్’. వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సుహాస్. ఆయన తాజా చిత్రం ‘హే బలవంత్’ విలక్షణమైన టైటిల్, ఆసక్తికరమైన ప్రమోషన్లతో భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ కామెడీ డ్రామా ప్రేక్షకులను ఏ మేరకు అలరించిందో ఈ విశ్లేషణలో తెలుసుకుందాం.

ఈ సినిమా కథ అంతా కృష్ణ బలవంత్ (సుహాస్), అతని తండ్రి రావు బలవంత్ (నరేష్) చుట్టూ తిరుగుతుంది. తన తండ్రి చేసే వ్యాపారానికి వారసుడిగా వెళ్లాలని కృష్ణ చిన్నప్పటి నుంచీ ఆశపడతాడు. కానీ ఆ వ్యాపారం ఏంటనేది తండ్రి అతనికి రహస్యంగా ఉంచుతాడు. ఒకానొక దశలో ఆ వ్యాపారం వెనుక ఉన్న నగ్న సత్యాన్ని తెలుసుకున్న కృష్ణ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురవుతాడు. సమాజంలో విమర్శలు ఎదుర్కొనే ఆ పనిని ఆపేయాలని చూసినా.. రాజకీయ పరిస్థితులు, తన ప్రేమ వ్యవహారం అతన్ని ఎలా ఇబ్బందుల్లోకి నెట్టాయి? చివరికి కృష్ణ తన తండ్రిని మార్చగలిగాడా? లేదా? అనే అంశాలను దర్శకుడు వినోదాత్మకంగా చెప్పే ప్రయత్నం చేశాడు.

**నటీనటుల ప్రతిభ:**

నటుడిగా సుహాస్ స్థాయి ఈ సినిమాతో మరో మెట్టు ఎక్కిందని చెప్పవచ్చు. ఓ సామాన్య మధ్య తరగతి యువకుడిగా, కామెడీ టైమింగ్‌తో పలకరిస్తూనే ఎమోషనల్ సీన్లలో కళ్లతోనే హావభావాలు పలికించాడు. తండ్రిగా నరేష్ తన అనుభవాన్నంతా రంగరించి నటించారు. వీరిద్దరి మధ్య వచ్చే తండ్రీకొడుకుల సన్నివేశాలు సినిమాకు ప్రాణం పోశాయి. ఇక శివాని నగరం ఉన్నంతలో అందంగా కనిపిస్తూ మెప్పించింది. నెల్లూరు సుదర్శన్, వెన్నెల కిషోర్ తమదైన శైలిలో నవ్వులు పూయించి ప్రేక్షకులకు మంచి ఉపశమనాన్ని ఇచ్చారు.

**ప్లస్ పాయింట్స్:**

సినిమాలో ప్రధాన బలం ఫస్టాఫ్. తండ్రి రహస్య వ్యాపారంపై సాగే సస్పెన్స్ ప్రేక్షకులను సీట్లకు అతుక్కుపోయేలా చేస్తుంది. ఇంటర్వెల్ బ్యాంగ్ వద్ద ఇచ్చే ట్విస్ట్ బాగుంది. నెల్లూరు సుదర్శన్ మార్కు డైలాగులు థియేటర్లో నవ్వుల జల్లు కురిపిస్తాయి.




కొన్ని ఎమోషనల్ సీన్లు, ముఖ్యంగా క్లైమాక్స్‌లో ఇచ్చే సందేశం ఆకట్టుకుంటుంది. సాంకేతికంగా చూస్తే, మాహి రెడ్డి సినిమాటోగ్రఫీ గ్రామీణ, పట్టణ వాతావరణాన్ని చక్కగా బంధించింది.

***మైనస్ పాయింట్స్:*** తొలి సగం పకడ్బందీగా సాగినప్పటికీ.. మలి సగంలో కథనం నెమ్మదించింది. క్రైమ్, పొలిటికల్ ఎలిమెంట్స్‌ను కథలోకి తీసుకురావడంతో అసలు కామెడీ డ్రామా కాస్త పక్కదారి పట్టినట్లు అనిపిస్తుంది. కొన్ని సన్నివేశాలు సుదీర్ఘంగా సాగదీసినట్లు అనిపించి బోర్ కొట్టిస్తాయి. శివాని నగరం పాత్రకు మరింత ప్రాధాన్యత ఇచ్చి ఉంటే బాగుండేది. అలాగే తండ్రి చేసే వ్యాపారాన్ని సమర్థించే తీరు అందరు ప్రేక్షకులకు రుచించక పోవచ్చు. దర్శకుడు కథపై పెట్టిన శ్రద్ధ స్క్రీన్‌ప్లేపై పెట్టి ఉంటే సినిమా ఫలితం మరోలా ఉండేది.

***సాంకేతిక పనితీరు:*** దర్శకుడు గోపి అచ్చర తన తొలి ప్రయత్నంలోనే ఒక సామాజిక అంశానికి కామెడీని జోడించి చెప్పాలనుకోవడం అభినందనీయం. వివేక్ సాగర్ సంగీతం సన్నివేశాలకు తగ్గట్టుగా ఉన్నా, వినగానే గుర్తుండిపోయే పాటలు లేకపోవడం మైనస్. ఎడిటింగ్ విభాగం రెండో భాగంలో మరికొంత కత్తెరకు పని చెప్పాల్సింది.

***ముగింపు:*** ‘హే బలవంత్’ చిత్రం పక్కాగా వినోదాన్ని కోరుకునే వారికి, సుహాస్ అభిమానులకు నచ్చుతుంది. కథలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ, వీకెండ్‌లో సరదాగా కాలక్షేపం చేయడానికి ఈ సినిమా ఒక మంచి ఆప్షన్. అయితే, అంచనాలు మరీ భారీగా పెట్టుకోకుండా వెళ్తే ఈ ‘బలవంతుడు’ మిమ్మల్ని నిరాశపరచడు.

చైతన్యరథం

దేవదేవుడి పవిత్రతను దెబ్బతీస్తూ.. కల్తీ నెయ్యి ఘట్టంతో మహా పాపానికి ఒడిగట్టింది వైసీపీ. ఇప్పుడు చట్టసభ సాక్షిగా -దేవదేవుడి చిత్రపటాలను పొలిటికల్ పోస్టర్ల మాదిరి ప్రదర్శించి మహా ఘోరానికి ఒడిగట్టింది. జగన్ చేస్తున్న... చేయిస్తున్న మత విశ్వాస వ్యతిరేక చర్యలు చూస్తుంటే.. హిందువులను కావాలనే రెచ్చగొడుతున్నాడా? గోవిందుని కావాలనే అపవిత్రం చేస్తున్నాడా? కల్తీ నెయ్యి ఘట్టం నుంచే ఇంకా తేరుకోలేకపోతున్న వెంకన్న భక్తకోటి.. వైసీపీ తాజా దురాగత చర్యపై నిప్పులు చెరుగుతున్నారు. మత విశ్వాసాన్ని దెబ్బతీసే హక్కు వైసీపీకి ఎక్కడిదంటూ నిలదీస్తున్నారు. ఐదేళ్ల జగన్ దౌర్భాగ్య పాలనపైనే కఠినాతి కఠినమైన తీర్పునిచ్చిన రాష్ట్ర ప్రజానీకం.. వైసీపీ తాజా మహాపాపానికి ఎన్నేళ్ల శిక్ష విధిస్తారో చూడాలి.

